## వరల్డ్ ఫస్ట్ సీఎన్‌జీ స్కూటర్



దేశీయ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ స్కూటర్‌ను తెచ్చింది. జూపిటర్ 125 సీఎన్జీ పేరుతో 'భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025 లో ఈ ఫస్ట్ సీఎన్జీ స్కూటర్‌ను ఆవిష్కరించింది.


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం, 19 జనవరి 2025 సంపుటి: 9 సంచిక: 25 పేజీలు: 12 వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మహాకుంభ స్నానం



2

## ఎవరి పేరు వారే మార్చుకోవచ్చు

అకౌంట్ ట్రాన్స్‌ఫర్ కూడా చేసుకోవచ్చు

పీఎఫ్ ఖాతా విషయంలో కొత్త వెసులుబాట్లు



ఢిల్లీః ఉద్యోగ భవిష్యనిధి సంస్థ ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం తీసుకుంది. పీఎఫ్ చందాదారుల పేరు, పుట్టిన తేదీ తదితర వివరాలను మార్చుకోవడాన్ని సులభతరం చేసింది. ఇకపై యజమాని(ఎంప్లాయర్), ఈపీఎఫ్ఓ ఆమోదం అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే సులువుగా మార్చుకునే వీలు కల్పించింది. ఈ-కేవైసీ పూర్తి చేసిన ఈపీఎఫ్ ఖాతాలను ...మిగతా 2లో

## పేర్లు లేకపోతే పరేషాన్ కావొద్దు


రేషన్ కార్డులను నిరంతరం జారీ చేస్తూనే ఉంటం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 18 (మనం న్యూస్)ః రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అర్హులకు రేషన్ కార్డులు అందేవరకు ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రానివారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం ...మిగతా 2లో



# డేటా సెంటర్ల రాజధానిగా హైదరాబాద్



### మీర్ఖాన్ పేటలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ క్యాంపస్

- రూ.3500 కోట్ల పెట్టుబడులకు సింగపూర్ కంపెనీ ఎస్‌టీటీతో ఒప్పందం
- తెలంగాణ ప్రభుత్వ ప్రగతి శీల విధానాలు సాంకేతిక ఆవిష్కరణలకు ప్రోత్సాహకరంగా ఉన్నాయన్న ఎస్‌టీటీ గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్

హైదరాబాద్ 18, (మనం న్యూస్)ః ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం రెండో రోజు పర్యటన విజయవంతమైంది. రాష్ట్రంలో రూ.3500 కోట్ల పెట్టుబడులకు ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. ముచ్చర్ల సమీపంలోని మీర్ఖాన్‌పేటలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ క్యాంపస్‌ను స్థాపించేందుకు ఈ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డి,ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సింగపూర్‌లోని ఎస్టీటీ గ్లోబల్ డేటా సెంటర్ ఆఫీస్‌ను సందర్శించి కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ముఖ్యమంత్రి సమక్షంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్‌టీటీ గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే డేటా సెంటర్లకు హైదరాబాద్ రాజధానిగా అవతరిస్తుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల నిర్ణయం తీసుకున్నందుకు కంపెనీ ప్రతినిధులను అభినందించారు. తెలంగాణతో కలసి పనిచేయడం గౌరవంగా ఉందనీ, ఎస్టీటీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ప్రసిడెంట్, సీఈవో బ్రూనో లోపెజ్ అన్నారు. మౌలిక సదుపాయాలతో పాటు తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రగతిశీల విధానాలు సాంకేతిక ఆవిష్కరణలు ప్రోత్సాహంగా ...మిగతా 2లో

కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార కేసు..

# సంజయ్‌రాయే దోషి



- దేశవ్యాప్తంగా కలకలం రేపిన ఈ కేసులో శిక్షను రేపు ప్రకటించనున్న సుప్రీం కోర్టు
- తీర్పు వింటూ కన్నీటి పర్యంతమైన మృతురాలి తండ్రి

కోల్‌కతాః దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసులో సీబీఐ కోర్టు తీర్పు చెప్పింది. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న సంజయ్‌రాయ్‌ను న్యాయస్థానం దోషిగా తేల్చింది. సోమవారం శిక్ష ఖరారు చేయనుంది. 2024 ఆగస్టు 9వ తేదీన ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హతమార్చిన ఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. ఘటనపై దర్యాప్తు చేసిన సీబీఐ కోర్టుకు సమర్పించిన ఆధారాలతో కోర్టు దోషిని నిర్ధారించింది. తీర్పు ...మిగతా 2లో

దోషులందరికీ శిక్ష వేయాలె.. 2

## ఉగాది నుంచి గద్దర్ అవార్డులు

- హైదరాబాద్‌ను ఫిల్మ్ డెస్టినేషన్ సెంటర్‌గా అభివృద్ధి చేస్తం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ 18, (మనం న్యూస్)ః ఈ ఏడాది ఉగాది నుంచి గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డులను అందజేయనున్నట్లు రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈమేరకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కమిటీ సభ్యులు, అధికారులను ఆదేశించారు. ఈమేరకు శనివారం సచివాలయంలో జరిగిన గద్దర్ అవార్డుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషలో నిర్మించిన ...మిగతా 2లో



వారంలో కొత్త అధ్యక్షుడొస్తడు..

# ఆరెస్సెస్ బ్యాక్‌గ్రౌండ్ అవసరం లేదు

బీజేపీ అధ్యక్షునికి ఈ నేపథ్యం ఉండాలన్న రూలేం లేదు

- స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ
- బీఆర్ఎస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ
- రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తే ఢిల్లీలో ఓట్లు పడ్తయా?
- మీడియాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చిట్‌చాట్

2

# తక్షణమే అటవీ అనుమతులిస్తం


సీఎం రేవంత్ చొరవ అభినందనీయం

- కేంద్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ జితేంద్ర కుమార్
- 'ఏక్ పేడ్ మా కే నామ్'పై ప్రత్యేక చర్చ

హైదరాబాద్, జనవరి 18 (మనం న్యూస్)ః తెలంగాణ ప్రజలకు సత్వరమే ఉపయోగపడే ప్రాజెక్టుల విషయంలో అనుమతులు వెంటనే మంజూరు చేస్తామని డెరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ జితేంద్ర కుమార్ వెల్లడించారు. సంబంధిత ప్రాజెక్టుల వివరాలు పూర్తి స్థాయిలో కేంద్రానికి అందజేస్తే అనుమతుల్లో జాప్యం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో ...మిగతా 2లో

బీజాపూర్ ఎన్‌కౌంటర్..

## బడే చొక్కారావు మృతి



9

## వారికి ఉచిత విద్యుత్, నీరు: కేజ్రీవాల్

9

సైఫ్‌పై దాడి కేసు..

## ఛత్తీస్‌గఢ్‌లో నిందితుడి అరెస్ట్



9

# త్వరలో అఫర్డబుల్ హౌజింగ్ పాలసీ

మధ్య తరగతి ప్రజలందరికీ ఇండ్లు కట్టిస్తం

హౌజింగ్ బోర్డు భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

పొంగులేటితో హిమాచల్ హౌజింగ్ మంత్రి ధర్మాని భేటీ



హైదరాబాద్, జనవరి 18 (మనం న్యూస్)ః రాష్ట్రంలో కొత్తగా తెలంగాణలో అఫర్డబుల్ హౌసింగ్ పాలసీని తీసుకు రావడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యలో మధ్య తరగతి ప్రజల కోసం కేపీహెచ్‌బి తరహాలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటితో హిమాచల్ హౌసింగ్ శాఖ మంత్రి రాజేష్ ధర్మాని భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న గృహ నిర్మాణ పథకాల గురించి మంత్రిని అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు. హౌసింగ్ నియమ నిబంధనల మేరకు అందుబాటులో ఉన్న బోర్డు స్థలాలలో కొత్తగా గృహ నిర్మాణానికి సంబంధించిన పథకాలను అమలు చేయాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో అఫర్డబుల్ గృహ పథకాల అమలుకు చర్యలు ...మిగతా 2లో

ఎన్టీఆర్ అనేది పేరు కాదు..

# అదొక ప్రభంజనం

- తెలంగాణలో టీడీపీని పునరుద్ధరిస్తం
- త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ



2

# ఆస్తి కార్డులు అందించిన మోడీ

'స్వామిత్వ' పథకం కింద వర్చువల్‌గా పంపిణీ చేసిన ప్రధాని

10 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 230 జిల్లాల్లో 65 లక్షల లబ్ధిదారులు



ఢిల్లీః గ్రామీణ ప్రజలకు సాధికారికత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వామిత్వ (సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్ (ఎస్వీఏఎంఐటీవీఏ.. స్వామిత్వ) పథకం కింద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు ఆస్తి కార్డులను పంపిణీ చేశారు. శనివారం వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన దాదాపు 65 లక్షల మందికి పైగా కార్డులు అందించారు. ఈ పథకం కింద దేశంలోని 10 రాష్ట్రాలు, ...మిగతా 2లో


## సుధా బ్యాంక్

సుధా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి॥

H/o. వాణిజ్య భవన్ ఎదురుగా, సూర్యాపేట, ఫోన్: 08684 - 222111

నేడే 25వ వార్షికోత్సవ రజతోత్సవ వేడుకలు

వాటాదారులకు, ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు స్వాగతం.

వేదిక : త్రివేణి గార్డెన్స్ ఫంక్షన్ హాల్

సమయం : సా॥ 6 గం॥లకు

# ఆరెస్సెస్ బ్యాక్‌గ్రౌండ్ అవసరం లేదు

హైదరాబాద్, జనవరి 18 (మనం న్యూస్): బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం ఉండాలనే నిబంధన ఏదీ లేదనీ, ఎంపీలైనా, కాకపోయినా ఆ పదవికి నియమితులు కావొచ్చని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఏకాభిప్రాయ సాధనతోనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుని ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. బీజేపీలో ప్రస్తుతం సంస్థాగత ఎన్నికల ప్రకియ జరుగుతోందనీ, వారం రోజుల్లో రాష్ట్ర అధ్యక్షుడిని ప్రకటిస్తామని వెల్లడించారు. త్వరలో ఎన్నికలు జరుగనున్న ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందనీ, మల్క కొమురయ్య, సర్వోత్తమ్‌రెడ్డి గెలిచే అభ్యర్థులు కాబట్టే వారిని అభ్యర్థులుగా ప్రకటించామని స్పష్టం చేశారు. ఇప్పటికే కొత్త సభ్యత్వాలు, పోలింగ్, బూత్ కమిటీల ఎంపిక పూర్తయిందన్నారు. మండల అధ్యక్షుల ఎంపిక కూడా పూర్తయిందనీ, ఈసారి కేవలం 40 ఏళ్ల వయసున్న వారినే మండల అధ్యక్షులుగా నియమించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో వార్డు సభ్యుని నుంచి జెడ్పీ చైర్మన్ వరకు అన్ని స్థానాలకు పోటీ చేస్తామని స్పష్టం చేస్తారు. పదేండ్ల పాలనలో స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయకుండా గ్రామ పరిపాలన వ్యవస్థను భ్రష్టు పట్టించిన బీఆర్‌ఎస్, ఆ బకాయిలను విడుదల చేయలేని స్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ఇప్పటికే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీకి ఏ పార్టీతోనూ పొత్తు ఉండదనీ, ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ నగరంగా చెప్పుకునే హైదరాబాద్‌లో ఏడు నెలలుగా వీధి దీపాలు వెలగకుంటే కొత్తవి మార్చలేని స్థితిలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. గత పదేళ్లలో కేసీఆర్ తెలంగాణను అప్పుల పాల్జేస్తే సీఎం రేవంత్ నిండా ముంచుతున్నాడని ఆరోపించారు. సినీ నటుడు చిరంజీవి బీజేపీలో చేరతారనీ, పార్టీ రాజ్యసభ సభ్యత్వం ఇస్తుందంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదనీ, ఆయనే కాదు ఎవరు చేరినా స్వాగతిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో హైడ్రా కూల్చివేతలపై స్పందిస్తూ చెరువుల్లో ఆక్రమణలను కూల్చివేయడం కొత్తగా జరుగుతున్నది కాదనీ, మూసీ సుందరీకరణ పేరుతో నిరుపేదల ఇండ్లు కూల్చివేయడానికి బీజేపీ తప్పు పడుతుందని స్పష్టం చేశారు. మెట్రో విస్తరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేస్తే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ అభ్యర్థులను ఓడించడానికి ఎంఐఎం కుట్ర చేస్తుందనీ, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వత్తాసు పలకడమే ఒవైసీ సోదరులకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండే పథకాలకు మాత్రమే కేంద్రం నిధులు ఇస్తుందనీ, అంతేకాని ఇష్టం వచ్చినట్లు పథకాలు ప్రకటించి నిధులు ఇవ్వమంటే కుదరదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లో ప్రారంభించనున్న సంవిధాన్ బచావో యాత్రపై కిషన్ రెడ్డి స్పందిస్తూ అసలు రాజ్యాంగాన్ని అపహాస్యం చేసింది, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఎమర్జెన్సీ పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, అయితే, ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించని కారణంగానే గ్రామ పంచాయతీలకు కేంద్రం నిధులు విడుదల చేయడం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను అమలు చేయని రేవంత్ రెడ్డి ఢిల్లీలో వెళ్లి ప్రచారం చేస్తే ఓట్లు పడతాయా ? అని ప్రశ్నించారు.

# రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మహాకుంభ స్నానం

లక్నో: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవమైన మహాకుంభ్ మేళా-2025లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ శనివారంనాడు పాల్గొన్నారు. గంగ, యుమున, సరస్వతీ నదుల సంగమమైన త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు. గంగా హారతిలో పాల్గొన్నారు. గత ఆరు రోజులుగా జరుగుతున్న ఈ మహోత్సవంలో ఇంతవరకూ దేశ, విదేశాలకు చెందిన 7.3 కోట్ల మందికి పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. మహాకుంభోత్సవం పాల్గొనడం భగవంతుడు తనకు ఇచ్చిన అవకాశం భావిస్తున్నట్టు రాజ్నాథ్ సింగ్ తెలిపారు. ''భగవంతుడు నాకీ మహదవకాశం ఇచ్చారు. ఈరోజు సంగమంలో స్నానం చేశాను. జీవితం ధన్యమైందని అనిపించింది. సనానత ధర్మ ఆధ్యాత్మిక అనుభవానికి, భారతీయ సంస్కృతికి ప్రతీక ఈ ఉత్సవం. సామాజిక సామరస్యత, సనాతన ధర్మ ఆధ్యాత్మికత, శాస్త్రీయతలను గంగా, యమునా, సరస్వతి సంగమం చాటుచెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా విశేషంగా పాల్గొంటున్న ఈ అతిపెద్ద ఉత్సవాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌ను అభినందించి తీరాలి. ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు'' అని ఆయన చెప్పారు.

# డేటా సెంటర్ల రాజధా నిగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందించే సహకారంతో ఆర్థిక వృద్ధితో పాటు ఉపాధి కల్పన, స్థిరమైన డిజిటల్ భవిష్యత్తు నిర్మించాలనే ఉమ్మడి లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. కాగా, ఈ కంపెనీ పదేండ్లలో మన దేశంలో ఒక గిగావాట్ సామర్థ్యానికి విస్తరించాలనే భవిష్యత్తు లక్ష్యంతో తెలంగాణలో పెట్టబడులు పెడుతుండగా, దశాబ్దంలో ఈ కంపెనీ దాదాపు 3.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతుందని అంచనా.

# పేర్లు లేకపోతే పరేషాన్ కావొద్దు

(మొదటి పేజీ తరువాయి)

లేదన్నారు. కులగణన, సామాజిక, ఆర్థిక సర్వే వివరాల ఆధారంగా, పాత రేషన్ కార్డుల సమాచారం ప్రకారం అర్హుల పేర్లు నమోదు చేసినట్లు చెప్పారు. అర్హులని భావించినవారు.. ఎవరికైనా కార్డులు రాకపోతే గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు.

# ఏడాదిలో మేము ఎన్నో చేశాం

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏం చేసిండ్రు?
- రైతు రుణమాఫీ విషయంలో ప్రజల్లో అనుమానాలు అలజడి రేపుతుండ్రు : కొండా సురేఖ

హైదరాబాద్, జనవరి 18 (మనం న్యూస్): త్వరలో ఉప ఎన్నికలు వస్తాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడటం విడ్డూరమని, ఉప ఎన్నికలు రావడానికి తమ ప్రభుత్వం మైనార్టీలో లేదని తెలంగాణ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం సురేఖ మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉందని, ఆ కాలంలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని ఆమె ఘాటుగా విమర్శించారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రజల్లో లేనిపోని అనుమానాలను సృష్టిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష నేత అని, ఆయన ప్రజల తరపున పోరాటం చేయాలని, కానీ, ఇప్పటికీ బయటకు రావడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో అన్ని హామీలు అమలు చేశామని వారు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# సంజయ్‌రాయే దోషి

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో భారీ భద్రత మధ్య సంజయ్‌ను కోర్టుకు తీసుకువచ్చారు. తాను ఏ తప్పు చేయలేదని, తనను తప్పుడు కేసులో ఇరికించారని ఈ సందర్భంగా జడ్జికి సంజయ్ తెలిపాడు. అతనికి సోమవారం మాట్లాడే అవకాశం ఇస్తామని న్యాయమూర్తి వెల్లడించారు. ఈ తీర్పును తాను గౌరవిస్తున్నానని మృతురాలి తండ్రి కోర్టులో కన్నీటిపర్యంతమయ్యారు.

పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఆర్జీకర్ వైద్య కళాశాలలో పనిచేసే పీజీటీ(పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ) వైద్యురాలిపై 2024 ఆగష్టు9వ తేదీన అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేశారు. పీజీ సెకండియర్ చదువుతున్న ఆమె.. గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆస్పత్రిలోని మూడో అంతస్తులో ఉన్న సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు ప్రాథమిక శవపరీక్షలో నిర్ధారణ అయింది. మర్మాంగాలు, నోరు, కళ్ల నుంచి రక్తస్రావం జరిగినట్లు తేలింది. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య ఆమె హత్యకు గురై ఉండొచ్చని అప్పట్లో పోలీసులు ఓ అంచనాకు వచ్చారు. ఈ కేసులో సంజయ్ రాయ్‌ను నిందితుడిగా గుర్తించారు. ఈ కేసుపై దేశ వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తం కావడంతో సీబీఐ రంగంలోకి దిగింది. కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. దర్యాప్తు అనంతరం కోల్‌కతాలోని ప్రత్యేక కోర్టులో సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. స్థానిక పోలీసుల దగ్గర పౌర వలంటీరుగా పనిచేస్తున్న సంజయ్ రాయ్ ఈ నేరానికి పాల్పడ్డాడని పేర్కొంది. ఆస్పత్రి సెమినార్ హాల్లో ట్రెయినీ డాక్టర్ తన బ్రేక్ సమయంలో విశ్రాంతి తీసుకుంటుండగా ఈ ఘటన జరిగినట్లు వివరించింది. అయితే చార్జిషీటులో గ్యాంగ్‌రేప్ గురించి ప్రస్తావించలేదు. అలాగే విచారణ ముగిసినట్లూ






పేర్కొనలేదు. దాదాపు 200 మంది స్టేట్మెంట్లను సీబీఐ తన చార్జిషీటులో పేర్కొంది. సుమారు 100 మంది సాక్షులను విచారించింది. ఇవన్నీ రాయ్‌నే ప్రధాన నిందితుడుగా పేర్కొంటున్నాయని సీబీఐ వర్గాలు చార్జిషీట్లో పేర్కొన్నాయి. ఎట్టకేలకు న్యాయస్థానం సీబీఐ సమర్పించిన ఆధారాలతో సంజయ్ రాయ్‌ను దోషిగా తేల్చింది. మిగతా నిందితలు సంగతి ఏందంటూ? ఈ కేసులో పలు ప్రశ్నలను దేశవ్యాప్తంగా ప్రజలు సంధిస్తున్నారు. వీటికి సోమవారం ప్రకటించే శిక్షలో కోర్టు ఏమైనా చెబుతుందా? చూడాలి.

## దోషులందరికీ శిక్ష వేయాలె..

నేడు కోర్టులో జరుగుతున్న విచారణకు సీబీఐ తమని పిలవలేదని మృతురాలి తండ్రి పేర్కొన్నారు. తమ లాయర్ కూడా కోర్టుకు వెళ్లొద్దని చెప్పారని తెలిపారు. దర్యాప్తు చేపట్టిన నాటినుంచి సీబీఐ అధికారులు ఒకటి, రెండుసార్లు మాత్రమే తమ ఇంటికి వచ్చారన్నారు. విచారణ ఎంతవరకు వచ్చిందని ప్రశ్నిస్తే.. జరుగుతోందని మాత్రమే చెప్తున్నారని ఎటువంటి వివరాలు తమకు తెలియజేయట్లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ కూతురి గొంతుపై గాయాలున్నా స్వాబ్ సేకరించలేదని.. కేసు ఛేదించడానికి సీబీఐ ఎక్కువగా ప్రయత్నించడం లేదని ఆరోపించారు. ఈ ఘటనలో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్లుగా డీఎన్ఏ రిపోర్టులో వెల్లడైందని అధికారులు పేర్కొన్నారని తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఘటనపై విచారణ చేస్తున్న కోల్‌కతా పోలీసులు కేసును తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపణలు రావడంతో ఆగస్టు 13న కోల్‌కతా పోలీసుల నుంచి కేసును సీబీఐ స్వీకరించింది. దర్యాప్తులోభాగంగా దాదాపు 120 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసింది. దీనిలోభాగంగా ప్రత్యేక కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్ పేరును మాత్రమే చేర్చింది. సామూహిక అత్యాచారం విషయాన్ని అభియోగ పత్రంలో ప్రస్తావించలేదు. ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్ రాయ్‌ను ఆగస్టు 10న పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# ఉగాది నుంచి గద్దర్ అవార్డులు

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ చిత్రాలను గుర్తించి అవార్డులను అందజేయనున్నట్లు వెల్లడించారు. జాతీయ సమైక్యత ఐక్యతను పెంపొందించే, అత్యున్నత సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో అవార్డులు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అవార్డుల పంపిణీ జాతీయ స్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహించాలని సూచించారు. కల్చరల్ ఐకాన్ గద్దర్ ప్రతిష్టను పెంచేలా అవార్డులు ఉండాలనీ, సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేసిందనీ, అవార్డుల పంపిణీ జరగలేదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. రాష్ట్రంలో సినిమాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో ప్రతీ ఏటా అందజేయాలని నిర్ణయించిన గద్దర్ అవార్డులను ఏడాది నుంచి అందజేయనున్నట్లు వెల్లడించారు. ఫీచర్ ఫిల్మ్‌లు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాపై పుస్తకాలు వంటి వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అవార్డులలో నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం కూడా అందజేస్తారు. గద్దర్ అవార్డులకు సంబంధించి లోగోను కూడా రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు.

### జూనియర్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు

రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో 92 మంది జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లుగా, తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థలో 20 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందజేశారు. అలాగే, విద్యుత్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏను విడుదల చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ సందర్భంగా ప్రదర్శించారు.

# ఎవరి పేరు వారే మార్చుకోవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

యజమాని జోక్యం లేకుండానే ట్రాన్స్‌ఫర్ చేసుకునే మరో సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఈ రెండు సేవలను శనివారం ప్రారంభించారు. వీటివల్ల ఈపీఎఫ్ఓ ప్రక్రియ సులభతరం కావడంతో పాటు యజమానులపై పని ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు.

ఈపీఎఫ్ఓ చందాదారులకు సంబంధించి వ్యక్తిగత వివరాలైన పేరు, పుట్టిన తేదీ, లింగం, జాతీయత, తండ్రి/తల్లి పేరు, వైవాహిక స్థితి, జీవిత భాగస్వామి పేరు, ఉద్యోగంలో చేరిన తేదీ, ఉద్యోగం వీడిన తేదీ వంటి వివరాల విషయంలో సాధారణంగా తప్పులు దొర్లుతుంటాయి. వీటిని మార్చుకోవడం ఇకపై సులభతరం కానుంది.

2017 అక్టోబర్ 1 తర్వాత జారీ అయిన యూఏఎన్ చందాదారులు ఈ కొత్త సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. వివరాలు మార్చుకునేందుకు ఎలాంటి సపోర్టింగ్ డాక్యుమెంట్లు అవసరం ఉండదు.

2017 అక్టోబర్ 1 కంటే ముందు జారీ అయిన యూఏఎన్ చందాదారుల విషయంలో ఈపీఎఫ్ ఆమోదం అవసరం లేకుండానే యాజమాన్యమే అవసరమైన మార్పులు చేయొచ్చు. ఇందుకు అవసరమైన సపోర్టింగ్ డాక్యుమెంట్లను సైతం తగ్గించినట్లు మంత్రి తెలిపారు.

ఆధార్‌తో లింక్ చేయని యూఏఎన్ ఖాతాల విషయంలో ఏవైనా మార్పులు చేయాల్సిన సందర్భంలో మాత్రం యజమానికి ఫిజికల్ డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుంది. వారి వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత ఈపీఎఫ్ఓ ఆమోదం కోసం పంపించాల్సి ఉంటుంది.

### ప్రస్తుతం ఇలా..

ఉద్యోగంలో చేరిన సందర్భంలో ఆయా సంస్థలు.. పేర్లు, వైవాహిక స్థితి, సర్వీసు వివరాలు నమోదు చేయడంలో తప్పులు చేస్తుంటాయి. ఈ కరెక్షన్లు సరిచేయడానికి ఉద్యోగులు ఆన్లైన్లో సంబంధిత డాక్యుమెంట్లతో రిక్వెస్ట్ పెట్టాల్సి ఉంటుంది. ఒకసారి యజమాని వెరిఫై చేసిన తర్వాత రిక్వెస్ట్ ఈపీఎఫ్ఓ ఆమోదం కోసం పంపుతున్నారు. ఈ ప్రక్రియను జాయింట్ డిక్లరేషన్గా పేర్కొంటారు. ఒక్క 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే 8 లక్షల రిక్వెస్టులు వచ్చాయని మాండవీయ తెలిపారు. తాజా నిర్ణయంతో 45 శాతం మందికి తక్షణమే ఊరట లభిస్తుందని, మరో 50 శాతం కరెక్షన్లు యజమాని దగ్గర పరిష్కారం కానున్నాయని చెప్పారు. ఇప్పటికే ఎవరైనా సభ్యుల అభ్యర్థనలు యజమాని వద్ద పెండింగ్లో ఉంటే.. డిలీట్ చేసి కొత్త సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

### ఉద్యోగం మారినప్పుడు..

ఉద్యోగం మారినప్పుడు ఈపీఎఫ్ అకౌంట్ను సులువుగా ట్రాన్స్ఫర్ చేసుకోవచ్చు. ఇ-కేవైసీ పూర్తి చేసిన చందాదారులు ఆధార్ ఓటీపీ ఎంటర్ చేసి యజమాని జోక్యం లేకుండానే ట్రాన్స్ఫర్ చేసుకోవచ్చని మాండవీయ తెలిపారు. ఒకవేళ ఎవరైనా ట్రాన్స్ఫర్ రిక్వెస్ట్ ప్రస్తుతం ఎంప్లాయర్ వద్ద పెండింగ్లో ఉంటే.. డిలీట్ చేసి నేరుగా ఈపీఎఫ్ఓకే అభ్యర్థన పెట్టుకోవచ్చని వివరించారు. ఉద్యోగం మారిన సందర్భంలో ఈపీఎఫ్ అకౌంట్ ట్రాన్స్ఫర్ అభ్యర్థనలు ఈపీఎఫ్కు చేరడానికి సగటున 12-13 రోజుల సమయం పడుతోందని మాండవీయ అన్నారు. తాజా నిర్ణయంతో గడువు తగ్గనుందని తెలిపారు. బ్యాంకింగ్ వ్యవస్థతో సమానంగా ఈపీఎఫ్ఓ సేవలను అందించడమే లక్ష్యంగా అనేక చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు

# త్వరలో అఫర్డబుల్ హౌజింగ్ పాలసీ

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్నామని వెల్లడించారు. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన భూముల పరిరక్షణకు ఓవైపు చర్యలు తీసుకుంటూనే వివిధ కోర్టులలో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు శాశ్వత గృహాలు నిర్మించాలన్న సంకల్పంతో వచ్చే నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ఇప్పటికే లబ్దిదారుల మొదటి దశ ఎంపిక ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చిందనీ, వీలైనంత త్వరలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. లబ్దిదారులే స్వయంగా ఇండ్ల నిర్మాణం చేపట్టే సౌలభ్యం కల్పించామనీ, 400 చదరపు అడుగుల విస్తీర్ణం, వంటగది, టాయిలెట్ సౌకర్యం కలిగి ఉంటాయన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వమే రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందనీ వివరించారు. హైదరాబాద్ నగరం వేగంగా విశ్వ నగరంగా అభివృద్ధి చెందుతోందనీ, ఇప్పటికే ట్రై సిటీలు ఉండగా, ఫోర్త్ సిటీని 15 వేల ఎకరాలలో ఫ్యూచర్ సిటీగా నిర్మిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

# తక్షణమే అటవీ అనుమతులిస్తం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న అటవీ అనుమతుల పెండింగ్ విషయంపై జితేంద్ర కుమార్, పీసీసీఎఫ్ డోబ్రియాల్ అధ్యక్షతన శనివారం అరణ్యభవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ఇటీవల సీఎం రేవంత్ కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న వివిధ ప్రాజెక్టులపై చర్చించారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి అందుకు అనుగుణంగా కేంద్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్‌ను హైదరాబాద్‌కు వెళ్లాల్సిందిగా ఆదేశించింది. అందుకు సంబంధించిన సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఎక్కడెక్కడ ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి ? ఎందుకున్నాయి ? అనే విషయాల మీద అటవీ, ఆర్‌అండ్‌బి, జాతీయ రహదారుల విభాగం అధికారులను జితేంద్ర కుమార్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డోబ్రియాల్ మాట్లాడుతూ మొత్తం 161 ప్రాజెక్టులు అనుమతుల కోసం పెండింగ్‌లో ఉన్నాయనీ, అందులో ప్రధానంగా జాతీయ రహదారులకు సంబంధించిన 12 ప్రాజెక్టులు అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశంగా ఉన్నాయని తెలిపారు. జాతీయ వన్యప్రాణి బోర్డ్‌లో అనుమతి గురించి మరో 38 ప్రాజెక్టులు పెండింగ్లో ఉన్నాయనీ, వీటిలో 12 సెల్‌ఫోన్ టవర్లకు సంబంధించిన ప్రతిపాదనలు ఉండగా, పంచాయతీ రాజ్, రహదారులు, భవనాల శాఖకు సంబంధించిన రోడ్డు ప్రాజెక్టు ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. దీనికి సమాధానంగా జితేంద్ర కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో స్వయంగా సీఎం చొరవ చూపడం అభినందనీయమన్నారు. అంతకు ముందు ఆయన దక్షిణాది రాష్ట్రాల అటవీ అధికారులతో 'ఏక్ పేడ్ మా కే నామ్'(తల్లి పేరుతో చెట్టు నాటడం, నగర వన్ యోజన పథకాలపై చర్చించారు.

# నాగోబా జాతర, వసంత పంచమి ఉత్సవాలకు రండి

- మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 18 (మనం న్యూస్): ఆదిలాబాద్ జిల్లా ఖేస్లాపూర్‌లో నిర్వహించనున్న నాగోబా జాతరకు, నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో చేపట్టనున్న వసంత పంచమి ఉత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం అందింది. ఈ మేరకు శనివారం బాసర ఆలయ ఇంచార్జి ఈవో ఆర్. సుదర్శన్‌తో పాటు వేద పండితులు జూబ్లీహిల్స్‌లోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నాగోబా జాతర, వసంత పంచమి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈనెల 28 నుంచి 31 వరకు నాగోబా జాతరను, ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు వసంత పంచమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మంత్రి సురేఖకు వివరించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవ ఆహ్వాన పత్రికను మంత్రికి చదివి వినిపించారు. వేద పండితులు మంత్రి సురేఖకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను, శేషవస్త్రాలను అందించి వేదాశీర్వచనం చేశారు. ఆలయ సిబ్బంది, అర్చకులతో కలసి మంత్రి సురేఖ బాసర జ్ఞాన సరస్వతి వసంత పంచమి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేదపండితులు నవీన్ శర్మ, సంజయ్ ఆచార్యులు పాల్గొన్నారు.



# అదొక ప్రభంజనం



హైదరాబాద్, జనవరి 18 (మనం న్యూస్): ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ప్రభంజనం సృష్టించి తెదేపాను అధికారంలోకి తీసుకొచ్చారని, అనేక సంస్కరణలు తెచ్చారని చెప్పారు. తెదేపాలో కోటి మంది సభ్యత్వాలు తీసుకోవడం గర్వకారణమన్నారు. తెలుగు జాతి ఎక్కడ ఉన్నా అగ్రస్థానంలోకి ఎదగాలని లోకేశ్ ఆకాంక్షించారు. '' ''తెలంగాణలో పార్టీ పునర్నిర్మాణంపై చర్చిస్తున్నాం. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం. తెలంగాణలో 1.60 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. తెదేపాపై తెలంగాణ ప్రజలకు ప్రేమ, ఆశ ఉంది'' అని నారా లోకేశ్ తెలిపారు. ''ఎన్టీఆర్ రాజకీయాల్లో మహానాయకుడిగా రాణించారు. ఎన్టీఆర్ అనేది ఒక పేరు కాదు.. ప్రభంజనం. రెండు రూపాయలకు కిలో బియ్యం, మహిళలకు ఆస్తుల్లో సమాన వాటా తదితర సంస్కరణలు తీసుకొచ్చారు. ఆయకు తప్పనిసరిగా భారతరత్న వస్తుందని ఆశిస్తున్నాం. తెలుగు ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తాం. విశాఖ ఉక్కును కాపాడుకుంటున్నాం.

# ఆస్తి కార్డులు అందించిన మోడీ

(మొదటి పేజీ తరువాయి)

రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 230 జిల్లాల్లోని లబ్ధిదారులు కార్డులు అందుకున్నారు. గ్రామీణ ప్రజలకు సాధికారికత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వామిత్వ పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. నేడు మొత్తం 50 వేల గ్రామాల్లోని లబ్ధిదారులకు ఈ పథకం కింద ప్రయోజనం చేకూరింది. ఈసందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారిని ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. ''ఈ రోజు చారిత్రాత్మకమైన రోజు. ఒడిశా, ఛతీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్షలాది మంది ఈ పథకం ప్రయోజనాలు పొందుతున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు. లబ్ధిదారులకు నా అభినందనలు'' అని ప్రధాని పేర్కొన్నారు. ''ఐదేళ్ల క్రితం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించింది. ఇన్నేళ్లలో 1.5 కోట్ల మందికి స్వామిత్వ ఆస్తి కార్డులు పంపిణీ చేశాం. ఈ రోజు మరో 65 లక్షల కుటుంబాలు ఈ కార్డులను పొందాయి. దీంతో గ్రామాల్లోని 2.25 కోట్ల మంది తమ ఇంటికి సంబంధించిన శాశ్వత ఆస్తి కార్డులను పొందారు'' అని ప్రధాని తెలిపారు. అనంతరం రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌కు లబ్ధిదారులతో ప్రధాని మోదీ మాట్లాడారు.

# బ్యాంకులు ఎప్పటికప్పుడు తమ భద్రతా ఏర్పాట్లను సమీక్షించుకోవాలి

**● సీపీ సుధీర్ బాబు ఐపీఎస్**

**కాప్రా, జనవరి 18 (మనం న్యూస్):** సీసీటీవీ కెమెరాల ద్వారా ఇతర ఆధునిక టెక్నాలజీ తోడుతో బ్యాంకు దోపిడీలు, దొంగతనాల వంటి నేరాలను నివారించవచ్చునని కమిషనర్ అన్నారు. రాయపర్తి, బీదర్, మంగళూరులో ఇటీవల జరిగిన బ్యాంక్ దోపిడీ సంఘటనల నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో ముందస్తు నేర నివారణ చర్యలలో భాగంగా బ్యాంకులకు తగిన విధంగా భద్రత కల్పించడానికి మరియు బ్యాంకుల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టడానికి బ్యాంకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు భద్రతాపరమైన ఏర్పాట్ల గురించి నేరేడ్మెట్ లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో సిపి శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ రాచకొండ పరిధిలోని అన్ని రకాల బ్యాంకుల ప్రధాన అధికారులు మరియు ఇతర సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ మాట్లాడుతూ... బ్యాంకింగ్ రంగం అనేది సొసైటీ మనుగడకు, పలు రకాల వ్యాపార వాణిజ్య కార్యకలాపాల గమనానికి మూలస్తంభం వంటిదని పేర్కొన్నారు. ప్రజలు తమ కష్టార్జితాన్ని ఎంతో నమ్మకంతో బ్యాంకులో దాచుకుంటారని మరియు వ్యాపార వాణిజ్య కార్యకలాపాల ద్వారా తమ ఎదుగుదల కోసం బ్యాంకులపైనే ఆధారపడతారని తెలిపారు. అటువంటి బ్యాంకులకు తమ వంతు బాధ్యతగా తగిన రక్షణ కల్పించడానికి పోలీసుశాఖ చేస్తున్న దైనందిన పెట్రోలింగ్ గస్తీ విధులలో భాగంగా బ్యాంకుల పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం జరుగుతోందని పేర్కొన్నారు. అయితే రాయపర్తి, బీదర్ మరియు మంగళూరులో ఇటీవల జరిగిన బ్యాంక్ దోపిడీ సంఘటనలు బ్యాంకుల భద్రత యొక్క బలహీనతలను బయట పెట్టాయని, పోలీసు శాఖ ఎన్ని భద్రతాపరమైన చర్యలు చేపడుతున్నప్పటికీ, తమవంతుగా గస్తీ విధులు నిర్వహిస్తున్నప్పటికీ బ్యాంకులు పాటిస్తున్న పాతకాలపు లోపభూయిష్టమైన భద్రతాపరమైన ఏర్పాట్లు మరియు అజాగ్రత్త చర్యల మూలంగా కొన్ని బ్యాంకు దోపిడీల వంటి నేరాలు పునరావృతం అవుతున్నాయని కమిషనర్ తెలిపారు. ఇటీవలి ఘటనల నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని 489 బ్యాంకులను తమ అధికారులు సందర్శించి భద్రతా చర్యలను సమీక్షించినట్టు పేర్కొన్నారు. నాణ్యత లేని బ్యాంకు భవనాలు, బలహీనమైన భద్రతా ఏర్పాట్లు మరియు లాకింగ్



వ్యవస్థ, సెక్యూరిటీ గార్డులు అప్రమత్తంగా లేకపోవడం లేదా అసలు నియమించుకోకపోవడం, పాత కాలం నాటి అలారం వ్యవస్థ, సీసీటీవీలు లేకపోవడం, డేటా ఫుటేజ్ సింగిల్ బ్యాకప్ మాత్రమే ఉండడం వంటి లోపాలు కలిగిన బ్యాంకులను గుర్తించి, తీసుకోవలసిన చర్యలను కమిషనర్ బ్యాంకుల ప్రతినిధుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ బ్యాంకుల ప్రతినిధులకు భద్రతా పరమైన మౌలిక సదుపాయాల గురించి పలు విలువైన సూచనలు చేశారు. బ్యాంకు ప్రాంగణంలో అవసరమైన అన్నిచోట్ల సీసీటీవీ కెమెరాలను అమర్చుకోవాలని, దొంగతనాల వంటి నేరాల నివారణకు సీసీటీవీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడటమే కాక బ్యాంకు దోపిడీల వంటి తీవ్రమైన నేరాల పరిశోధనలో సీసీటీవీ ఫుటేజ్ అతి ముఖ్యమైన సాక్ష్యంగా నిలుస్తుందని పేర్కొన్నారు. బ్యాంకు ఎంట్రీ మరియు ఎగ్జిట్ పాయింట్లు, క్యాష్ కౌంటర్లు మరియు స్ట్రాంగ్ రూమ్లతో సహా అన్ని ముఖ్యమైన ప్రాంతాలను కవర్ చేసేలా 24/7 పనిచేసే సీసీటీవీ కెమెరాలు అమర్చాలని, ఫుటేజ్ క్లౌడ్ నిల్వ (ప్రత్యామ్నాయ నిల్వ) ఉండేలా చూసుకోవాలని మరియు బ్యాటరీతో పనిచేసే స్టోరేజ్ కలిగిన రహస్య కెమెరాలను అమర్చాలని సూచించారు. తెలంగాణ ప్రజా భద్రతా చట్టంలో నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ట్రెజరీ యొక్క సాంకేతిక భద్రత ఆర్బిఐ సూచించిన కనీస ప్రమాణాల కంటే తక్కువగా ఉండకూడదని పేర్కొన్నారు. అక్రమ చొరబాట్లు నిరోధించడానికి కిటికీలకు గ్రిల్స్ ఉండాలని, వాహన దాడులను నిరోధించడానికి కంచెలు, గేట్లు, బొల్లార్డు మరియు వాహన బారికేడ్ల వంటివి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనధికారిక యాక్సెస్ నిరోధించడానికి ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, నూతన భద్రతాపరమైన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. తమ బ్యాంకులను సైబర్ నేరగాళ్ళ నుంచి రక్షించుకోవడానికి తమ సాఫ్ట్ వెర్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ ఉండాలని అంతేకాకుండా సూచించారు. ఏటీఎంలలో డబ్బు నింపే వాహనాలకు రక్షణగా నిర్దేశిత నియమాలకు అనుగుణంగా శిక్షితులైన సిబ్బందిని కాపలాగా పంపాలని ప్రత్యేకంగా సూచించారు. బ్యాంకుల భద్రత కోసం పోలీసు వారి సూచనలను తప్పనిసరిగా పాటించాలని, అవాంఛిత సంఘటనలు తమ దృష్టికి రాగానే తక్షణమే పోలీసు వారికి సమాచారం అందించాలని బ్యాంకుల ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపి యాదాద్రి రాజేష్ చంద్ర ఐపీఎస్, డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డిసిపి మల్కాజ్గిరి పద్మజ ఐపిఎస్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, డీసీపీ ఎస్ఓటి 1 రమణా రెడ్డి, డిసిపి ఎస్ఓటి 2 మురళీధర్, ఏసీపీ ఐటీ సెల్ నరేందర్ గౌడ్, ఏసీపీ సీసీఆర్బి రమేష్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆకాంక్షల ప్రతిరూపమే బసవతారకం హాస్పిటల్

**● నందమూరి బాలకృష్ణ**

**బంజారాహిల్స్, జనవరి 18(మనం న్యూస్):** స్వర్గీయ ఎన్టీఆర్ ఆకాంక్షల ప్రతి రూపమే బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అని హాస్పిటల్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ అన్నారు.ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని బంజారాహిల్స్ లోని హాస్పిటల్ ఆవరణలో శనివారం నిర్వహించారు.ఎన్టీఆర్,బసవతారకం దంపతుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ తన తల్లి బసవతారకం క్యాన్సరుతో బాధపడి



మరణించారన్నారు.అటువంటి బాధ ఎవరికి కలుగకూడదనే సంకల్పంతో తన తల్లి బసవతారకం పేరిట క్యాన్సర్ హాస్పిటలుకు ఎన్టీఆర్ పునాదులు వేశారన్నారు.పేదలకు సైతం అంతర్జాతీయ స్థాయి క్యాన్సర్ చికిత్సను చేరువ చేశారన్నారు.హాస్పిటల్ ద్వారా ఎందరో పేదలకు పలు రకాల సహాయం, చికిత్స అందించగలుగుతున్నామని పేర్కొన్నారు.అదే సమయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులోనికి తీసుకొని వస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.ఆంధ్రప్రదేశ్ లో కూడా త్వరితగతిన హాస్పిటల్ నిర్మాణం చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఈ హాస్పిటల్ దినదినాభివృద్ధి సాధించడంలో ఎంతో దాతలు చేస్తున్న సహాయం మరువలేనిదని,రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సహకారం,సిబ్బంది నిరంతరాయ శ్రమ కూడా అందులో ఉన్నాయని చెప్పారు. అనంతరం హాస్పిటల్ లో ఉన్న ఆరోగ్య శ్రీ వార్డులను సందర్శించిన బాలకృష్ణ అక్కడ చికిత్స పొందుతున్న రోగుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. వారికి పండ్లు పంపిణీ చేసి, వారితో సెల్ఫీలు,ఫోటోలు దిగి సరదాగా గడిపారు.ఈ కార్యక్రమంలో బసవతారకం హాస్పిటల్ సీఈఓ డాక్టర్ కె.కృష్ణయ్య,మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టిఎస్ రావు,మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫణికోటేశ్వర రావు,అకాడమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా రఘునాథ్,పలువురు వైద్యులు,సిబ్బంది,రోగులు తదితరులు పాల్గొన్నారు.

# పనామా చౌరస్తాలో ఎన్టీఆర్ 28వ వర్ధంతి



**రంగారెడ్డి, జనవరి 18 (మనం న్యూస్):** తెలుగువారి ఖ్యాతిని ఖండాతరాలకు చాటి చెప్పిన మహోన్నత శక్తి నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి సందర్భంగా వనస్థలిపురం పనామా వద్ద ఉన్న వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కుమారుడు దేవిరెడ్డి ప్రీతమ్ రెడ్డి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనామా చౌరస్తాను ఎన్.టీ.ఆర్.చౌరస్తాగా నామకరణం చేయడం జరిగిందని తెలిపారు.రెండు తెలుగు రాష్ట్రాల్లో కోట్ల అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు.ఎన్.టీ.ఆర్. భారతదేశ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించారు అని తెలిపారు.తెలుగుదేశం పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లో అధికారంలోకి రావడం జరిగింది అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ భారస పార్టీ నాయకులు,టీడీపీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయులు స్వర్గీయ నందమూరి తారకరామారావు



**● ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్**

**జూబ్లీహిల్స్,జనవరి 18(మనం న్యూస్):** విశ్వ ఖ్యాతిని గడించిన నటులు స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) చిరస్మరణీయులని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ అన్నారు.ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన ఫిలింనగర్ చౌరస్తాలో శనివారం నిర్వహించారు.ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలతో ఘన నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిపించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ నటుడిగానే కాకుండా పాలనాదక్షుడిగా ఎన్టీఆర్ ఖ్యాతి గడించారని గుర్తు చేసుకున్నారు. తెలుగు ప్రజల గుండెల్లో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారని తెలిపారు. అటువంటి మహానాయకుడు, అద్భుత నటుడు అందరికీ ఆదర్శప్రాయులని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహన్ కృష్ణ,మనవరాలు మోహన రూప,పరుచూరి గోపాలకృష్ణ, ప్రొడ్యూసర్ కౌన్సిల్ సభ్యుడు ప్రసన్న, జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, యూసుఫ్ గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించండి

**● ఉద్యోగ సంఘాలతో క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ఏర్పాటు చెయ్యండి**

**● ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్కను కోరిన టీఎన్జీవోలు మారం జగదేశ్వర్, ముజీభ్**

**రంగారెడ్డి జనవరి 18 (మనం న్యూస్):** ఉద్యోగుల పెండింగ్ సమస్యలన్నిటిని వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలను వెంటనే క్యాబినెట్ సభకు ఏర్పాటు చేసి ఉద్యోగ సంఘాల నేతలతో పూర్తిస్థాయిలో చర్చించి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలన్నింటిని కూడా ప్రాధాన్యతక్రమంలో వెంటనే పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను టీఎన్జీవో కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ లు కోరారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ఒక్కటి ఒక్కటిగా




మంజూరు చేస్తున్నామని, పెండింగ్ సమస్యలను ఫిబ్రవరి మొదటి వారంలో క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం ఏర్పాటు చేసుకుని పరిష్కరిస్తామని ఉద్యోగులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇస్తూ తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, నగర శాఖ అధ్యక్షులు కట్కూరి శ్రీకాంత్, కార్యదర్శి పంతులు హరికృష్ణ, తెలంగాణ నాల్గో తరగతి రాష్ట్ర అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, ఖాదర్, మార్కెటింగ్ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి ముక్రం, ఇరిగేషన్ ఫోరం రాష్ట్ర కోశాధికారి పి. శ్రీనివాస్, ఏపీ నుండి తెలంగాణకు కు కేటాయించబడ్డ తెలంగాణ ఉద్యోగులు మహేందర్, ఖాజా, వహీద్, నర్సింగ రావు, రాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన మధుయాష్కీ గౌడ్

**రంగారెడ్డి, జనవరి 18 (మనం న్యూస్):** సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఉపశమనం పొందగలుగుతున్నారని, ప్రవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సామాన్యులకు వైద్యభారం తగ్గుతుందని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు మధుయాష్కీ ని సంప్రదించగా.. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షమేనని వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

ఎంతోమంది సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఆర్థిక ఉపశమనం పొందగలుగుతున్నారని పేర్కొన్నారు. ఎల్బీనగర్ సద్గురు నగర్ కు చెందిన కె. కైలాష్ (రూ.60, 000/-), వనస్థలిపురం లక్ష్మమ్మ (60,000-/) లకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో



శ్రీరామ్ నగర్ కాలనీ చెందిన శక్తి రోహన్ (40,500/-), హయత్ నగర్ కు చెందిన షేక్ అశ్వక్ (25,000/-) , వనస్థలిపురం కు చెందిన వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కుట్ల నరసింహ యాదవ్, కొండోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికను అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



**● జాగృతి ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి**

**రంగారెడ్డి, జనవరి 18 (మనం న్యూస్):** 13 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని జాగృతి ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి డిమాండ్ చేశారు. శనివారం తుర్కయంజాల్ లోని సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిందితున్ని కఠినంగా శిక్షించాలని అని అన్నారు.

మద్యం మత్తులోనే ఈ అగత్యానికి పాల్పడ్డాడని అన్నారు. ప్రభుత్వాలు మద్యాన్ని నిషేధించాలని, చాలా అగైత్యాలు మద్యం మత్తులో జరుగుతున్నాయని అన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఆర్పి డబ్ల్యూ ఏవో తెలంగాణ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కడారి అన్నపూర్ణ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షురాలు పిట్ట గడప రాణీ, జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ యాదవ్, సరస్వతి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందించిన డోకురి ప్రభాకర్ రెడ్డి




**తలకొండపల్లి, జనవరి 18(మనంన్యూస్):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని మాదాయపల్లి గ్రామానికి చెందిన తుడుం బాలమ్మ శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకురి ప్రభాకర్ రెడ్డి వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ 3,000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ శ్రీనివాస్ గౌడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కృష్ణ మాదిగ,ఎమ్మార్పీఎస్ నాయకులు తుడుం కిరణ్ మాదిగ,తుడుం సుల్తాన్,ముదిగొండ ఎల్లయ్య,దశరథం,తుడుం భాస్కర్, తుడుం రాజు,తుడుం శ్రీను,తుడుం శ్రీశైలం,ముదిగొండ అశోక్,ముదిగొండ ప్రశాంత్,కడ్తాల గణేష్,తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి ముగ్గు

రాత్రి ఆకాశంలో విరబూసిన నక్షత్రాలు
పొద్దున్నే ఇంటిముందు వాలినట్టు
ఒక్కో తారను
ముగ్గు దారంతో ముడేసి అల్లిన కవిత్వం

ముగ్గు
రంగు రెక్కలు తొడిగిన సీతాకోకచిలుక
సంబరాల సూచిక



ఆనంద డోలిక
ఒంటి మీది బనియనుకు ఎన్ని చిరుగులు ఉన్నా
పైకి కొత్త ఇస్త్రీ చొక్కా తొడుక్కున్నట్టు
గుట్టు దాచిపెట్టు మాయా దర్పణం

మూడు రోజుల పండుగ
కూలీ పనులకు సెలవులిచ్చి
ఆకలి దెయ్యానికి
తలుపు తెరిచి స్వాగతం పలుకుతున్నది

మనసులో లేక పోయినా
మాటలో మమకారం ఒలికించే వాళ్ళు
అన్నం మెత్తగా అయినట్టు

ఇంకో పలుకు ఎక్కువ మండించే వాళ్ళు
భోజనం చేశావా అంటూ ఎదురయినప్పుడల్లా
గంజి మెతుకు గొంతు జారక పోయినా
కడుపు నిండా కమ్మగ తియ్యగ త్రేన్చాలి

కొంగు చాపి వచ్చీ పోయే బిచ్చగాళ్ళ ముందు
తల తిప్పుకొని తిరగాలి
సత్య హరిశ్చంద్రుడయినా
అసత్య మాల ధరించాలి
అది తెస్తా ఇది తెస్తానని ఆడి తప్పని తండ్రి
మాట మార్చి చావాలి

వంటింట్లో గిన్నెలు కొట్లాడుతున్నా
వాకిట్లో
పులుగం ఉడుకుతున్న కుండ బొమ్మ గీయాలి

బ్రతుకు బండి ముందుకు కదల లేక
మొరాయిస్తున్నా
వీధి పొడవు రథం ముగ్గు వేయాలి

తిన్నా తినక పోయినా
పండుగ పూట వాకిలి

ముగ్గు దీపమై వెలుగుతూనే ఉండాలి ముగ్గు
పూట గడువని ఏడుపు గొట్టు ఇంటి ముఖానికి
నవ్వు పూల ముసుగు.


**- గజ్జెల రామకృష్ణ**
8977412795

# విద్యార్థులలో క్షీణిస్తున్న పఠనాసక్తి



21వ శతాబ్ది కంప్యూటర్ టెక్నాలజీ, సాంకేతిక పురోగామి యుగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల ఫలితంగా ఆవిష్కరింపబడిన కృత్రిమ మేధ(అఐ) మానవ మేధస్సుకే సవాలు విసురుతూ అన్ని రంగాలను శాసిస్తున్న విషయం అందరికీ విదితమే. కొన్ని సందర్భాలలో శారీరక,మేధో శ్రమల ఆధారిత రంగాల్లో కూడా పరకాయ ప్రవేశం చేసి కృత్రిమ మేధ బతుకుతెరువు (livelihood)కే సవాలు విసురుతూ మానవ మనుగడను సంక్లిష్టం చేస్తున్న సందర్భం. విద్యార్థుల చేతుల్లో ముద్రిత పుస్తకాల(printed books)కు బదులు స్మార్ట్ ఫోన్లు,e&book readers వచ్చినవి. ఈ కాలపు విద్యార్థులకు e&books(pdf), audio books అరచేతిలో ఇమిడే అండ్రాయిడ్ లోనో, e& book reader లోనో సులువుగా చదివే సౌకర్యము ఏర్పడినది. కంటి చూపు పై, మెదడుపై చెడు ప్రభావం చూపినప్పటికినీ. ఇన్ని సాంకేతిక వసతులు అరచేతిలోకి వచ్చి చేరిన తర్వాత లైబ్రరీల నుండి పుస్తకాలను అరువు తెచ్చుకోవడము, కొనుక్కోవడము డబ్బు, శ్రమలు రెండూ దండగమారి వ్యవహారంగా భావిస్తున్న సందర్భం. ముద్రిత పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని అక్షరాలను ప్రేమతో, ఆర్తితో చదివిన రోజులు గత కాలపు స్మృతులు మిగిలినవంటే అతిశయోక్తి కాదు.

ఈ మధ్యన ఒక మిత్రుడి వద్ద విద్యార్థుల్లో రోజురోజుకూ తగ్గుతున్న పుస్తక పఠనాసక్తుల గురించి విచారం వ్యక్తం చేస్తే! అతను ఒకింత వింతగా చూసి 'ఎవరన్నారు పిల్లలు పుస్తకాలు చదవడం లేదని. ఈ డిజిటల్ యుగంలో android లో,టాబ్లెట్ల అన్ని పుస్తకాల pdf లు దొరుకుతున్నపుడు షాపుల్లో కొనుక్కోవడం, లైబ్రరీల్లో అరువు తెచ్చుకోవడం శుద్ధదండగమారి వ్యవహారం అన్నాడు. అవాక్కవడం నా వంతయింది. విద్యార్థుల్లో కూడా పుస్తకాలు కేవలం తరగతిగదిలో బోధనాభ్యసనకు, పరీక్షలకు ప్రిపేర్ కావడానికి ఉపయోగపడే పనిముట్లు/పరికరాలు గానే భావిస్తున్నారు. అంతకుమించి పుస్తకపఠనం అంత సీరియస్ గా తీసుకోవాల్సిన వ్యవహారం కాదని భావిస్తున్నారు. అసలు పిల్లలు చదవడం లేదా అంటే చదువుతున్నారు కానీ ఏమి చదువుతున్నారంటే టెక్ట్స్ మెసెజులూ, వాట్సప్ ఫార్వర్డ్లు లాంటి కాలక్షేప విషయాలను చదువుతున్నారు. వేగంగా మునివేళ్లను కదిలిస్తూ అండ్రాయిడ్ స్క్రీన్లపై చేసే పుస్తక పఠనం ఎంతో సౌకర్యవంతం అయినప్పటికీ నిర్లక్ష్యంగా, మనసుపెట్టకుండా, ఎలాంటి అనుభూతి చెందకుండా పైపైన చదివే అలవాటును 'అధ్యయనం' అందామా?



నేటి యువతలో పఠనాసక్తి పతనాన్ని అధ్యయన సంస్కృతి క్షీణదశ అందామా? ఇది కేవలం మన దేశానికే పరిమితమా? ప్రపంచ వ్యాప్తంగా ఉందా? అంటే మన దేశంలో మాత్రం చాలా దేశాల కంటే ఎక్కువ స్థాయిలో ఉన్నట్లు నేటి యువతలో రోజు రోజుకు పెరుగుతున్న e&reading అలవాటును బట్టి మనం చెప్పవచ్చు. ఈ జాడ్యం కేవలం యువతలోనే ఉందని అనలేం. నిజానికి అధ్యాపకులు తమ వృత్తి నైపుణ్యాల ను మెరుగు పరచుకోవడానికి రిఫరెన్సు బుక్కులు చదవడం తప్పనిసరి. ఎంత చదివితే అన్ని కొత్త కొత్త విషయాలను నేర్చుకుని పిల్లలకు ప్రభావవంతంగా బోధించగలుగుతారు. ఎంతమంది అధ్యాపకుల ఇళ్లలో పుస్తకాల ఉన్నాయి. పిల్లలకు అధ్యయన సంస్కృతి (reading culture) ఆనవాయితీగా తమ ఇంటి నుండి, బోధించే అధ్యాపకుల నుండే అలవడుతుందనే విషయం అందరికి తెలిసినదే. బోధన, అధ్యయనం ఇష్టంతో చేయాల్సిన పని. ఎవరి ప్రోద్బలమో, పర్యవేక్షణనో అవసరం లేదు. బుద్ధిజీవులుగా మనమే ఎవరికి వారు ఈ విషయంలో ఆత్మవిమర్శ చేసుకోవాలి.

ఉన్నత స్థాయి పఠనం (higher level reading)చదువరులలో శ్రద్ధాసక్తులను కలిగించడంలో, చదివే పుస్తక సారాన్ని గ్రహించడంలో మరియు పాఠకుడు (reader) మరియు పుస్తకం మధ్య సంక్లిష్ట వివరణాత్మక పరస్పర చర్య ద్వారా తులనాత్మక, పరిశీలనాత్మక భావనలు రూపుదిద్దు కుంటాయని విద్యావేత్తల అభిప్రాయం. కాని తద్విరుద్ధంగా జరిగే e&reading తక్కువ శ్రద్ధ వ్యవధి (short term attention) అతిముఖ్యమైన వివేచన, విమర్శనాత్మక ఆలోచనలను కుంటుపరుస్తున్నవి. E-reading ముద్రిత పుస్తక పఠనానికి ఎంత మాత్రమూ ప్రత్యామ్నాయము కాజాలదు.


'పుస్తక పఠనం' అనేది భావోద్వేగ ప్రతిక్రియల (emotional responses), చిత్రణ,సృజనాత్మక రీతులను పెంపొందించు ప్రక్రియ అని విద్యావేత్తల అభిప్రాయం. శ్రద్ధాసక్తులతో చదివే పిల్లల లో ఆనందమయమైన అనుభూతియే కాకుండ మనోవైశాల్యాన్ని, విశాల దృష్టిని పెంచుతాయనడం లో ఎలాంటి సందేహంలేదు.

ఇలాంటి సంక్లిష్ట 21వ శతాబ్ది సమాచార యుగంలో ఉన్నత స్థాయి పఠనం(higher level reading) గతించిన ప్రక్రియగా(out of fashion) నిలిచినది. ఎందుకంటే మనమిపుడు ఏది సత్యమో! ఏది అసత్యమో? గుర్తించలేని నకిలీ వార్తల(fake news) అంధయుగంలో బతుకుతున్నాం. లోకమంతా కుట్ర సిద్ధాంతాలు(conspiracy theories), కుతంత్రాలు, వక్రీకరణలు(distortions), తప్పుడు సమాచారము (mis information)తో నిండిన చదువులు. విలువలు ప్రముగ్యమై మానవీయ శాస్త్రాలలాంటి శాస్త్రాలు మరుగున పడిపోయినవి. ఇలాంటి సంక్లిష్ట, సంక్షోభ సందర్భంలో యువత serious reading చేయాల్సిన ఆవశ్యకత చాలావుంది.

అధ్యయన సంస్కృతి పెంపొందడం వలన చదువరుల బుద్ధి వికసించి, మనోవైశాల్యం పెరిగి యువత కు సంస్కారాన్ని అందించి మానవీయంగా జీవించడానికి, సాటి మనుషుల పట్ల దయ, కరుణలతో మసలడానికి ప్రోద్బలం చూపుతుంది. తద్వారా మన సమాజంలో హింస, ఆడపిల్లలపై లైంగిక దాడులు, తలిదండ్రులను నిర్లక్ష్యం చేయడం లాంటి దుర్గుణాలు సమసి మానవత్వమున్న మనుషులుగా పరివర్తన చెందుతారు. బ్రిటీష్ ఇంగ్లీషు రచయిత్రి మార్గరెట్ ఆట్వుడ్ అన్నట్లు ' ఒకవేళ ఈ భూమిపై యువపాఠకులు, రచయితలు అంతరిస్తే త్వరలోనే వృద్ధ పాఠకులు, రచయితలు కూడా అంతరిస్తారు తత్ఫలితంగా అక్షరాస్యత అంతరిస్తుంది(If there are no young readers and writers there will shortly be no older ones. Literacy will be dead and democracy will be dead as well). కావున భావితరాలను అధ్యయనం వైపు మల్లించడం ద్వారానే మానవజాతి సంస్కృతులను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోగలము.

**- ప్రకాష్ కందగట్ల**
9490380537

# అజ్ఞానాంధకారంలో విద్యావంతులు



'ధనం మూలం ఇదం జగత్' అనే నానుడి వాస్తవమై మానవ జీవితాలను శాసిస్తున్నది. దుష్టుడైనా, దుర్మార్గుడైనా ధనముంటే దేవుడని కొలుస్తుందీ లోకం. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలై ఒకరికొకరికి సంబంధాలు లేని జీవితాలై మానవత్వాన్నే వెక్కిరిస్తున్నాయి. విజ్ఞానులమనుకుని విర్రవీగే విద్యావంతులు అజ్ఞాన తిమిరాంధకారంలో అలమటిస్తున్నారు. పట్టాలు ప్రతిభను ప్రసాదించడం లేదు. నేటి సమాజంలో చోటు చేసుకుంటున్న అపసవ్య ధోరణులకు లోపభూయిష్టమైన విద్యావిధానమే మూలకారణం. తల్లిదండ్రులకు విలునివ్వరు... ఎద్దలను ఆదరించరు. మచ్చుకైనా వివేకం కానరాదు. ఇవీ నేటి విద్యలు నేర్పుతున్న విలువలు! బంధాలనే బలహీనతలకు బందీగా మారి,జీవిత సర్వస్వం ధారబోసి, త్యాగాల యజ్ఞంలో సమిధలై వెలుగునిచ్చే ప్రమిధలై, కరిగిపోయే క్రొవ్వొత్తిలా కాంతినిచ్చి, చివరికి కొడిగట్టిన దీపంలా మిగిలితే పెంచుకున్న ఆశలన్నీ ఆవిరై, తాము కనిపెంచిన బిడ్డలే రెక్కలొచ్చిన పక్షుల్లా రివ్వురివ్వు మని ఎగిరిపోయి, ప్రేమల పేరుతో రాబంధుల నీడలో సేదతీరితే,అమృతాన్ని చిలికించే బంధాలన్నీ విషంలా అనిపించడంలో తప్పేముంది?ఎదలోతుల్లో పెనవేసుకున్న బంధాల సౌధాలన్నీ తమ కనుల ముందే పేకమేడల్లా కూలిపోతే, కనికరం కానరాని కఠిన హృదయాలన్నీ వేరేచోట ఆనందంగా సేదతీరుతున్నాయి.అది ఆనందం కాదని,తాము సేదతీరుతున్నది రక్షించే విహంగపు రెక్కలచాటున కాదని,భక్షించే రాబంధుల రెక్కల మాటున అని గ్రహించేలోపు జీవితం తెల్లారిపోతుంది. ఉడుకురక్తం చల్లారి పోతుంది.నడవాలంటే నీరసం, మాట్లాడాలంటే ఆయాసం ఆవహించి,తమ స్థితులు గతులు తప్పిననాడు గతాన్ని వెనక్కి తీసుకురాక,వర్తమానంలో బ్రతకలేక,భవిష్యత్తే బరువై గమ్యం కానరాని మార్గాలకు పయనమైతే అది ఆరాటమే తప్ప ఫలితం శూన్యం. నేటి యువత దాదాపుగా ఇదే దారిలో పయనిస్తున్నది. తల్లిదండ్రుల సంపాదన కావాలి. వారి యోగక్షేమాలను చూడడం వారి బాధ్యతకాదు.నలుగురిలో వారిని పరిచయం చేయడం నామోషీ, అవమానకరం. వారి సంపాదనతో నిస్సిగ్గుగా జల్సాలు చేసి,పరాన్నజీవులుగా బ్రతకడం లో లేని అవమానం,మిగిలిన విషయాల్లో కానరావడం దౌర్భాగ్యం. 'చదువు రాకముందు కాకరకాయ,చదువుకున్న తర్వాత కీకరకాయ...' అనే సామెతను తలపిస్తూ, చదవేస్తే ఉన్నమతి పోయినట్టు ప్రవర్తించే ప్రబుద్ధుల వక్రబుద్ధులు వర్ణింపశక్యంకాదు. ఇలాంటి అనుచిత ధోరణులన్నీ చదువు 'కొన్న' విద్యాధిక యువతలో అడుగడుగునా కానవస్తున్నాయి.నేటి మన విద్యావిధానంలో చోటుచేసుకుంటున్న విపరీత ధోరణులే యువత లో తలెత్తే ఉన్మాద చేష్టలకు పరాకాష్ఠ.

చదువుకున్న వారు మూర్ఖుల్లా ప్రవర్తిస్తుంటే,చదువులేని వారు జ్ఞానుల్లా ప్రవర్తిస్తున్న నేపథ్యంలో మనచదువులకున్న విలువేమిటి? తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించని విద్యలు బూడిదలో పోసిన పన్నీరే. అయినా చదువులు అంగట్లో అమ్ముడుపోయే సరుకుల్లా తయారైనాయి. చదువు 'కొంటే' చాలు చదవనక్కరలేదు. 'లేనోడికి దొరకనప్పుడు, ఉన్నోడికి అరిగినప్పుడే ఆకలి..' అన్నట్టుగా అప్పుడప్పుడూ వచ్చిపోయే అతిథుల్లా మేమూ విద్యార్థులమేనంటూ తళుక్కున మెరిసి, చట్టుక్కున మాయమైతే చాలు. పట్టా చేతికొస్తుంది. పట్టాలు లేని రైలులా సమాజంలోకి దూసుకువచ్చి, మేధావుల్లా చెలామణీ కావచ్చు. జనాలను ప్రమాదంలోకి నెట్టేయవచ్చు. డిగ్రీలు బడాయిని పెంచుతున్నాయి. అర్థంలేని భావాలను అసహ్యంగా పలికిస్తున్నాయి. నైతిక విలువలను చంపేస్తున్నాయి. తల్లిదండ్రుల పెంపకం కూడా సరిగా లేకపోవడం వలన ఎదిగిన పిల్లలు ఎదురుతిరుగుతున్నారు. తామేదో జ్ఞానులమైపోయామని పనికి రాని డిగ్రీలతో,చరవాణి చేతధరించి బడాయి పోతున్నారు. తల్లిదండ్రులు కూడా నాలుగు ఆంగ్ల పదాలను వాడి, ఫ్యాషన్లలో విహరించే పిల్లలను చూసి మురిసి పోతున్నారే గాని వారిని మూర్ఖులుగా,సమాజానికి చీడపురుగుల్లా పరాన్న జీవులుగా తయారుచేస్తున్నామని గమనించలేకపోతున్నారు. సర్వం సమకూర్చిపెట్టి, అహర్నిశలూ కష్టించి, సర్వస్వం ధారబోసి చదువులను కొని పెట్టి, సమాజానికి గుదిబండల్లా, సోమరుల్లా తయారు చేస్తున్న వారు తల్లిదండ్రులే అని చెప్పకతప్పదు.

తాము తినకుండా తమబిడ్డలకోసం సర్వస్వం త్యాగం చేస్తే, తల్లి దండ్రుల సంపాదనతో సకల భోగాలను అనుభవిస్తూ, కన్నవారినే భారంగా,అవమానంగా భావిస్తూ, వృద్ధాశ్రమాల్లోకి గెంటేసి, మానవత్వాన్నే మంట గలుపుతున్న సజీవ దృశ్యాలెన్నో మనకళ్ళెదుట కానవస్తున్నాయి. కలలన్నీ కల్లలైతే,కన్నీళ్ళే కనుపాపలకు శాపమైతే బరువెక్కిన కనురెప్పలు భారంగా కనులను కప్పేస్తున్న కథలెన్నో కన్నోళ్ళను కాటికి పంపుతున్నాయి. బరువెక్కిన హృదయాలన్నీ బడబాగ్ని కి బ్రద్ధలైతే శోకం లో కూడా ప్రేమను చూపించే గుణం తల్లి దండ్రులది. విలువలు నేర్పని బడాయి చదువులకు బలయ్యేది అంతిమంగా సమాజమే.నేటి దౌర్భాగ్యపు చదువుల సారాంశమిదే. బడాయి చదువుల సంతలో భద్రంగా బ్రతికేస్తున్నామనే భ్రమలో బద్ధకస్తులుగా తయారౌతున్న యువత ధోరణి అత్యంత ప్రమాదకరం. పిల్లొచ్చి గుడ్డును వెక్కిరించిన చందంగా తమను పెంచిన పెద్దలను తృణీకారభావంతో ఈసడించుకుంటుంటే 'కడివెడు గుమ్మడికాయ కత్తిపీటకు లోకువైనట్టుగా మౌనంగా రోదించడమే పెద్దల వంతు. సర్వత్రా ఇదే తంతు. 'తాంబూలాలిచ్చేసాం తన్నుకు చావండి' అన్నట్టుగా విద్యాలయాలన్నీ విద్యార్థుల ఆలోచనలకే అందని అత్యుత్తమ ఫలితాలనిచ్చేసి, పట్టభద్రులుగా సమాజంలోకి వదిలేస్తే వారు పట్టభద్రులు గా కాక ఉత్తభద్రులు గా తయారై విద్య అనే పదానికే ద్రోహం చేస్తున్నారు. ఈ దేశంలో పుట్టి, ఈ దేశాన్నే అవమానిస్తున్నారు.జ్ఞాన శూన్యులై - అహంకారంతో పొగరెక్కి మంచి చెడుల విచక్షణ మరచి పోయి, సంస్కారహీనుల్లా తినడానికే బ్రతికి...తిండికోసమే చస్తూ, విలాసాల్లో తేలియాడే యువత అందించే సందేశమేమిటి? మానవీయ కోణాన్ని వదిలేసి, అడ్డగోలు గా మాట్లాడుతూ, విధ్వంసకారుల్లా తయారై సమాజానికి కొరకరాని కొయ్యలా తయారైన యువతను గూర్చి ఎంత చెప్పుకున్నా తక్కువే.

విద్యావిహీనుల కంటే విద్యావంతుల వలనే సమాజానికి హానికలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీనికంతటికీ కారణం మన విద్యావ్యవస్థ లో పేరుకుపోయిన లోపభూయిష్టమైన విధానాలే. నూతన జాతీయ విద్యావిధానంతో ఇలాంటి అవసవ్యమైన పోకడలకు చోటివ్వకుండా చూడాలి. విద్యార్థులకు విలువల ఆధారిత పాఠ్యాంశాలు రూపొందించాలి. పట్టాలను ప్రధానం చేయడంలో తగిన మార్గనిర్దేశకాలు ప్రవేశపెట్టాలి. దేశభక్తి, విజ్ఞానం వినయం, వివేకం రంగరించిన విద్యలకు నూతన జాతీయ విద్యావిధానం అంకురార్పణ గావించాలి.

**- సుంకవల్లి సత్తిరాజు**
9494703463

## ప్రమాదంగా పంచభూతాలు

ప్రాణానికి ప్రశాంతత కరువైనప్పుడు
వినీలాకాశానికై చూసాను
దూది పింజల్లా ఎగరాల్సిన మేఘాలు
కాలుష్యపు కాటుకు కనుమరుగైతున్నవి
ఆశ్చర్యంతో దీర్ఘ శ్వాస తీసుకున్నాను
ఊపిరితిత్తులు పట్టేసుకున్నంత ఉక్కపోత
కార్బన్ ఉద్గరాల కాఠిన్యానికి
గాలి తన గొంతును పిసుకుంటున్నది
పొలమారిన గొంతును తడపడానికి
కాసిన్ని నీళ్లను దోసిలికెత్తుకున్నాను
భూగర్భ గంగా గరళంగా మారిందని
నీరు కన్నీరు పెట్టుకుంటున్నది

మండుతున్న సూర్యున్ని జయించడానికి
మట్టిదారులెంటా పచ్చని నీడకై వెతికాను
స్వార్థానికి బలైన చెట్లను చూసిన 'నేల'
బిడ్డలను పోగొట్టుకున్న
తల్లిలా తల్లడిల్లుతున్నది

మదన పడుతూనే గుప్పెడంత మట్టిని తోడాను
పురాతన అవశేషాలలా
బయటపడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
సౌడు కట్టే గా మార్చిన
రసాయన ఎరువుల కంపు
ముక్కుపుటలను సచ్చేలా చెరబడుతున్నా..?

కాస్తా గుండెను నిబ్బరం చేసుకుని
పంచభూతాలకు ప్రాణం పోయడానికి

రేపటి కోసం... ఒక 'విత్తనాన్ని' గోతిలో పాతి
బాధ్యత మరచిన సమాజాన్ని తలుచుకుంటూ
నీళ్లు నిండిన కళ్ళతో మళ్ళీ
నింగినే ఆశగాచూస్తున్నా..!

**- డా. ఎడ్ల కల్లేశ్**
9866765126

## మంచుకురిసే వేళలో



ఇప్పుడిక
ఒక్కో ఉదయం
ప్రకృతి సిగలో
పసిడి సితారలా
నిలిచి ఓలలాడి నిలిచి
మైమరపిస్తోంది
లతలా అల్లిన
లేలేత ఆకుపచ్చని వర్ణంలో
పదాల అంకురమై నిలుస్తోంది
పూచీ పూయని మొగ్గల్లో,
విరిసీ విరియని చేమంతుల హేమంతపు
లయల్ని రసజ్ఞులకు దృశ్యకావ్యమై
అబ్బురపరుస్తోంది
ఎటుచూసినా చూసే కళ్ళకు
ఇంద్రధనస్సు ఊయలలు
ఉక్కిరి, బిక్కిరి చేస్తున్నాయి
ఒక్కో మంచు బొట్టూ
అక్షరపాళీలోకి ఇంకి
కవన సాగులో ఖండికలై మెరుస్తుంటే
లేత ఉదయభానుడు మాత్రం
చలి,గిలిలో నక్కి మెల్లగా
ఉషోదయ కిరణాల్ని వెదజల్లుతున్నాడు

**- మహబూబ్ బాషా చిల్లెం**
9502000415

**ఎడిట్ పేజీ కోసం మీ మీ వ్యాసాలు, సామాజిక విశ్లేషణలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**– ఎడిటర్**

# సమాజ శాస్త్ర అధ్యయనంతో సమాజాన్ని కాపాడండి!



సమాజంలో విద్యనభ్యసిం చడమంటే అన్ని అంశా లలో పరిపూర్ణ జ్ఞానవం తులు కావడం . ఎలాంటి సమస్య తలెత్తిన పరిష్కరించుకునే జ్ఞాన ముండాలి. అంతేగానీ తీవ్ర ఒత్తిడికి లోనై క్షణికావేశంలో ప్రాణం మీదికి తెచ్చుకుంటారంటే కారణం దానికితగిన జ్ఞానం లేకపోవడమే . ప్రస్తుతం విద్య అంటే దానర్థం మార్చివేసి , ఒక వ్యాపారాత్మక దోరణితో చూస్తూ . . .


ఏ పాఠశాలలో చదవాలి ? ఎలా చదవాలి? ఎలా చదివించాలి? ఏ కోర్సులకు అధిక ప్రాధాన్యతనున్నది? పోటీ తీవ్రత ఎలా ఉన్నది? దానిని అధిగమించి ఈ పోటీ వ్యవస్థలో ఎలా నెగ్గాలి? రేయింబవళ్ళు ఎలా కష్టపడాలి? అందరికంటే ఎక్కువ డబ్బునెలా సంపాదించాలి? అని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, ఒక నిర్దిష్ట ప్రణాళికలను రూపొందించుకోని, వాటిని అమలుపర్చడానికి తమ పిల్లలపై పసి ప్రాయం నుండే వారి మనసులో నాటుకపోయేలా తయారుచేసి వారిపై ప్రయోగించడం జరుగుతుంది. కానీ ఈ ప్రక్రియలో పిల్లలు ఒత్తిడికి గురై, పరీక్షలలో తప్పడమో, వ్యవస్థలో చిన్నపాటి సాంకేతిక లోపాలు కలిగి, ఆశించిన ఫలితాలు రాకపోవడం వలనో, అనుకున్న లక్ష్యాలు నెరవేరలేకపోవడం వలనో లేదా అనుకున్నది సాధించి అందులో గల పనిభారంతో ఒత్తిడికి లోనవుతూ క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోని తమ ప్రాణాలను కోల్పోవడం తరుచుగా చూస్తూనే ఉంటాం.

ఇవియేగాకుండా చదువు పేరుతో పిల్లలను అతిచిన్న వయస్సులోనే కుటుంబాలకు దూరంచేసి హాస్టల్ లలో ఉంచి, ప్రేమానురాగాలకు దూరంచేస్తూ, బంధాలు, అనుబంధాలు, మానవీయ, సామాజిక విలువలు నేర్పకుండా ఒక యంత్రంలా పెంచుతున్నారనడంలో నిజం లేకపోలేదు. 'జీవితంలో డబ్బు అవసరం .అంతేగానీ డబ్బుయే జీవితం గాకూడదు'.

ప్రస్తుత సమాజంలో భార్యాభర్తలు తగాదాలు పడుతూ, విడాకుల వరకు వెళ్ళడం, పిల్లలపై ప్రేమానురాగాలు చూపించకుండా మనోవేదనకు గురిచేయడం, తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ, అవసరమైతే అనాధాశ్రయాలలో చేర్పించడం, బంధాలు, అనుబంధాలకు విలువనీయకపోవడం, సమాజంలోని సంస్కృతీ, ఆచార సాంప్రదాయాలు, కట్టుబాట్లు, విలువలను పట్టించుకోకపోవడం లాంటి వాటిని ప్రస్తుత సమాజంలో చూడవచ్చు.

అంటే ఎలాంటి చదువులను అభ్యశిస్తున్నారో తెలియకనే తెలుస్తుంది. ఇక్కడ ఒక విషయాన్నీ గమనించవచ్చు. ఒత్తిడికిలోనై పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడినప్పుడు, లేదా కుటుంబ వ్యవహారాలలో గొడవలు సంభవించి విడిపోయినప్పుడు లేదా తల్లిదండ్రులను పట్టించుకోనప్పుడు, సమాజంలో ఏం జరుగుతున్నదో పట్టించుకోకుండా కేవలం స్వార్థపూరిత ఆలోచనలు కలిగిఉన్నప్పుడు, బంధాలు, అనుబంధాలకు విలువీయకుండా ఒంటరితనాన్నికి అలవాటు పడినప్పుడు, అసలుతప్పు తెలుసుకోని బాధపడితే ఏం ప్రయోజనం చేకూరదు. 'చేతులు కాలాక ఆకులు చుట్టుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉండదు' అనేలా ఉంటుంది.

సమాజ పరిణామ క్రమంలో విద్యలో అనేక విప్లవాత్మకమైన మార్పులు సంభవించి శాస్త్ర, సాంకేతిక విద్యనభ్యసించడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుతుంది. ప్రస్తుత కాలానుగుణంగా సరియైనదే కావచ్చు. కానీ సమాజంలో వింతపోకడలకు దారితీయడం



అంత శుభపరిణామం అనిపించుకోదు. అందుకే ప్రేమ, ఆప్యాయత, వాత్సల్యం, అనురాగం, బంధాలు, అనుబంధాలు, సంస్కృతీ, ఆచార సాంప్రదాయాలు, సమాజం పట్ల అవగాహన కలిగినప్పుడే, జీవితానికి, చదువుకున్న చదువుకు ప్రయోజనం ఉంటుంది. అందుకే ప్రస్తుత సమాజంలో అత్యంత ఆధరణ పొందుతున్న కోర్సులు మెడిసిన్, ఇంజనీరింగ్, న్యాయశాస్త్రం ఇలా ఏ కోర్సు అయిన వాటిలో తప్పనిసరిగా సమాజశాస్త్రం ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఇంటర్మీడియేట్, గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో ప్రతి కోర్సులలో ఒక బోధనాంశంగా ప్రవేశపెట్టి వయస్సుకు తగినట్లుగా వారికీ సామాజికాంశాల పట్ల జ్ఞానాన్నందిస్తూ సమాజం పట్ల, వ్యక్తిగత జీవితాలపట్ల అవగాహన కల్పిస్తూ ఒక భరోసాను కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

ప్రభుత్వ కొలువులలో అత్యున్నతమైన సివిల్ సర్వీస్ పరీక్షలలో సమాజశాస్త్రం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే విదంగా ఐచ్చిక అంశంగా కల్పించారు. అదేవిదంగా ఉత్తర భారతదేశంలో మరియు పలు రాష్ట్రాలలో ప్రాధాన్యత కల్పిస్తున్న మిగతా రాష్ట్రాలలో దానికి ప్రాధాన్యతనివ్వకపోవడం వలన సమాజంలో వింతపోకడకు దారితీసే అవకాశాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారంగా గత సంవత్సరమే వివిధ కోర్సులలో బోధనాంశంగా పరిచయం చేయాల్సిఉండే కానీ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్లైన్ బోధనాంశంగా, ఐచ్ఛిక అంశంగా ప్రవేశపెట్టడానికి ప్రయత్నించడం జరుగుతుంది. కానీ అలాగాకుండా ఇంటర్మీడియెట్ స్థాయినుండి మిగతా అన్నిస్థాయిలలో, అన్ని కోర్సులలో ఖచ్చితంగా బోధనాంశంగా ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

రాష్ట్రంలో యూనివర్సిటీ స్థాయిలో పరిమిత సీట్లతో, దూరవిద్యలో సమాజశాస్త్రం ఉండటంతో ఎంతోమంది పీజీ, పిహెచ్‌డిలు చేసి, ఎలాంటి ఉద్యోగవకాశాలు లేకుండా ఎంతోమంది ఖాళీగానే ఉంటూ, వివిధ రకాల పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్న విషయం అందరికి తెలిసిందే. ఎప్పుడైతే సమాజశాస్త్రానికి తగినంత ప్రోత్సాహం, ప్రాధాన్యత కల్పిస్తే సమాజ మనుగడ సక్రమైన మార్గంలో పయనించడానికి మరియు ఆ అంశములో ప్రావీణ్యం సంపాదించిన వారికీ ఉపాదావకాశాలు కల్పించినవారవుతారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

పిల్లలను చదువుపేరుతో తీవ్ర ఒత్తిడికి గురిచేయడం లేదా బంధాలు, అనుబంధాలకు దూరంగా ఉండేటట్లు, వివిధ ప్రైవేటు హాస్టల్ వసతి కలిగిన విద్యాలయాలలో చేర్పించడం, అతిచిన్న వయస్సు నుండే మెడిసిన్, ఇంజనీరింగ్ లలో పౌండేషన్ కోర్సులంటూ తలకుమించిన భారాన్ని మోపడం లేదా తల్లిదండ్రులను వృద్దాప్యాశ్రయాలలో చేర్చడం లాంటి కార్యకలాపాలు ఎక్కువగా డబ్బులుండి, చదువుకున్న వారి కుటుంబాలలో ఎక్కువగా గమనించవచ్చు. 'పులినిచూసి నక్క వాతపెట్టుకున్నట్లు 'తమ పిల్లల మేధాశక్తిని అంచనా వేయకుండా, వారి అభిరుచిని తెలుసుకోకుండా ఒకరినిచూసి మరొకరు అదేబాటలో నడిచి తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులకు లోనుకావడం జరుగుతూ ఉంటుంది. ప్రస్తుతం ఒక మనిషిని యంత్రంలా తయారుచేయడమనేది శిశువు కడుపులో పురుడుపోసుకున్నప్పటి నుండియే మొదలవుతుంది.

కావున దీనిని మార్చడానికి వీలుకుదరనప్పుడు, ఆ వ్యవస్థలో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి కొంతమేరలో అదుపులో పెట్టాలనునుంటే సమాజశాస్త్ర ఆవశ్యకత ఏమేరలో ఉపయోగబడుతుందో తెలుసుకోని విద్యలో ప్రతిఒక్కరు చదువుకునేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఎంతైనా ఉన్నది.

ప్రస్తుతం ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సరిపోయేంత సిబ్బందిలేక, తూతూ మంత్రంగా, నామమాత్రపు విద్యనందించి, డిగ్రీలను ప్రధానం చేస్తున్నారు. జ్ఞానసముపార్జన లేకుండా సర్టిఫికేట్ పొందితే దానివల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరదు.

**- డా. పోలం సైదులు**
9441930361.

# ప్రభుత్వ విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి

- ప్రభుత్వ విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి
- పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్ బ్యూరో, జనవరి 18 (మనం న్యూస్):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని, అందుకు ఏ సౌకర్యాలు కావాలన్నా సమకూరుస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మండల విద్యాధికారులు, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలు, హాస్టళ్లను తరచుగా తనిఖీ చేయాలని ఆదేశించారు. చిన్న చిన్న మరమ్మతులను ఎప్పటికప్పుడు చేయిస్తూ విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూడాలని సూచించారు. హాస్టళ్ళను తనిఖీ చేస్తూ తనిఖీ రిపోర్ట్ ప్రతినెలా సమర్పించాలన్నారు. ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ, పరిశుభ్రత నేర్పిస్తూ భోజనం వృధా చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తరగతుల వారీగా బ్యాడ్జీలు అందించాలన్నారు. ప్రతి పాఠశాలలో విటమిన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచనలతో ఎకో క్లబ్, కాన్సియస్ క్లబ్, ప్రహరీ క్లబ్ ల ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలతో క్యాలెండర్ రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమాల ను అన్ని స్కూళ్లలో నిర్వహించాలన్నారు. విద్యార్థులను ఫీల్ ట్రిప్పులకు తీసుకెళ్లాలన్నారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టుల కు తీసుకెళ్తే వాళ్లకు ఎంతో జ్ఞానం, అనుభవం వస్తుందన్నారు.స్నేహితలో భాగంగా విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై, కెరియర్ ఆప్షన్స్ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జెన్య ఫౌండేషన్ అందించిన సైన్స్ కిట్లను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు అన్ని అంశాలు నేర్పించాలన్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులతో పండుగలకు అనుగుణంగా సామాగ్రి తయారు చేసి ప్రదర్శన నిర్వహించాల న్నారు. ఇందులో సంబంధిత ఉపాధ్యాయులను భాగస్వాముల్ని చేయాలన్నారు. ప్రతి ఎంఈఓ పాఠశాలలతో పాటు అక్కడే ఉన్న అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలని చెప్పారు. హెచ్‌ఎంల నుంచి నివేదిక తెప్పించుకొని సమస్యలు పరిష్కరించాలని సూచించారు. పాఠశాల కు అందిస్తున్న చెకుముకి మ్యాగజైన్లను విద్యార్థులు చదివేలా చూడాలన్నారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో విద్యార్థుల ప్రగతి ఉపాధ్యాయు లు చెప్పేలా చర్యలు తీసుకోవాలన్నా రు. బడి బయట ఉన్న చిన్నారుల వివరాలతో నివేదిక సమర్పించాలన్నారు. వలస కూలీల పిల్లలకు చదువు చెప్పించాలన్నారు. పదో తరగతి విద్యార్థు లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల ల్లో విద్యార్థులకు సందేశాత్మ క చిత్రాలు చూపించి రివ్యూ రాసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాల ప్రగతిని చర్చించారు. ఈ సమావేశం లో శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ రాంబాబు, యూనిసెఫ్ కోఆర్డినేటర్ కృష్ణస్వామి, ఎంఈఓలు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి

**కరీంనగర్ బ్యూరో, జనవరి 18 (మనం న్యూస్):** ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్షించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ శాఖల సంబంధిత అధికారులు స్టేజీ, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, అలంకరణ తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, చిన్నారులు ఎక్కువ సంఖ్యలో వేడుకలకు హాజరయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన శకటాలను ప్రదర్శించాలని, ప్రభుత్వ కార్యక్రమాల అవగాహన కోసం స్టాళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. 108, 102, బాల రక్షక్, సఖి వాహనాలను ప్రదర్శనలో ఉంచాలన్నారు. ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పేర్లను పరిశీలించి నివేదికలు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ పవన్ కుమార్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

**కరీంనగర్ కలెక్టరేట్, జనవరి18 (మనం న్యూస్):** అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఐటియుసి జిల్లా ప్రజాసంఘాల జనరల్ బాడీ సమావేశం బద్ధం ఎల్లారెడ్డి భవన్ గణేష్ నగర్ కరీంనగర్‌లో కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన సమావేశానికి నిర్వహించగా, ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి హాజరై మాట్లాడుతూ దేశంలోని అసంఘటితరంగా కార్మికుల కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సంస్కరణల పేరుతో 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్మికులు సమ్మె చేసే హక్కుతో పాటు పోరాటాలు చేసి సాధించుకున్న అనేక హక్కులను కాల రాస్తున్నాయని మండిపడ్డారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కో డులను రద్దు చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అసంఘటితరంగా కార్మికుల కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అంగన్వాడి, మధ్యాహ్నం, భోజనం, ఏఎన్ఎం, ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ ఇచ్చిన మాటలు అమలు చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రంగాల కార్మికులను ఐక్యం చేసి ఏఐటియుసి ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు చేయాలని కార్మికవర్గం కలిసికట్టుగా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య జిల్లా ఆఫీస్ బేరర్స్, కార్యవర్గం కాసెట్టి లక్ష్మయ్య, పిట్టల సమ్మయ్య, పిట్టల శ్రీనివాస్, డి. రజిత, ఏ. రజిత, సాయిలు, రజిత, అంజయ్య, రాజయ్య, కొమురయ్య, నరసయ్య, శ్రీనివాస్, భాగవతం వీరయ్య, పోశయ్య, ఉమా శంకర్, మామిడి శెట్టి శంకరయ్య, ఐలయ్య, లింగయ్య, బాలయ్య, అన్ని ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోని కాపర్ వైర్ చోరీ

**గంగాధర, జనవరి 18(మనం న్యూస్):** గుర్తు తెలియని దుండగులు వ్యవసాయ క్షేత్రాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోని కాపర్ వైర్ ను దొంగిలించిన ఘటన గంగాధర మండలం ఉప్పర మల్యాల గ్రామంలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు పనులకు వెళ్లగా అక్కడ విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు స్థానిక లైన్ మెన్ కు సమాచారం ఇచ్చారు. లైన్ మెన్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకి వెళ్లగా అక్కడ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ క్రిందపడి ఉండడంతో ఆచంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ సమాచారం అందజేశాడు. వెంటనే సబ్ స్టేషన్ ఏఈ తోట రామ్మోహన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా ట్రాన్స్ ఫార్మర్ లోని విలువైన కాపర్ వైరు దొంగలించ బడినట్లు, ఈ యొక్క ఘటనపై కరీంనగర్ ఏడి సత్యనారాయణ రెడ్డితో కలిసి గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.



## సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

**కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 18(మనం న్యూస్):** సిపిఎం రాష్ట్ర నాలుగవ మహాసభలు జనవరి25 నుండి 28వరకు సంగారెడ్డి పట్టణంలో జరగబోతున్నాయని, 25న సంగారెడ్డిలో జరుగు భారీ ప్రదర్శన ర్యాలీ బహిరంగ సభకు తరలిరావాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ముకుందలాల్ మిశ్రాభవన్లో సిపిఎం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. బీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు యు. శ్రీనివాస్, సుంకర సంపత్, ఎడ్ల రమేష్, డి. నరేష్ పటేల్, కోనేటి నాగరాణి జిల్లా నాయకులు తిప్పారపు సురేష్, గజ్జల శ్రీకాంత్, పెల్లి అరవింద్, కే. సాగర్ తదితరులు పాల్గొన్నారు.




## 9వ డివిజన్‌లో పర్యటించిన మేయర్ పర్యటన


- 26 లక్షల నిధులతో డ్రైనేజీ అభివృద్ధి పనులు భూమీ పూజ



**కరీంనగర్ బ్యూరో, జనవరి 18(మనం న్యూస్):** నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా శనివారం 9వ డివిజన్‌లో పర్యటించారు. కోతిరాంపూర్, అల్కపురి కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్‌తో కలిసి నగరపాలక సంస్థకు చెందిన 26 లక్షల నిధులతో డ్రైనేజీ నిర్మాణం పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. డ్రైనేజీ నిర్మాణం పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో అభివృద్ధి పనులకు ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ యాదగిరి సునీల్ రావుకు కాలనీ వాసులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ 9వ డివిజన్ ప్రాంతం మొత్తం శివారు ప్రాంతం కావడంతో గతంలో అభివృద్ధికి చాలా దూరంగా ఉండి చాలా సమస్యలు తిష్టవేశాయన్నారు. మా పాలకవర్గం ఏర్పాటు అయ్యాకే పెద్ద డివిజన్ కాబట్టి గత ప్రభుత్వంలోనే వందల కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించి, ఇప్పటి వరకు దశల వారిగా పనులన్నీ పూర్తి చేస్తూ వస్తున్నామని తెలిపారు. కోతిరాంపూర్, అల్కపురి, ఆటోనగర్ ప్రాంతాల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు కావల్సిన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. శివారు ప్రాంతం కావడంతో నివాస గృహాలు పెరిగి కొత్త కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయని, ప్రతి చోట కార్పొరేటర్ ప్రజల డిమాండ్ ప్రకారం అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. డివిజన్‌లో త్రాగు నీటి సమస్యను పూర్తిగా పరిష్కరించడంతో పాటు చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ నిర్మాణం చేసి సీసీ రోడ్లు వేశామని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతంలోని పెండింగ్ సమస్యలు పరిష్కరించి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కరీంనగర్ నగరంలో విస్తీర్ణం పరంగా గతంలో 23 కి.మీ ఉన్న నగరం ప్రస్తుతం 65 కి. మీ పెరిగిందని అన్నారు. మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు 5 గ్రామాలను కలపడం వల్ల దాదాపు 160 కి. మీ విస్తీర్ణంకు పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ఓం ప్రకాష్, అయూబ్ ఖాన్, ఏఈ గట్టు స్వామీ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## నేడు శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం

**గంగాధర, జనవరి 18(మనం న్యూస్):** తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లల కోసం తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీనివాసులం ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారం జగిత్యాలలోని కరీంనగర్ రోడ్ లో గల రెడ్డి పంక్షన్ హాల్ లో ఉదయం 9 గంటలకు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ మహోన్నతమైన కార్యక్రమానికి తలసేమియా చిన్నారుల మొహంలో ఆనందం చూసేందుకు, వారికి మరో ఇరవై రోజులు జీవితాన్ని ఇచ్చేందుకు తెలంగాణ శ్రీనివాసులందరు ఈ రక్తదాన శిభిరంలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా శాఖ రాజేశుని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



**కరీంనగర్ బ్యూరో, జనవరి 18 (మనం న్యూస్):** అంగారిక టౌన్షిప్ వాసుల సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేశామని, ప్రతి పనిని సమయానికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో ఉన్న అంగారిక టౌన్షిప్ అభివృద్ధి పనులపై శనివారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిలతో కలిసి టౌన్షిప్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అంగారిక టౌన్షిప్లో 2 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం వంటి ప్రాథమిక మౌలిక వసతులపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు. భగీరథ పైప్లైన్ రోడ్డు మధ్యలో విస్తరించినందున, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తక్షణమే చేపట్టాలని ఆయన ఆదేశించారు. అంగారిక టౌన్షిప్పు సుందరీకరించడంలో భాగంగా రోడ్ల మధ్య డివైడర్ల ఏర్పాటు చేసి, పూల మొక్కల నాటడం చేపట్టాలని సూచించారు. ప్రజల కోసం ఆకర్షణీయంగా తీర్చిదిద్దడమే కాకుండా శుభ్రమైన వాతావరణాన్ని కల్పించడానికి ఈ చర్యలు అత్యంత అవసరమని అధికారులకు గుర్తు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అంగారిక టౌన్షిప్ వాసుల సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేశామని, ప్రతి పనిని సమయానికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం మా బాధ్యత అని తెలిపారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం పాటించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజల అంచనాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు అంగారిక టౌన్షిప్ అభివృద్ధికి సంబంధించిన అన్ని చర్యలను వేగంగా పూర్తి చేసి అంగారక వాసులకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇవి స్థానికుల అభివృద్ధికి ఊతమిచ్చే చర్యలుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కుంట రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బుధారపు శ్రీనివాస్, మాచర్ల అంజయ్య, దావు సంపత్ రెడ్డి, పోలు రాము, మాచర్ల శ్రీనివాస్, సాధిక్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గంగాధర 9వ వార్డులో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ నిర్మాణం



**గంగాధర, జనవరి 18(మనం న్యూస్):** గంగాధర మండల కేంద్రంలోని 9వ వార్డ్‌లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లోడ్ సరిపోక లో ఓల్టేజి కరెంట్ సమస్య ఉందని కాలనీ ప్రజలు చొప్పదండి ఎమ్మెల్యే మేడి పల్లి సత్యంకు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారుల తో కాలనీలో హెవీ లోడ్ వోల్టేజ్ గల ట్రాన్స్ ఫార్మర్ బిగించాలని కోరగా, శనివారం విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి, 25కెవి ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను మార్చి 63 కెవి ట్రాన్స్ ఫార్మర్ బిగించారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంత్రి లత, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ
- ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా అమలు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ భూమి పూజ

**సిరిసిల్ల, జనవరి 18 (మనం న్యూస్):** ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ కార్యక్రమాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం భూమి పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ హాజరై, ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఈ నెల 26 వ తేదీ నుండి ప్రారంభంకానున్నదని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. గతంలో ప్రజాపాలన సమయంలో పెట్టుకున్న దరఖాస్తులను ఈ నెల 21 నుండి 24వ తేదీ వరకు లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని విప్ తెలిపారు. జనవరి 26 నుండి రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రైతు భరోసా కింద రూ.12 వేలు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఇస్తామని ప్రకటించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా భూమిలేని నిరుపేద కూలీలకు రూ.12 వేలు ఇస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలో 3500 ఇండ్లు వస్తూ ప్రత్యేక కోట కింద ముంపు గ్రామాల ప్రజలకు 4696 ఇండ్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు.పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక చేయడం జరుగుతుందని విప్ స్పష్టం చేశారు. ప్రజా పాలన సమయంలో దరఖాస్తు చేయలేని వారు ప్రత్యేకంగా ఆయా ఆఫీసుల్లో దరఖాస్తు చేసి పోర్టల్‌లో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల కాన్సెప్టే పేద ప్రజలకు ఇండ్లు మంజూరు చేయడమేనని పేర్కొన్నారు. అధికారులు ఎవ్వరూ కూడా నిర్లక్ష్యం చేయకూడదనీ, సర్వే గ్రామ వార్డు సభల్లో అధికారులు ఓపిగ్గా ఉంటూ ప్రజలందరికీ సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో కుల గణనను చేపట్టడం జరిగిందని విప్ చెప్పారు. రాబోవు రోజుల్లో పేద ప్రజలకు మేలైన కార్యక్రమాన్ని తీసుకొని ముందుకు పోతామని ప్రకటించారు. తాను కూడా 21 నుంచి నిర్వహించే సభల్లో పాల్గొంటాననీ తెలిపారు. మోడల్ హౌస్‌ను వీలైనంత త్వరగా నిర్మాణం చేపట్టి మన ప్రాంత ప్రజలకు నమూనాగా చూపెట్టాలనీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జలి బేగం, మునిసిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, పి.డి.గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఎమ్మార్వో మహేశ్, ఎంపీడీవో ఎన్ మల్హోత్రా, హౌసింగ్ డిఈలు భాస్కర్, ముజఫర్, ఎంపీడీవోలు శ్రీనివాస్, ఎన్. మల్హోత్ర, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# సహకార సంఘాల అభివృద్ధికి కృషి

- భూమి ఉన్న ప్రతి రైతు సహకార సంఘంలో చేరాలి
- సహకార సంఘాల సంఖ్య పెంచేందుకు కృషి
- మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పంటల మార్పిడి చేయాలి
- రూ.2 లక్షల రుణమాఫీ చేసాం
- జనవరి 26 న రైతు భరోసా రూ.12 వేలు
- రాష్ట్ర రవాణా, బీ.సీ. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కోహెడ,జనవరి 18 (మనం న్యూస్):** సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. కోహెడ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనాన్ని ,లాకర్ ,గోదాంను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొహెడ సింగిల్ విండో కార్యాలయ భవనం ,లాకర్ , గోదాం ప్రారంభం చేసుకున్నాం అన్నారు. ప్రభుత్వం తరుపున రైతులకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.సహకార సంఘాలకు రాజకీయ పార్టీల నుండి ఎన్నికల జరగవన్నారు. సహకార సంఘాల టర్మ్ 2025 ఫిబ్రవరి 14 తో ముగుస్తుంది అని చెప్పారు.నేను మార్క్ ఫెడ్ చైర్మన్ గా, రవీందర్ రావు సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ గా పని చేశాం అన్నారు.సహకార సంఘాల సంఖ్య పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది అని పేర్కొన్నారు. 2005 లో కరీంనగర్ సహకార సంఘా అధ్యక్షుడిగా పని చేసాను అని గుర్తు చేశారు. ఉమ్మడి జిల్లాలో 208 సహకార సంఘాలు ఉన్నాయి.అవి నిర్వీర్యం అయి చాలా సంఘాలు ఎత్తివేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన సహకార సంఘాల అభిప్రాయాలు తీసుకుందన్నారు.రాబోయే కాలంలో కొత్త సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టనుందన్నారు. ప్రతి రైతు అందులో సభ్యులుగా ఉండలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతు సహకార సంఘంలో చేరాలని సహకార వాదిగా చెప్తున్న అని రైతులను కోరారు. ఎక్కడ అవినీతి ఆస్కారం లేకుండా రైతులకు ఎరువులు, విత్తనాలు అందడానికి ఉపయోగపడుతుంది అన్నారు. చిగురుమామిడిలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా పంటల మార్పిడి చేయాలి అని సూచించారు. ఆదాయం ఎక్కువ వచ్చే పంటలు వేయాలన్నారు. సహకార సంఘాలు వారికి శిక్షణ సహాయ సహకారాలు అందివ్వాలనీ ఆదేశాలు జారీ చేశారు. సహకార సంఘాల పటిష్టత రైతుల పై ఆధారపడి ఉంటుంది అన్నారు.రైతులు సహకార సంఘాల్లో సభ్యులుగా ఉండాలన్నారు. రాజకీయాలకు అతీతంగా సహకార వాదిగా విజ్ఞప్తి చేస్తున్నా అని చెప్పారు. ప్రభుత్వం స్పష్టంగా రూ.2 లక్షల లోపు ఉన్న వారికి రుణమాఫీ చేశాం అన్నారు. కుటుంబ నిర్ధారణ చేసిన వారికి కూడా రుణమాఫీ అయ్యిందన్నారు. ఎవరికైనా రూ.2 లక్షల లోపు రుణమాఫీ కాకపోతే వ్యవసాయ అధికారిని కలిసి పిర్యాదు చేయాలని సూచించారు. రూ.2 లక్షల పైన ఉన్న వారికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయడానికి షెడ్యూల్ ఇచ్చి రుణమాఫీ ఇస్తాం అన్నారు. జనవరి 26 నుండి రైతు భరోసా 12 వేలు ఇస్తున్నాం అని స్పష్టం చేశారు. భూమి లేని ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్, సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రావు ,డైరెక్టర్లు ,హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ శివయ్య , కోహెడ , సైదాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లు బొయిని నిర్మల ,దొంత సుధాకర్, కోహడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్ర రవీందర్, గౌరిట్యాల లక్ష్మణ్, బాలకిషన్, సుధాకర్, పాము శ్రీకాంత్, తదితరులున్నారు.

# మావోయిస్టులకు భారీ ఎదురు దెబ్బ

- ఎన్ కౌంటర్ లో నేలకొరిగిన రాష్ట్ర కార్యదర్శి చొక్కారావు
- మరో నలుగురు కీలక నేతలు మృతి
- 18 మంది మృతిచెందినట్లు ధృవీకరించిన మావోయిస్టు పార్టీ




**చర్ల, జనవరి 18 (మనం న్యూస్) :** తెలంగాణ సరిహద్దు ప్రాంతం ఛత్తీస్గడ్ లోని బీజపూర్ జిల్లా ఊసూరు బ్లాక్ పూజారి కాంకేర్ - మారేడుబాక అడవులలో గురువారం జరిగిన ఎన్ కౌంటర్ లో మావోయిస్టు పార్టీ కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్ కౌంటర్ లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మృతి చెందినట్లు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ పేరిట శనివారం లేఖ విడుదల చేసారు. ఈ ఎన్ కౌంటర్ లో చొక్కారావు తో పాటు కీలక నేతలు, ప్లాటూన్ కమిటి సభ్యులు, ఏసిఎం లు హంగి, దేవే, జోగా, నర్సింహారావులతో పాటు మొత్తం 18 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు పార్టీ ధృవీకరించింది. ములుగు జిల్లా కాల్వపల్లి గ్రామానికి చెందిన చొక్కారావు. ముప్పయి సంవత్సరాల క్రితం మావోయిస్టు పార్టీలో చేరారు. అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర కమిటి సభ్యుని స్థాయికి చేరుకున్నారు. తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి హరిభూషన్ మరణానంతరం చొక్కారావు నూతన తాత్కాలిక రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. కాగా జనవరి 16వ తేదీన కేంద్రం, రాష్ట్రంలోని ఫాసిస్ట్ ప్రభుత్వాల భద్రతా దళాలు పూజారి కాంకేర్ ప్రాంతంలో ఆపరేషన్ పేరుతో ఘోరమైన అణచివేత కార్యక్రమాన్ని నిర్వహించి మావోయిస్టులను మట్టుపెట్టినట్లు లేఖలో వెల్లడించారు. పెట్టుబడి దారి రాజ్యాధికారం ఆదేశాల మేరకు బస్తర్ సహజ సంపదను దోచుకోవడం, భూములు, అడవుల నుండి గిరిజనులను వెళ్లగొట్టే లక్ష్యంతోనే ఇటువంటి కార్యక్రమాలను చేపట్టినట్లు మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ఈ ఎన్కౌంటర్లో 18 మంది మావోయిస్టులు చివరి శ్వాస వరకు పెట్టుబడుదారి, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని లేఖలో వెల్లడించారు. బడే చొక్కారావు ధైర్య సాహసాలు ప్రదర్శించి పోరాడి అమరుడైనట్లు లేఖలో ప్రకటించారు. ఆయన మరణం పార్టీకి తరని నష్టాన్ని మిగిల్చిందన్నారు. చొక్కారావు వారసత్వం వేలాదిమంది కొత్త సహచరులకు స్ఫూర్తినిస్తుందన్నారు. దంతెవాడ డిఐజి కమలోచన్ కస్యప్, బీజపూర్ జిల్లా ఎస్ పి జితేంద్ర యాదవ్ నేతృత్వంలో 5000 మందికి పైగా భద్రతా బలగాలు అత్యాధునిక ఆయుధాల, రాకెట్ రాచర్ల తో తమవారిపై విరుచుకుపడ్డారని లేఖలో ఆరోపించారు. ఈ దాడులను జాతీయ, అంతర్జాతీయ వేదికలపై బహిర్గతం చేయాలని మేధావులు, పాత్రికేయులు, మానవ హక్కుల కార్యకర్తలు, ప్రజా సంఘాలకు మావోయిస్టు పార్టీ విజ్ఞప్తి చేసింది.

## పిల్లలు పౌష్టికాహారం తీసుకొని కొంతసేపు వ్యాయామం చేయాలి

**టేక్మాల్, జనవరి 18(మనం న్యూస్):** పిల్లలు ప్రతిరోజు మంచి పౌష్టికాహారం తీసుకుని కొంతసేపు వ్యాయామం చేయాలని వైద్యాదు కారులు శ్రీనివాస్, జాన్సీ సూచించారు. శనివారం మండలంలోని సూరంపల్లి, చెరువుముందటి తండా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలల్లో గ్రామ ఆరోగ్యశాఖ సిబ్బంది, రాష్ట్రీయ బాల స్వస్త్య (ఆరోగ్య) కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలు,అంగన్వాడీ కేంద్రాలలో చదువుతున్న విద్యార్థులను క్షుణ్ణంగా పరీక్షించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల యొక్క బరువు, ఎత్తు, చెస్ట్, హెడ్ కొలతలు చేశారు. అనారోగ్యంగా ఉన్న విద్యార్థులను, పుట్టుకతో వచ్చే లోపాలు, 4డిఎస్ ఉన్న వారిని గుర్తించారు. అనారోగ్య లోపాలు ఉన్న పిల్లలను మెరుగైన చికిత్స అందించడం కోసం రిఫరల్ హాస్పిటల్ కు పంపే ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. పాఠశాలలోని పిల్లలకు జనరల్ చెకప్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య పాల్గొన్నారు.



# లబ్ధిదారులు ఎంపిక సమగ్రంగా పరిశీలించాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి




**మహబూబ్ నగర్ బ్యూరో, జనవరి18(మనం న్యూస్ ):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 న ప్రారంభించనున్న రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు జారీ,ఇందిరమ్మ ఇండ్లు పథకాల కు సంబంధించి లబ్దిదారుల ఎంపికకు సమగ్ర పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు.రైతు భరోసా,రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక కొరకు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరిశీలన పై శనివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా అధికారులు,మండల ప్రత్యేక అధికారులు,మండల నోడల్ అధికారులు,ఎం.పి.డి. ఓ.లు,తహశీల్దార్ లతో జిల్లా కలెక్టర్ వెబెక్స్ ద్వారా సమీక్షించారు.రైతు భరోసా కార్యక్రమం కింద వ్యవసాయ యోగ్యమైన భూమి,రేషన్ కార్డుల వెరిఫికేషన్ పై క్షేత్ర స్థాయి పరిశీలన మండలం ల వారీగా ఎం.పి.డి. ఓ.లు,తహశీల్దార్ లతో సమీక్షించి సూచనలు చేశారు.ఇప్పటి వరకు ఎన్ని రెవెన్యూ గ్రామాలు పూర్తి చేశారు,ఇంకా ఎన్ని గ్రామాలు పూర్తి చేయవలసి ఉంది,రేషన్ కార్డుల వెరిఫికేషన్ ఎంత వరకు పూర్తి చేశారు,ఏమైనా సమస్యలు ఉన్నాయా సమీక్షించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేగరుల చూడాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. . రైతు భరోసాలో లబ్ధిదారుల వివరాలు వ్యవసాయ శాఖ అధికారులతో రెవెన్యూ అధికారులు సమన్వయ ంతో పనిచేసి సాగుకు యోగ్యం కానీ భూములను గుట్టలు, వెంచర్లు, భూసేకరణ కింద తీసుకున్న సాగినట్టు ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు ,రహదారులు కోసం తీసుకున్న భూముల వివరాలు జాబితాలో ఉండకూడదని తెలిపారు. సాగుకు యేగ్యంగా ఉండే భూములను జాబితా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తుదారుల పూర్తి వివరాలు పరిశీలన జరిపి అర్హుల జాబితా రూపొంది ంచాలని ఆదేశించారు. ఈ నెల 16 నుండి నిర్వహిస్తున్న క్షేత్రస్థాయిలో పరిశీలన లో ఇంకా మిగిలిన గ్రామాల నుఈ నెల 20 వరకు పూర్తి చేసి లబ్దిదారుల జాబితా తయారు చేసుకోవాలని అన్నారు. లబ్దిదారుల జాబితా ఈ నెల 21 నుండి 24 వరకు జరిగే గ్రామసభలలో నాలుగు పథకాల లబ్ధిదారుల పేర్లను గ్రామసభలో వివరించాలని అలాగే లబ్ధిదారుల పేర్లను కూడా ప్రదర్శించాలని కలెక్టర్ తెలిపారు గ్రామ సభలో ఆమోదం పొందిన తర్వాత అర్హుల జాబితా రూపొందించాలని, అభ్యంతరాలు ఉంటే గ్రామ సభలో స్వీకరించాలని అన్నారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పై ప్రభుత్వం మార్గదర్శకాలు వివరించారు. ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా మహబూబ్ నగర్ అభివృద్ధి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్ బ్యూరో, జనవరి 18(మనం న్యూస్):** రాజకీయాలకు అతీతంగా మహబూబ్ నగర్ పట్టణాభివృద్ధి చేస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ మున్సిపాలిటీ లోని వార్డు నెంబర్ 07 , పద్మావతి కాలనీ లో సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం 115.60 లక్షలతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం మేము కృషి చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. పట్టణం లోని చాలా కాలనీల్లో సంవత్సరాల కొలది ఉన్నటువంటి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కట్టా రవికిషన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కౌన్సిలర్లు, నాయకులు గట్టు వెంకట్ రెడ్డి, కుమార్ గౌడ్, ఆనంద్, రఘురామిరెడ్డి, సామ్యూల్ దాసరి, ప్రవీణ్ కుమార్ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఎంఇ బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ప్రభుత్వం కాంగ్రెస్

## రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ




- ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం
- మల్లన్నసాగర్, రంగనాయక సాగర్ ద్వారా నీటి విడుదల

**సిద్దిపేటప్రతినిధి, జనవరి 18(మనం న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం రోజున దుబ్బాక పట్టణంలో నూతనంగా రూ.40 లక్షలతో నిర్మించిన చిల్డ్రన్ పార్కు ప్రారంభించి, రూ.70 లక్షలతో నిర్మించిన ఎఫ్.ఎస్.టి.పి. శుద్ధీకరణ యూనిట్ కు శంకుస్థాపనను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి, కాంగ్రెస్ నియోజకవర్గ, ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అంతకుముందు దౌల్తాబాద్ లో రూ.1.54 కోట్లతో నిర్మించిన మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ ప్రారంభించి, తొగుట మండలంలోని మల్లన్న సాగర్ జలాశయం నుండి దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేసారు. అనంతరరం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఐదు గ్రామాలకు రూ.1.10కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేండ్ల పరిపాలనలో ఏ ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు ప్రతి ఒక్కరికి అందించాలనే లక్ష్యంతో ఇంటింటి సర్వే కూడా ప్రారంభించిందని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్దేశించిన రూ. 5 లక్షలతో మోడల్ ఇంటిని నిర్మిస్తామన్నారు. సాగు చేసే ప్రతి ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా కింద అందజేయడం జరుగుతుందన్నారు. పాధిహామీ పథకంలో 20 రో జులు పని చేస్తున్న వ్యవసాయ కూలీలకు ఒక్కొక్కరికి రూ.12 వేలు రెండు విడుతలుగా అందజేస్తామన్నారు. రైతుల అవసరాలు దృష్టిలో పెట్టుకొని మల్లన్న సాగర్ కాలువల ద్వారా ప్రతీ చెరువు, కుంటను నీటితో నింపి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా ప్రజలతో మమేకమై అర్హులను గుర్తించి పారదర్శకంగా ప్రభుత్వం అందజేస్తున్న పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ ఛైర్ పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరులో యాసంగి పంటకు రంగనాయక సాగర్ నుండి నీటిని విడుదల చేసి రైతులకు శుభవార్త అందిస్తున్నామని అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రంగనాయక సాగర్ లో ప్రస్తుతం 2.44 టిఎంసీల నీళ్లు ఉన్నాయని, ఎడమ కాలువ ద్వారా ప్రస్తుతం నీటిని విడు దల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 42 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఒక లక్ష 10 వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో ప్రోటోకాల్ పాటించలేదు. ఇప్పుడు లేని పోని ఆరోపణలు చేస్తున్నారంటూ ఆరోపిస్తూ మళ్లీ ప్రోటోకాల్ విషయంలో గొడవలు తలెత్తకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ పూజల హరికృష్ణ, చిన్నకోడూరు మండల నాయకులు అజ్జు యాదవ్ తదితరులు ఉన్నారు.

# అడ్డుకున్న చేతులే హారతులు పడుతున్నాయి

- కేసిఆర్ కృషి తోనే ప్రాజెక్ట్ ల నిర్మాణం
- మల్లన్నసాగర్ కాలువకు నీటి విడుదల చేసిన దుబ్బాక ఎమ్మెల్యే



**తొగుట, జనవరి 18, మనం న్యూస్:** మల్లన్న సాగర్ ప్రాజెక్టు వద్దంటూ అడ్డుకున్న చేతులే నేడు గోదారమ్మకు హారతులు పడుతున్నాయని దుబ్బాక ఎమ్మెల్యే , జిల్లా పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు ద్వారా దుబ్బాక, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లోని చెరువు, కుంటలను నింపడానికి మల్లన్న సాగర్ కాలువలోకి నీటి విడుదల కార్యక్రమాన్ని జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు కొండా సురేఖ తో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కాలువలో గోదారమ్మకు పూలు చల్లి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాడు ఇక్కడ ప్రాజెక్టు నిర్మిస్తామంటే, అడ్డుకున్న చేతులే నేడు గోదారమ్మకు హారతులు పడుతుండటం గమనించాలాన్నారు. తెలంగాణ వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని ఉద్యమ నాయకుడుగా కేసీఆర్ చెప్పి, సీఎంగా చేసి చూపించడం జరిగిందన్నారు. ఈ ప్రాంత రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అంది వారి కళ నెరవేరిందన్నారు. భూగర్భ జలాలు తగ్గి పంటలు ఎండిపోతున్నాయని, మల్లన్న సాగర్ నీళ్లు వదిలి పంట పొలాలకు ప్రాణం పోయాలని ఇక్కడి ప్రాంత రైతులు తమ దృష్టికి తీసుకెల్లగా నేడు కాలువలోకి నీటిని విడుదల చేసుకున్నామన్నారు. కరువు కాలంలో పంట పొలాలను కాపాడటానికి ప్రాజెక్ట్ లు నిర్మించి ఆదుకున్న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు లకు దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గ రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కాళేశ్వరం కూలి పోయిందన్న కాంగ్రెస్ నాయకులు నేడు విడిచిన గోదావరి జలాలు కాళేశ్వరం నుంచి వొచ్చినవి కావా అని ప్రశ్నించారు. ప్రభుత్వంకు రైతుల మీద ప్రేమ ఉంటే పెండింగ్ లో ఉన్న కాలువలు పూర్తి చేయాలన్నారు. కూడవెల్లి వాగు తో పాటు రామాయంపేట, చిన్న శంకరంపేట కాలువలకు నీళ్లు విడుదల చేయాలన్నారు. మల్లన్న సాగర్ కాలువ ద్వారా తొగుట, దుబ్బాక, సిద్దిపేట, నంగునూరు, నారాయణరావుపేట, ముస్తాబాద్ మండలాల్లోకి 80 వరకు చెరువు, కుంటల్లోకి నీళ్లను విడుదల చేయడం జరుగుతుందన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, చివరి కాలువ వరకు నీళ్లను తీసుకెల్లి చెరువు, కుంటలు నింపి పంటలను కాపాడటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ప్రాజెక్ట్ ఈ ఎన్ సి హరీరామ్, ఎస్ ఈ రవీందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మనోహర రావు, మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, సొసైటీ చైర్మన్ కె హరికృష్ణ రెడ్డి, నాయకులు బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, బోధనం కనకయ్య, దోమల కొమురయ్య, చిలువేరి మల్లారెడ్డి, బక్క కనకయ్య, వేల్పుల స్వామి, ఎండీ కలీమోద్దీన్, సిరినేని గోవర్ధన్ రెడ్డి, మంగ నర్సింలు, సూతరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన గుణాత్మక విద్య

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**హైదరాబాద్, జనవరి 18(మనంన్యూస్):** శనివారం చేగుంట మండలం వడియారం జిల్లా పరిషత్ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు . ముందుగా జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణాన్ని, త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, తరగతి గదులు, కిచెన్ డైనింగ్ హాల్స్ ను కలెక్టర్ పరిశీలించారు. తరగతి గదులలో ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థినీ విద్యార్థులకు పాఠాలు బోధించి సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాల వసతులు కల్పనకు సేగల్ ఫౌండేషన్ వారి సేవలు అభినందనీయమని తెలిపారు తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించగా ఆశాజనకంగా ఉన్నాయని, ఎస్ ఎస్ సి లో ఉత్తమ ఫలితాలు తధ్యమన్నారు , పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులను తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. హాజరు శాతం మెరుగుపడితే దానికి అనుగుణంగా ఫలితాలు ఉంటాయన్నారు. ప్రణాళికమైన ప్రత్యేక తరగతులు, ఫెయిల్ అయ్యే స్టూడెంట్స్ పై ప్రత్యేక శ్రద్ధ, 10/10 సాధించే విద్యార్థుల సంఖ్య పెంపు యావరేజ్, బిలో యావరేజ్ స్టూడెంట్ పై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రణాళికలు రూపొందించడం ద్వారా ఉత్తమ విద్యా బోధన అందిస్తున్నామన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు వారిని ప్రత్యేక శ్రద్ధతో పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వడియారం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి తోనే మావోయిజం అంతమొందిస్తాం

- ఎన్ కౌంటర్ల కంటే లొంగుబాటుల పైనే దృష్టి
- యువత జీవన శైలి మార్చే బాధ్యత మాదే
- మావోయిస్టులు చేసిన అబివృద్ధి ఏమిటో చెప్పాలి
- మాజీ మావోయిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో ఎస్పి రోహిత్ రాజు





**చర్ల, జనవరి 18 (మనం న్యూస్) :** వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారానే మావోయిజాన్ని అంతం చేస్తామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్ పి రోహిత్ రాజ్ స్పష్టం చేసారు. శనివారం చర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన అజ్ఞాత దళ కుటుంబ సభ్యుల, జనజీవన స్రవంతిలో కలిసిన దళ సభ్యులకు అయినా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. చర్ల సీఐ ఏ రాజు వర్మ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళనం లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడారు. నక్సలిజం అంతమొందించాలంటే రెండు మార్గాలు ఉన్నాయని ఒకటి పోలీసుల ద్వారా, మరొకటి గ్రామాల అభివృద్ధి చేయడం ద్వారా మావోయిజం నిర్మూలించవచ్చని అన్నారు. తాము రెండో మార్గాన్ని అనుసరిస్తూ గ్రామాలలో ఎల్ డబ్ల్యు ఈ నిధుల ద్వారా రహదారుల నిర్మాణం, త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం, వైద్య సదుపాయాలను అందిస్తున్నామని వెల్లడించారు. గిరిజన రైతులకు వ్యవసాయం చేసేందుకు విద్యుత్ మోటార్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మావోయిస్టు అగ్ర నేతలైన దామోదర్, చంద్రన్న, ఆజాద్, వెంకటేష్, సుధాకర్ వంటి వారు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని చూసి పోలీసులు ఎదుట లొంగిపోవాలని పిలుపునిచ్చారు. వారు ఇన్నాళ్లు గ్రామాలలో ఏమి అభివృద్ధి చేసారో చెప్పాలని నిలదీశారు. వారికి ఎటువంటి హాని తలపెట్టమని హామీ ఇస్తున్నట్లు వెల్లడించారు. లొంగిపోయి తమతో కలిసి అభివృద్ధిలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ కౌంటర్ల కంటే లొంగుబాట్లనే తాము ప్రోత్సహిస్తామని స్పష్టం చేసారు. గత ఏడాది కాలంలో జిల్లా వ్యాపితంగా 36 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు వెల్లడించారు. వీరు కాకుండా ఇంకా జిల్లాలో కేవలం ఆరుగురు దళ సభ్యులు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడించారు. ఇందులో చర్ల మండలానికి చెందిన నలుగురు, పినపాక, పాల్వంచ మండల నుండి ఒకొక్కరు దళంలో ఉన్నట్లు వివరించారు. వీరకూడా అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. ఎస్ఐ స్థాయి నుండి ఎస్పీ స్థాయి వరకు ప్రతి ఒక్కరి సమిష్టి కేషి వలనే ఈ లొంగుబాట్లు జరిగినట్లు వెల్లడించారు. ఇందులో టాప్ క్యాడర్ మావోయిస్టుల నుండి మిలిషియా వరకు ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటు పాలసీ ప్రకారం లొంగిపోయిన వారికి పది రోజులలో ఉపాధి కొరకు నగదు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పాలసీ ద్వారానే అనేకమంది లొంగిపోతున్నారని, పక్క రాష్ట్రమైన ఛత్తీస్ ఘడ్ కు చెందిన మావోయిస్టులు సైతం తెలంగాణలో లొంగిపోతున్నట్లు వెల్లడించారు. కాలం చెల్లిన సిద్ధాంతాలను వీడాలని పిలుపునిచ్చారు. లొంగిపోక ముందు తమ జీవితం ఎలా ఉందో, లొంగిపోయిన తర్వాత ఎలా ఉందో అర్థం చేసుకొని ప్రస్తుతం ధళంలో కొనసాగుతున్న మావోయిస్టు కుటుంబ సభ్యుల ద్వారా అజ్ఞాత దళ సభ్యులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసి బిడ్డలకు తాము అండగా ఉంటామని, పోలీసుల్లో ఉన్న లోపాలను తమ దృష్టికి తీసుకువస్తే సరి చేసుకుంటామని వెల్లడించారు. ఆదివాసి యువకుల జీవనశైలి మార్చే బాధ్యత పోలీసు శాఖ తీసుకుంటుందని ప్రకటించారు. ఇప్పటికే యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు వెల్లడించారు. ఆయా గ్రామాలలో కమ్యూనిటీ హాల్స్ నిర్మించామని, ఉపాధి కొరకు మినీరైస్ మిల్లులను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. గిరిజన యువత ఎటువంటి వ్యసనాలకు బానిస కావద్దని కోరారు. మావోయిజం వైపు చూసి జీవితాలను నష్టపరచుకోవద్దని విజ్ఞప్తి చేశారు. పూసుగుప్ప, చెన్నాపురం గ్రామాలలో రెండు కోట్ల వ్యయంతో ఆధునిక వైద్యశాలలను ఏర్పాటు చేశామని త్వరలో దీనిని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. వలస ఆదివాసీ గ్రామాలకు చెందిన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం లేదనే విషయం తన దృష్టికి వచ్చిందని, త్వరలో జిల్లా కలెక్టర్ తో చర్చించి ఈ విషయాన్ని పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని స్పష్టం చేశారు. పూసుగుప్ప, చెన్నాపురం గ్రామాలకు మంచి రోజులు ఉన్నాయని, ఈ గ్రామాల ద్వారా ఛత్తీస్ గడ్ వెళ్లేందుకు త్వరలో హైవే రహదారి నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలపాలని ఈ సందర్భంగా ఎస్పీ పిలుపునిచ్చారు. మీలో మార్పు వస్తే రెట్టించిన ఉత్సాహంతో తాము పని చేస్తామని, అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. మావోయిజాన్ని అదుపు చేయడంలో నిద్రాహారాలను మాని విధులను నిర్వహిస్తున్న చర్ల సీఐ రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి, దుమ్ముగూడెం సిఐ అశోక్ లను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఛత్తీస్ గడ్ రాష్ట్రం మావోయిస్టు పార్టీ పామేడు, కిష్టారం ఏరియా కమిటీలకు చెందిన ముగ్గురు మావోయిస్టు దళ సభ్యులతో పాటు మరో 18 మంది మిలిషియా సభ్యులు జిల్లా ఎస్పీ ముందు లొంగిపోయారు. అనంతరం లొంగిపోయిన, అజ్ఞాత దళ సభ్యుల కుటుంబాలకు బియ్యం, దుస్తులు, దుప్పట్లు, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం లొంగిపోయిన వారితో సామూహిక భోజన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. కొత్తగూడెం ఓ ఎస్ డి పరితోష్ పంకజ్, భద్రాచలం ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, సి ఆర్ పి ఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ రాజ్ కుమార్, చర్ల దుమ్ముగూడెం సిఐలు రాజవర్మ, అశోక్ ఎస్త్రు నర్సిరెడ్డి, ట్రైన్ ఎస్త్రు విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

# 4 సంక్షేమ పథకాల సర్వేను వేగవంతం చేయాలి



- అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్
- జిల్లాలో 354 రెవెన్యూ గ్రామాలకు గాను 194 రెవెన్యూ గ్రామాల సర్వే పూర్తి
- కొత్త రేషన్ కార్డుల కోసం 29,141 దరఖాస్తులు
- కొత్త సభ్యులను జతపరచడానికి గాను 10,796 దరఖాస్తులు

**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 18 (మనం ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇండ్ల సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశానుసారం సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వే పురోగతిపై జిల్లాలోని తాసిల్దార్లు ఎంపీడీవోలతో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు గాను వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు 6 వేల రూపాయలు చొప్పున రెండు విడతలుగా 12 వేల రూపాయలు భూ భారతి పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా చెల్లిస్తుందని, అలాగే ఇళ్లు (లేదా) కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ భూములు, లేఅవుట్ చేసిన భూములు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు, రాళ్ళు, రప్పలు, గుట్టలతో నిండి, సాగుకు అనువుగా లేని భూములను గుర్తించి, తొలగించాలని సూచించారు. రైతు భరోసా పథకం అమల్లోకి భాగంగా జిల్లా లోని 354 రెవెన్యూ గ్రామాలలో భూ సర్వే నిర్వహించి ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలన్నారు. 354 రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటివరకు 194 రెవెన్యూ గ్రామాల సర్వే పూర్తి అయిందని మిగిలిన 160 రెవెన్యూ గ్రామాల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

కొత్త రేషన్ కార్డు మంజూరు లో భాగంగా ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా జిల్లాలో 29,141 దరఖాస్తులు వచ్చాయని అదేవిధంగా రేషన్ కార్డులో కొత్త సభ్యులను జతపరచడానికి గాను 10,796 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ దరఖాస్తులన్నింటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశిత పట్టిక ద్వారా ప్రతిరోజు సాయంత్రం నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన మరియు కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకుని జాబితాలో పేరు రాని అర్హుల వివరాలను కూడా నిర్దేశిత పట్టికలో నమోదు చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. లబ్ధిదారుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

**జిల్లాలో ముమ్మరంగా సర్వే :-**

ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న పథకాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు, జిల్లా యంత్రాంగం ముమ్మరంగా సర్వే చేపడుతుంది. ఎక్కడికక్కడ మండలాల్లో, పంచాయతీ సెక్రటరీలు, రెవెన్యూ అధికారులు ప్రజా పాలన దరఖాస్తులు ఆధారంగా ఇల్లు తిరుగుతూ, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, భూ సర్వే, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కోసం పారదర్శకంగా సర్వే నిర్వహిస్తున్నారు. ముందుగా సర్వే చేస్తున్న అధికారులు ప్రజాపాలన దరఖాస్తుల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సర్వే కి వస్తున్నాం ఇంటి వద్దనే ఉండాలంటూ అభ్యర్థులకు సూచిస్తున్నారు.

## గార్ల పెద్ద చెరువును కబ్జాదారుల నుండి కాపాడండి.

**గార్ల, జనవరి 18(మనం న్యూస్):** మండల పరిధిలోని గార్ల పెద్ద చెరువు శిఖం భూములను కబ్జాకోరుల నుండి కాపాడాలని అఖిలపక్షం నాయకులు ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. శనివారం గార్ల స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో అఖిలపక్షం నాయకులు, గార్ల చెరువు పారకం రైతులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గార్ల పెద్ద చెరువును కొంతమంది తమ స్వార్ధ ప్రయోజనాలకు ప్రతి సంవత్సరం ఎకరాలు ఎకరాలు ఆక్రమిస్తూ కనుమరుగు చేస్తున్నారని ఆరోపించారు. వర్షాకాలంలో సైతం పంట పొలాలకు చివరి తడి నీళ్ళు అందక నానా కష్టాలపాలవుతున్నారని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఇలానే ఉంటే భవిష్యత్తు తరాల పిల్లలకు ఒకానొకప్పుడు గార్ల చేరువు అనేది సీతంపేట గ్రామానికి ఆనుకొని ఉండేదని చెప్పుకోవల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మండలంలో వ్యవసాయ రైతులు కనుమరుగైయే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గార్ల పెద్ద చెరువు విస్తీర్ణం 490 ఎకరాలు ఉండగా 130 ఎకరాలు కబ్జాకు గురైందని అన్నారు. ఇప్పటికైన ఉన్నత అధికారులు స్పందించి గతంలో ఉన్న గార్ల పెద్ద చెరువు విస్తీర్ణాన్ని వెలికితీసి చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేసి గార్ల మండల రైతులను ఆదుకోవాలని లేని యడల ఆమరణ నిరాహారదీక్ష సిద్ధపడుతామని రైతులు అఖిలపక్షం నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు కందునూరి శ్రీనివాస్, ఇల్లందు మాజీ ఏఎంసి చైర్మన్ భూక్య నాగేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అద్యక్షుడు పిఎసిఎస్ వైస్ చైర్మన్ గంగావత్ లక్ష్మణ్ నాయక్, సిపిఐ పార్టీ జిల్లా నాయకులు కట్టె బోయిన శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు సక్రు, జడ సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు క్రిష్ణా రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, ఆయకట్టు రైతులు శీలంశెట్టి ప్రవీణ్ కుమార్, తోడేటి శ్రీనివాస్, శీలంశెట్టి రమేష్, మోహన్ రెడ్డి, సాయిబాబా, కత్తి సత్యం, బుడిగ మురళి తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తలే కాంగ్రెస్ కు బలం..



- మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్
- కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీల ఎన్నిక..

**కరకగూడెం, జనవరి 18 (మనం న్యూస్):** కరకగూడెం మండలంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, మండల సీనియర్ నాయకులు పోలేబోయిన తిరుపతయ్య, ఎర్ర సురేష్ ఆధ్వర్యంలో కన్నాయిగూడెం, రేగళ్ల, అనంతారం, తుమ్మలగూడెం, చోప్పాల, గొల్లగూడెం, కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీ అధ్యక్షులలను నియమించారు..బాదావత్ అమిలాల్(కన్నాయిగూడెం), కొమరం వెంకటేశ్వర్లు (రేగళ్ల), పూజారి వెంకన్న (అనంతారం), ఎట్టి నరసయ్య (చొప్పాల), ఆంబోజు నరేష్ (తుమ్మలగూడెం), ఎల్లబోయిన బుచ్చయ్య (గొల్లగూడెం),ఈసం రాఘవులు (కొత్తగూడెం)లను ఏకగ్రీవంగా ఎన్నుకొవడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అనంతరం గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో కార్యకర్తల కష్టంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం అన్నారు.కార్యకర్తల కష్టంతో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం లో మరొకసారి ప్రజలకు సేవ చేసే అవకాశం ఏర్పడిందన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను, ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి క్లుప్తంగా అర్థమయ్యే విధంగా ప్రజలలోకి తీసుకువెళ్లాలని వారు కోరారు.నూతనంగా నియమితులైన గ్రామ కమిటీ అధ్యక్షులు అందరూ గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారం అయ్యేందుకు చొరవ చూపించాలని వారన్నారు. స్థానిక సంస్థ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మండల నాయకులు పోలేబోయిన తిరుపతయ్య, మండల నాయకులు ఎర్ర సురేష్,దొంతు మల్లయ్య , గాంధర్ల రామనాథం, దుర్గం కన్నయ్య, సీనియర్ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భూములేని ప్రతి వ్యవసాయ కార్మికుడికి రూ.12 వేలు ఇవ్వాలి

- ఉపాధిహామీ పని దినాలతో సంబంధం లేకుండా పథకం అమలు చేయాలి.
- పట్టణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికులకూ అమలు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



ఖమ్మం, జనవరి 18(మనం న్యూస్): భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మికుడికి రూ.12,000/- ఇవ్వాలని, ఉపాధి హామీ పని దినాలను కారణం చూపి వ్యవసాయ కార్మికులను అర్హత జాబితాలో నుంచి తొలగించడం సరైంది కాదని సిపిఐఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు బుధవారం నాడు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రైతు భరోసా పథకంలో భాగంగా వ్యవసాయ కార్మికుడికి 12,000 ఇస్తామని హామీ నిచ్చిందన్నారు. ఈ పథకం అమల్లో భాగంగా అనేక కారణాలు చూపెడుతూ లబ్ధిదారులను తగ్గించే ప్రక్రియకు మానుకోవాలని వారన్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో అర్హత కలిగిన వారు అన పేరుతో లిస్టులను పెట్టారని, కానీ ఆ లిస్టులో చాలామంది భూమిలేని నిరుపేదల పేర్లు లేవని వారన్నారు. ఉపాధి హామీ పని దినాలు కారణం చూపి లబ్ధిదారులను పథకానికి అర్హులుగా చేయడం సరైన కాదన్నారు. ఉపాధి హామీ పనితో సంబంధం లేకుండా భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఈ పథకాన్ని వర్తింపచేయాలని వారు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో ఇటీవల నూతనంగా ఏర్పాటుచేసిన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ కార్మికులందరికీ కూడా ఈ పథకాన్ని ఇవ్వాలన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ ఇటీవలనే కేవలం కాగితాల మీద మాత్రమే ఏర్పడిరది తప్ప, అవి నేటికీ గ్రామాలుగానే ఉన్నాయని, వ్యవసాయం సాగుతుందని, వందలాదిమంది వ్యవసాయ కార్మికులు వ్యవసాయ పనులు చేస్తున్నారని వారు తెలియజేశారు. ఆ గ్రామంలో ఉపాధి హామీ పనులు నిలిపివేయడమే కాకుండా ప్రస్తుత పథకం ఆ పరిధిలోని పేదలకు అమలు చేయకపోవడం సరైన కాదన్నారు. అలాగే ఖమ్మం నగర పాలక సంస్థలో కొన్ని ఏరియాల్లో నేటికీ వ్యవసాయం సాగులో ఉందని, వైరా మున్సిపాలిటీ, మధిర మున్సిపాలిటీ పరిధిలో కూడా కొన్ని గ్రామాలు వ్యవసాయం నడుస్తుందని ఆ గ్రామాల్లోని వ్యవసాయ కార్మికులందరికీ కూడా 12,000 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా తెలియనమైన గ్రామాలలో ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని వారి డిమాండ్ చేశారు. ప్రజా పాలన కార్యక్రమంలో, ఇతర ఆన్లైన్లో అనేకమంది పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకొని ఉన్నారని, కానీ గత ప్రభుత్వంలో పెట్టిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవడం వల్ల వేలాది మంది పేదలకు రేషన్ కార్డులు జాబితాలో లేకుండా పోయారని వారు తెలియజేశారు. అలా కాకుండా ఇతర ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న, ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరిని రేషన్ కార్డుల అర్హత జాబితాలో చేర్చాలన్నారు. జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ సమస్యపై తగిన పరిష్కారం చూపాలని వారన్నారు. భవిష్యత్తులో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పేదలందరిని కలుపుకొని ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు.

# కృత్రిమ చేయి అందించిన ఎస్ఐ

- మరోసారి ఆదివాసీల పట్ల మానవత చూపిన ఎస్ఐ



**కారేపల్లి, జనవరి17 (మనం న్యూస్) :** కారేపల్లి ఎస్ఐగా పనిచేసిన పుష్పాల రామారావు మరొకసారి ఆదివాసీల పట్ల తనకున్న ప్రేమను చాటారు. కారేపల్లి మండల పరిధిలోని టేకులగూడెం గ్రామానికి చెందిన గోగ్గేల మహేందర్ అనే ఆదివాసీ యువకుడు గత ఏడాది కరెంట్ షాక్ తో విద్యుత్ ఘతానికి గురై తన ఎడమ చేయి పోగుట్టుకున్నాడు. అప్పటినుండి ఏ పని చేయలేక ఇంటివద్దనే ఉంటుండగా ఆ గ్రామ ఆదివాసీ నాయకుడు గుమ్మడి సందీప్ విషయాన్ని గతములో కారేపల్లి ఎస్ ఐ గా పనిచేసి ప్రస్తుతం టాస్క్ ఫోర్స్ లో బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్ ఐ పుష్పాల రామారావు దృష్టికి తీసుకొని వెళ్లారు. వెంటనే స్పందించిన ఎస్త్రు ప్రత్యేక చొరవతో మహేందర్ దైనొదిన కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు కృత్రిమ అదునాతనమైన ప్రొస్తేటిక్ హ్యాండ్ అవసరమని భావించి బ్యాటరీ తో పనిచేసే ఖర్చుతో కూడిన ఖరీదైన కృత్రిమ చేయిని అందించాలని నిశ్చయించుకున్నారు. వెంటనే ప్రత్యేక శ్రద్ధతో రోటరీ క్లబ్ అఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో ఈనాలి ఫౌండేషన్ సహకారముతో గురువారం హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన క్యాంపు లో మహేందర్ కు కృత్రిమ చేయి అందజేశారు. ఈ కృత్రిమ చేతిలో అంతర్గతముగా అమర్చిన బ్యాటరీ సహాయముతో సాధారణ చెయ్యి ఉన్నవారిలాగా అన్ని పనులు చేసుకోవచ్చని, అవసరమున్నప్పుడు బ్యాటరీ ఛార్జింగ్ కూడా పెట్టుకోవచ్చని ఎస్ఐ రామారావు పేర్కొన్నారు. తన పరిస్థితిని చూసి కృత్రిమ చేయి అందించేందుకు శ్రద్ధ చూపిన ఎస్ఐ రామారావుకు, క్యాంపు కో ఆర్డినేటర్ శ్రీదేవి, ఇతర సంస్థ సభ్యులందరికీ యువకుడు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూనే ఆదివాసీల కష్టాలలో తోడుగా నిలిచిన రామారావును ఆదివాసీలు, ఇతర మండల ప్రజలు అభినందిస్తున్నారు.

# జననేతకు ఘన నివాళి

**కమలాపురంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి**
**తెలుగు జాతి గర్వించదగ్గ నాయకుడు**



**కారేపల్లి, జనవరి18 (మనం న్యూస్) :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలు శనివారం మండల పరిధిలోని కమలాపురంలో ఘనంగా జరిగాయి. స్థానిక నాయకుడు, టీడిపి మండల రైతు సంఘం నాయకులు దూదిపాళ్ళ భాస్కరరావు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవం ప్రపంచ దశదిశలా చాటి చెప్పారన్నారు. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోని అధికారంలోకి వచ్చి రాజకీయాల్లో నూతన శకానికి నాంది పలికారన్నారు. అధికారం చేపట్టడంతోటే అనుహ్యమైన నిర్ణయాలు తీసుకొని ప్రజారంజక పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతోటి ప్రజలకు విడదీయ్యారాని అనుబంధంగా తెలుగుదేశం పార్టీని ఉంచారన్నారు. ఎన్టీఆర్ భౌతికంగా దూరమై 29 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఆయన సిద్ధాంతాలు, ఆశయాలు అనుగుణంగానే పార్టీ కొనసాగుతుందని అన్నారు. పార్టీలకతీతంగా భారీ ఎత్తున వర్ధంతి వేడుకలు నిర్వహించడం కేవలం ఎన్టీఆర్ కి దక్కిన గౌరవం అన్నారు. అనంతరం ముగ్గుల పోటీలలో ప్రథమ బహుమతి సంకా స్వాతి, ద్వితీయ బహుమతి చాగంటి రజిత, తృతీయ బహుమతి సంకా సింధులు గెలుపొందగా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దూదిపాళ్ల విజయకుమార్, చాగంటి కోటయ్య, ముప్పారపు వెంకయ్య, వడ్డే అనంతయ్య, గుత్తా గంగయ్య, వడ్డే కోటయ్య, వడ్డే రంగారావు, రేపాల సతీష్, వడ్డే సంపత్, చాగంటి లక్ష్మీనారాయణ, మండెపూడి కోటి, పలువురు మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు ఎప్పుడు అమలు చేస్తారు

- నాగం శశిధర్ రెడ్డి



**నాగర్ కర్నూల్ ప్రతినిధి, జనవరి 18 ( మనం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు ఎప్పుడు అమలు చేస్తారని బీఆర్ఎస్ రాష్ట్రనేత నాగం శశిధర్‌రెడ్డి ప్రశ్నించారు. నాగర్ కర్నూల్ పట్టణ కేంద్రంలో తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని ప్రజలకు నమ్మించి మోసం చేసిందని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిపోయినా కూడా ఇప్పటివరకు ఏవి కూడా అమలు కాలేదని ఆయన అన్నారు. ప్రజలకు నమ్మించి మోసం చేసి నడ్డి విడిచే విధంగా ఓట్లు వేయించుకొని ప్రజలకు మొండిచేయి చూపించారని గతంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన పనులే ఉన్నాయి కానీ ఈ ప్రభుత్వం మొండి చేయి చూయిస్తూ ప్రజల్ని మోసం చేస్తుందని అన్నారు . ఇల్లు లేని వారికి డబల్ బెడ్ రూములు నిర్మించి ఇస్తామని అన్నారు ఇంతవరకు జడ పత లేని డబల్ బెడ్రూంలు రైతులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు అవకతవకలుగా ఉందని అన్నారు. రైతులకు నాణ్యతలేని విత్తనాలు సరఫరా అవుతున్నా కూడా ఏమి పట్టనట్టుగా వివరిస్తున్నారు. అదేవిధంగా వృద్ధులకు నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇస్తాము అని ఇప్పటివరకు అమలు కాలేదు అదేవిధంగా నిరుద్యోగ భృతి ఇస్తామని ఇప్పటివరకు అది కూడా అమలు కాలేదని ఆయన అన్నారు. ఈఎమ్మెల్యే ప్రజలకు ఇచ్చిన హామీలు ఇలా ఉన్నాయి మా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కౌలు రైతుకు 12000 వేస్తామని అన్నారు ఇప్పటివరకు కూడా అమలు కాలేదు వంద రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని అన్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఇప్పటివరకు కూడా ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని ఆయన అన్నారు గత ప్రభుత్వాలు చేసిన పనులే ఇప్పటివరకు కనిపిస్తున్నాయి కానీ ఈ ప్రభుత్వం ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని అన్నారు .ఈ ముఖ్యమంత్రి వేరే రాష్ట్రాలకు టూరిజం చేస్తున్నాడు కానీ ఈ రాష్ట్రాన్ని ఎప్పుడు అభివృద్ధి చేస్తాడని అన్నారు ఇది ఇలా ఉండగా. నాగర్ కర్నూల్ శాసనసభ్యులు కూచుకుల్ల రాజేష్ రెడ్డి ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి ఇద్దరు కలిసి నాగర్ కర్నూల్ ని అభివృద్ధి చేస్తానని చెప్పిన ఇప్పటివరకు ఏ ఒక్క కార్యక్రమం చేయకుండా సంవత్సరం గడిచిపోయిన కూడా నాగర్ కర్నూల్ ని అభివృద్ధి చేయకుండా తన సొంత పనుల కోసమే పబ్బం గడుపుతున్నారని వారు అన్నారు నాగర్ కర్నూల్ ని గతంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులే కండ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయి ఇప్పుడున్న ఎమ్మెల్యే ఏ ఒక్క పని కూడా చేయకుండా నాగర్ కర్నూల్ కి హైదరాబాద్ కు వస్తూపోతున్నాడే కానీ ఆయన చేసిన ఏ ఒక్క పని కూడా ఆయన చేయలేదని అన్నారు. ఇకనైనా నాగర్ కర్నూల్ పై దృష్టి పెట్టి నాగర్ కర్నూల్ సుందరీ కర్ణ చేసే విధంగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు అర్థం రవి. తిమ్మాజిపేట పాండు. భీమయ్య. తోపాటు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగస్తుల పదవి విరమణ 58 సంవత్సరాలు చేయండి

- పి ఆర్ టి యు తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామచందర్



**మహమ్మదాబాద్, ఆగస్టు 18 (మనం న్యూస్):** మహబూబ్ నగర్ జిల్లా మహమ్మదాబాద్ గండీడ్ మండలాల్లో ఉన్న పాఠశాలలో గల ఉపాధ్యాయులతో కలిసి పి ఆర్ టి యు తెలంగాణ యూనియన్ క్యాలెండర్ పంపిణీ చేసిన పి ఆర్ టి యు తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆర్ రామచందర్ రాథోడ్ , ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తులు 58 సంవత్సరాలకే పదవి విరమణ చేసేవారని గత ప్రభుత్వం 61 సంవత్సరాలు చేయడం వల్ల ఉద్యోగస్తుల ఆరోగ్యం సహకరించక వయసు పైబడిన ఉద్యోగస్తులు ఉద్యోగం చేయడం ఇబ్బందిగా ఉందని కొంతమంది అవస్థలు పడుతున్నారని,అలాగే మేము రిటైర్డ్ అయ్యే వరకు ఉపాధ్యాయ పోస్టులు లేక నిరుద్యోగులు ఉద్యోగులుగా అయ్యే అవకాశం లేదు, ఉద్యోగస్తుల వయస్సు పెంపు తగ్గించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించండి, రాష్ట్రంలో నిరుద్యోగులు లేకుండా చూడండి అని అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగస్తుల వయస్సు 63 సంవత్సరాలు పెంచుతా అని అంటుంది, దీనివల్ల ఉద్యోగస్తులు వయస్సు పైబడే కొద్ది వారి శరీర పరంగా పనిచేయుటలో ఆలస్యం అవుతుందని కావలసిన విధంగా పనిచేయడం కుదరదు ఉద్యోగస్తులు అనేక కష్టాలు పడే అవకాశం ఉన్నది కనుక ప్రభుత్వం 63 సంవత్సరాల వయసు అనే మాట మరిచి ఉద్యోగస్తుల పదవి విరమణ 58 సంవత్సరాలే ఉండేలా చేసి ఉద్యోగస్తులు అందరికీ పుణ్యం కట్టుకోండి అని అన్నారు, ఈ కార్యక్రమంలోజిల్లా సెక్రటరీ పి విశాల్ కుమార్, గండీడ్, మహమ్మదాబాద్ మండలాల అధ్యక్షులు జి మహిపాల్ రెడ్డి, జే సూర్యనారాయణ, సెక్రటరీ జి సంజీవరెడ్డి, కే బాలయ్య తదితరులున్నారు.

## జిల్లా కలెక్టర్ ను సన్మానించిన మాజీ ద్యాప నిఖిల్ రెడ్డి



**ఊర్కొండ, జనవరి18 (మనం న్యూస్):** ఊర్కొండ మండల పర్యటనలో భాగంగా శనివారం మండలానికి విచ్చేసిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్ ను మండలంలోని జాతీయ రహదారి వద్ద మాధారం గ్రామ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్ ను మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధ్యాప నిఖిల్ రెడ్డి వెంట మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, తదితరులు ఉన్నారు.

# 100 పడకల ఆసుపత్రి కొరకు స్థల పరిశీలన

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ ప్రతినిధి, జనవరి 18 (మనం న్యూస్):** శనివారం కల్వకుర్తి పట్టణంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. కల్వకుర్తి పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కొరకు అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించేందుకు కలెక్టర్ కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కల్వకుర్తి పట్టణంలో నీ డబుల్ బెడ్ రూమ్ సమీపంలో ఉన్న 99వ సర్వే నెంబర్లో గల 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలానికి సంబంధించి విస్తీర్ణం, రోడ్డు అనుసంధానం, భౌగోళిక పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్థలాన్ని పునః పరిశీలించి, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి అనువైనదిగా ఉంటే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్డీవోకు ఆదేశించారు. కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 100 పడకల ఆసుపత్రిని అత్యాధునిక సదుపాయాలతో నిర్మించనున్నట్లు, ఇది స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి దోహదపడుతుందని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆసుపత్రికి కావలసిన స్థలాన్ని సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సర్వే పరిశీలన పారదర్శకంగా చేపట్టాలి



- అడిషనల్ కలెక్టర్

**చారకొండ, జనవరి 18(మనం న్యూస్):** గ్రామాలలో రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ పి అమరేందర్ అధికారులకు సూచించారు. శనివారం చారకొండ మండల తాసిల్దార్ కార్యాలయం లో తాసిల్దార్ సునీత,ఎంపీడీవో ఇస్సాకు హుస్సేన్,రెవెన్యూ అధికారులతో నాగర్ కర్నూల్ జిల్లా రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ అమరేందర్ గ్రామాలలో జరుగుతున్న సర్వేలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ గ్రామాలలో సర్వే క్షుణ్ణంగా పరిశీలించిపారదర్శకంగా చేపట్టాలని సూచించా రు.రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు వంటి 4 సర్వేల ను ఈనెల 20 లోగ పూర్తి చేసి, గ్రామాలలో 21న గ్రామసభలు గ్రామాలలో అవకతవకలు జరగకుం డా,పారదర్శకంగా చేపట్టి నివేదితను పంపించా లని అధికారులకు తెలియపరిచారు. కార్యక్రమం లో ఉప తాసిల్దార్ విద్యాధరి రెడ్డి,ఎం పి ఓ వెంక టేష్,ఆర్ ఐ, ఏఈఓలు పంచాయతీ కార్యద ర్శులు,తాసిల్దార్ కార్యాలయా సిబ్బంది పాల్గొన్నారు.

## 25న చిరు అభిమానుల మెగా షో' ఆటకావాలా - పాట కావాలా



**ఖమ్మం, జనవరి 18(మనం న్యూస్):** మొగిలి ఎంటర్టైన్మెంట్స్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రం నందు మెగాస్టార్ చిరంజీవి నటించిన సినిమాల్లోని పాటలు, డాన్సులతో కూడిన కార్యక్రమం' ఆట కావాలా- పాట కావాలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కన్వీనర్ ప్రముఖ న్యాయవాది జెల్లా లక్ష్మీనారాయణ, కార్యక్రమ అడ్వైజర్ ప్రముఖ రచయిత దర్శకులు కొత్తపల్లి శేషు కలిసి కర పత్రాని ఆవిష్కరించారు. మెగాస్టార్ చిరంజీవి 156 సినిమాల్లోని 537 పాటలకు గాను 24 వేల సరికొత్త స్టెప్పులతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్ రికార్డ్ సాధించారని, ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిసున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు ఎస్ వి రమణ, మూడు ఇంటర్నేషనల్ రికార్డ్ హోల్డర్ వంజా మాలతి నాయుడు, ట్రెడిషనల్ సింగర్ నాగ స్వర్ణ శ్రీ, మెలోడీ క్వీన్ వరంగల్ సంధ్య, ప్రముఖ సింగర్ అండ్ యాంకర్ రామారావు కావేరి మెగాస్టార్ పాటలు తో అలరించనున్నారని తెలిపారు. అలాగే మెగాస్టార్ సినిమాల్లోని పాటలకు ఉర్రూతలూగించే సంతోష్ డాన్సర్ అకాడమీ బృందం, చిరంజీవి డూప్ డాన్స్ హంగామా నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కమెడియన్ మొగిలి గుణకర్ తెలిపారు. ప్రత్యేక ప్రదర్శనగా మాస్టర్ గుణ, లహరి ప్రియ నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపా రు. ఈ కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ జీని యస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ నాగసాయి, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ పేరు నవీన్, ప్రముఖ జానపద గాయకుడు కోదాడ నరసింహారావు తదిత రులు పాల్గొన్నారు. ప్రేక్షకులు అత్యధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# త్రుటిలో తప్పిన ప్రమాదం

- బస్సులో 60 మంది పైగా ప్రయాణికులు



**నాగర్ కర్నూల్ ప్రతినిధి, జనవరి18 (మనం న్యూస్):** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామ సమీపంలో నల్లమల్ల కొండ పై వెలసిన ఉమా మహేశ్వర బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ జాతరలో భాగంగా అచ్చంపేట ఆర్టీసీ డిపో నుండి కొండపైకి ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం కొండ పై నుంచి వస్తున్న ఏపీ 21 జెడ్ 0195 నెంబర్ గల ఆర్టీసీ బస్సు ఉమామహేశ్వర మూడవ ఘాట్ రోడ్డు వద్ద అదుపుతప్పి పక్కకు దూసుకెళ్లింది. ఈ క్రమంలో బస్సులో సుమారు 60 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. మూల మలుపు వద్ద బస్సు కంట్రోల్ కాకపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా ప్రమాదం చోటుచేసుకోకుండా అప్రమత్తతతో గుట్టకు తగిలించి బస్సును నిలిపారు. బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఘాట్ ఏరియాలో, కొండపైకి కండిషన్ గల వాహనాలను నడపాలని భక్తులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

# అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలను మంజూరు చేస్తాం



- కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్
- ఊర్కొండపేట గ్రామంలో ఫీల్ వెరిఫికేషన్ ప్రక్రియపై ఆకస్మిక తనిఖీ



**ఊర్కొండ/కల్వకుర్తి, జనవరి18(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు,ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికి మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్ పేర్కొన్నారు.శనివారం మండలంలోని ఊర్కొండపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్ పర్యటించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల సర్వే ఏవిధంగా జరుగుతుందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఊర్కొండ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలుకు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి తప్పులు లేకుండా క్రమపద్ధతిలో రిజిస్టర్లలో నమోదు చేయాలని తద్వారా డేటా ఎంట్రీ సమయంలో పొరపాట్లకు అవకాశం ఉండదని అధికారులకు సూచించారు. గ్రామాలలో రైతు భరోసా,రేషన్ కార్డుల జారీ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న ఫీల్ వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా చేయాలని అన్నారు.అర్హులైన లబ్ధిదారుల వివరాలతో పాటు ఏఏ అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు వారి నుంచి సేకరించిన అంశాలను రిజిస్టర్లలో క్రమపద్ధతిలో నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఫీల్ వెరిఫికేషన్ వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరిస్తూ సమగ్ర వివరాలను సేకరించాలని, ఆధార్ కార్డు,ప్రజాపాలన దరఖాస్తులు,సామాజిక ఆర్థిక సర్వే వివరాలతో క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను సరిచూసుకోవాలని పేర్కొన్నారు.రైతు భరోసా పథకానికి సంబంధించి నాలా కన్వర్షన్,గోదాములు,రైస్ మిల్లులు,డిటిసిపి లేఅవుట్, భూసేకరణ,వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను సర్వే నెంబర్ల వారీగా పరిశీలించాలని,భూ భారతి (ధరణి) పోర్టల్,గూగుల్ మ్యాప్ ల ఆధారంగా వాస్తవ వివరాలను నిర్ధారణ చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు సూచించారు. డిజిటల్ సంతకం ఉన్న పట్టా పాస్ బుక్కులకు సంబంధించి కూడా సదరు భూములలో పంటలు సాగు చేస్తున్నారా లేదా అన్నది క్రాప్ బుకింగ్ వివరాల ఆధారంగా పరిశీలన చేయాలన్నారు. వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భూములను క్షేత్రస్థాయిలో గుర్తించి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని, వాటిని సంబంధిత పోర్టల్ లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందని సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో శ్రీను,మండల ప్రత్యేక అధికారి, సంతోష్ రావు,తహసిల్దార్ రామకోటి, ఎంపీడీవో కృష్ణయ్య,మండల వ్యవసాయ అధికారి దీప్తి, ఎంపిఓ లక్ష్మణ్,పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం, తదితరులు ఉన్నారు.

# భగవంతుని సేవలో అందరూ తరించాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి





**దేవరకద్ర, జనవరి 18 (మనం న్యూస్):** భగవంతుని సేవలో అందరూ తరించాలి అని నూతనంగాఎంపికైన మన్యం కొండ దేవస్థానం పాలకమండలి సభ్యులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారము మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పేదల తిరుపతిగా పేరుగాంచిన మన్యం కొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి పాలకమండలి నూతన సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుని సేవ లభించడం ఇది పూర్వ జన్మ సుకృతం అని, భగవంతునికి చేరువగా చేరి సేవ చేసుకొనే అవకాశం చాలా అరుదుగా మాత్రమే లభిస్తుందన్నారు.మన్యం కొండ దేవస్థానాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకుందామని, ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఈ దేవాలయ విశిష్టత తెలుసునని, అందుకే దేవాలయ అభివృద్ధికై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని గుర్తు చేశారు.భక్తులకు అధునాతన సౌకర్యాలు ఏమి కావాలో వాటిని గుర్తించి అందించే దిశగా ముందుకు సాగుతున్నామని ఆయన స్పష్టం చేశారు.మన్యం కొండ జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, కాబట్టి భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మన్యం కొండ దేవస్థానం వారి నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. అంతకుముందు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే కు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక నిర్వహించారు, వేదపండితులు ఎమ్మెల్యే కి వేద మంత్రాలతో ఆశీర్వాదం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అలహరి మధుసూదన్ చారి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి , వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లు అనిల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంధర్, మరియు మన్యం కొండ దేవస్థానం పాలకమండలి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నత్త నడకన పార్కు పనులు

- పూర్తిగా కుండానే.. మరుగుదొడ్ల నిర్మాణమా!
- జనవరి 25తో పూర్తికానున్న కొత్తగూడెం మున్సిపల్ పాలకవర్గం





**కొత్తగూడెం, జనవరి 17(మనం న్యూస్):** ఏళ్లు గడుస్తున్న అభివృద్ధి అంతంత మాత్రమేనా.. సభలు, సమావేశాలలో మైకు దొరికితే చాలు.. అభివృద్ధి అంతా మా హయాంలోనే జరిగిందంటూ ఊక దంపుడు ఉపన్యాసాలు ఇస్తూ కాలం గడుపుతుంటారు.. ఆచరణలో చూస్తే మాత్రం ఇదిగో ఇలా ఉంటుంది. కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం ఆరో వార్డులో 2021లో పార్కు నిర్మాణం పనులు ప్రారంభించింది. ఐదేళ్లు కావస్తున్నప్పటికీ పనులు మాత్రం నత్త నడకన సాగుతున్నాయి. 2021లో అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు 35 లక్షలతో ఈ నిర్మాణపు పనులు శంకుస్థాపన చేశారు. 2022లో అప్పటి సింగరేణి డైరెక్టర్ (పా) బలరాం పార్కు ను సందర్శించడానికి వచ్చినప్పుడు పార్కు అభివృద్ధి చేయడానికి మరో కోటి రూపాయలు నిధులు మంజూరు చేయాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి డైరెక్టర్ (పా) విన్నవించుకున్నారు. 2023లో అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు రామచంద్ర డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ పార్కు మిగులు పనులు చేపట్టడం కోసం ఎస్డిఎఫ్ నిధులతో 50 లక్షలతో పనులను శంకుస్థాపన చేశారు. 2024లో ప్రస్తుత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రామచంద్ర డిగ్రీ కాలేజ్ పార్కు మిగులు పనులు చేపట్టడం కోసం డిఎంఎఫ్ నిధుల నుంచి 50 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఇక్కడ కేవలం పనులు మాత్రం శిలాఫలకాలకే పరిమితమవుతున్న అంటున్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులలో అన్నిచోట్ల పార్కులు అభివృద్ధి చెంది ప్రజలకు అందుబాటులో ఉండగా రామవరం మున్సిపాలిటీ ఆరో వార్డు లో మాత్రం పనులు పూర్తికాకుండానే మరుగుదొడ్ల పనులు చకచకాగా పూర్తి చేస్తున్నారు. ఈ పార్కు అభివృద్ధి కోసం ఇప్పటివరకు రూ కోటి 35 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టారు. పనులు మాత్రం నత్త నడకన సాగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఈ పార్కులో కేవలం మందుబాబుల కోసమా..?.. లేదా గంజాయి బాబుల కోసమా..? లేక అసాంఘిక కార్యక్రమాల కోసం..? నిర్మించారా.. ఈ పార్కులో నిత్యము గొడవలు జరుగుతున్నాయని అక్టోబర్లో జిల్లా కలెక్టర్ విజిట్ కి వచ్చినప్పుడు స్థానికులు కలెక్టర్కు విన్నవించుకున్నారు.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం, పోలీస్ నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పినా నెలలు గడుస్తున్నా ఇక్కడ సీసీ కెమెరాలు లేవు.. ఏది ఏమైనా కొత్తగూడెం మున్సిపాలిటీ పాలకవర్గం ఈనెల 25వ తేదీన పదవీకాలం పూర్తికానుంది...ఈ పార్కు నిర్మాణానికి ఇప్పటివరకు ఎంత నిధులు వచ్చాయి..?... ఎన్ని నిధులు ఖర్చు పెట్టారు.. మిగిలిన నిధులు ఎంత..?.. పార్కు నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని స్థానికులు సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు.. ఎక్కడైనా అభివృద్ధి పనులు ప్రారంభిస్తే ఇంతకాలంలో పూర్తి చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ.. ఇక్కడ మాత్రం ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ పార్కు నిర్మాణం పనులు అతిగతి లేకుండా పోయింది.. పార్కులో నిర్మించిన వాకింగ్ ట్రాక్ ఎక్కడికక్కడ ధ్వసమైంది.. ఈ పార్కులో వాకింగ్ చేయడానికి వచ్చిన వారికి మద్యం బాటిల్లు పగిలి ఉండడం వల్ల కాళ్లకు గుచ్చుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ..వారికి ఉచిత విద్యుత్, నీరు: కేజ్రీవాల్

ఢిల్లీ, జనవరి 18: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార ఆమ్‌ఆద్మీ ఢిల్లీ ప్రజలకు వరుస సంక్షేమ పథకాలను ప్రకటిస్తోంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తాజాగా మరో హామీని ప్రకటించారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజధానిలోని అద్దె ఇళ్లల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్, నీరు అందిస్తామని పేర్కొన్నారు. పూర్వాంచల్‌కు చెందిన అనేకమంది కౌలుదారులకు సైతం ఉచిత విద్యుత్, నీటి సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

తాము ఉచిత పాఠశాలలు, ఆసుపత్రుల నుంచి ప్రయోజనం పొందుతున్నామని.. కానీ ఉచిత విద్యుత్, నీరు వంటి పథకాలకు దూరంగా ఉంటున్నామని అద్దె ఇళ్లల్లో నివసించేవారు పేర్కొంటున్నారని కేజ్రీవాల్ అన్నారు. అందుకే వారి సమస్యను పరిష్కరించి.. వారికి ప్రయోజనం కలిగించేలా చర్యలు తీసుకోవడానికి తమ పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. ఆప్ ఇప్పటికే వృద్ధుల కోసం సంజీవని స్కీమ్, మహిళా సమ్మాన్ యోజన కింద ప్రతి మహిళకు నెలనెలా రూ.2,100 ఆర్థికసాయం, అర్చకులకు రూ.18వేలు గౌరవ వేతనం మొదలైన హామీలు ఇచ్చిన సంగతి తెలిసిందే.

ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దేశ రాజధానిలోని ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఉచితాల వైపు దృష్టి సారించాయి. తాము అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత రేషన్ కిట్లు, ఏడాదిపాటు నిరుద్యోగ యువతకు ప్రతినెలా రూ.8,500, మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థికసాయం, రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.

ఉచితాలకు దూరంగా ఉండే బీజేపీ 'సంకల్ప పత్ర' పార్ట్-1 పేరుతో విడుదల చేసిన పార్టీ మేనిఫెస్టోలో.. గర్భిణులకు రూ.21వేల ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై రూ.500కే ఎల్పీజీ సిలిండర్లు, 'మహిళా సమృద్ధి యోజన' కింద ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థికసాయం వంటి హామీలను ప్రకటించింది.



### 'అన్‌బ్రేకబుల్ ' డాక్యుమెంటరీ ప్రసారాన్ని నిలిపివేసిన పోలీసులు..

నేడు ఢిల్లీలో విలేకరులతో జరిగిన సమావేశంలో 'అన్‌బ్రేకబుల్ ' అనే డాక్యుమెంటరీని ఆప్ ప్రదర్శించడంపై వివాదం చెలరేగింది. ఈ డాక్యుమెంటరీ ప్రదర్శించడానికి ఆప్ నేతలు తమ అనుమతి తీసుకోలేదని పేర్కొంటూ పోలీసులు ప్రసారాన్ని నిలిపివేశారు. దీనిపై కేజ్రీవాల్ స్పందిస్తూ ఎన్నికలను ఉద్దేశించి ఈ డాక్యుమెంటరీ ప్రసారం చేయలేదని.. స్క్రీనింగ్ ప్రదేశంలో ఎన్నికల జెండా, ప్రచారం వంటివేమీ నిర్వహించలేదన్నారు. బీజేపీ చేస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవ్యతిరేక చర్యలను బహిర్గతం చేస్తున్నామనే భయంతో ఆ పార్టీ ఈవిధమైన చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు.

### కాన్వాయ్‌పై రాళ్ల దాడి..!

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కాన్వాయ్‌పై కొందరు దుండగులు దాడికి యత్నించారు. ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఆప్.. ఇదంతా భాజపా కుట్రేనని ఆరోపించింది.

దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఈ నేపథ్యంలోనే న్యూదిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. అదే సమయంలో కొందరు దుండగులు ఆయన కాన్వాయ్పై రాళ్లు రువ్వారు. ''భాజపాకు ఓటమి భయం పట్టుకుంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆ పార్టీ ఆందోళనకు గురవుతోంది. అందుకే కేజ్రీవాల్ ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఆయన ప్రచారం చేస్తుండగా భాజపాకు చెందిన కొందరు కాన్వాయ్పై రాళ్లు రువ్వారు. కానీ, ఈ చర్యలకు ఆప్ భయపడదు. ఎన్నికల్లో ప్రజలు మీకు తప్పకుండా బుద్ధి చెబుతారు'' అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ఆప్ ఆరోపించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను షేర్ చేసింది. ఈ సంఘటనపై భాజపా స్పందించింది. ఆప్ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ''కేజ్రీవాల్ కాన్వాయ్ ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టింది. వీరిద్దరినీ ఆస్పత్రికి తరలించారు. ముందున్న ఓటమిని గురించి ఆలోచిస్తూ.. ప్రజల ప్రాణాలకున్న విలువను ఆయన మరచిపోయారు. బాధితులను కలిసేందుకు ఆస్పత్రికి వెళుతున్నా'' అని భాజపా నేత పర్వేశ్ వర్మ పోస్టు పెట్టారు. కాగా.. దేశ రాజధానిలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. మూడో సారి అధికారం సాధించేందుకు ఆప్ ప్రయత్నిస్తుండగా.. ఈ సారి ఎలాగైన ఆప్పు గద్దె దించేందుకు కాంగ్రెస్, భాజపా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి.

# ఏరో ఇండియా షో
## మాంసం దుకాణాలపై నిషేధం

బెంగళూరు,జనవరి 18: ఏరో ఇండియా షో నిర్వహించనున్న నేపథ్యంలో బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) కీలక నిర్ణయం తీసుకుంది. జనవరి 23 నుంచి యలహంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్ చుట్టూ 13 కిలోమీటర్ల పరిధిలో మాంసం దుకాణాలను మూసి ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. వాటితో పాటు నాన్-వెజ్ వడ్డించే హోటళ్లు, రెస్టరంట్లకు ఈ ఆదేశాలు వర్తించనున్నాయి. ఫిబ్రవరి 17 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. అసలు ఏరో ఇండియా షోకి నాన్ వెజ్ అమ్మకాలపై నిషేధానికి



సంబంధమేంటంటే..? ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు ఈ ఎయిర్ షో జరగనుంది. సాధారణంగా మాంసాహారం విక్రయించే ప్రదేశాల్లో గద్దలు, డేగలు లాంటి పక్షులు ఎక్కువగా తిరుగుతుంటాయి. పొరపాటున ఎయిర్ షో జరిగే ప్రాంతంలోకి ఇవి ఎగిరొస్తే.. భారీ ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో బీబీఎంపీ చర్యలు తీసుకుంది. ఎయిర్ షో జరుగుతున్న ప్రాంతానికి 13 కిలోమీటర్ల పరిధిలో నిర్దేశిత సమయంలో ఎలాంటి మాంసాహారం విక్రయాలు జరపకూడదని ఆదేశించింది. చేపలు, చికెన్, మటన్ తదితర దుకాణాలన్నింటినీ మూసి వేయాలని, దీనికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరింది. ఆదేశాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. బెంగళూరులో 1996 నుంచి ఎయిర్ షో నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 14 ఎయిర్‌షోలు నిర్వహించిన ఏరో ఇండియా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈ రంగంలోని సంస్థలు తమ ఉత్పత్తులు, సామర్థ్యాలను ప్రదర్శించడానికి దీన్నో వేదికగా భావిస్తారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి దీనిని నిర్వహిస్తున్నారు.

# చావు నుంచి త్రుటిలో తప్పించుకున్నాం: బంగ్లా మాజీ ప్రధాని

ఢిల్లీ, జనవరి 18: తనను హతమార్చేందుకు పలుమార్లు ప్రయత్నాలు జరిగినట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పేర్కొన్నారు. అనూహ్యంగా పదవిని కోల్పోయిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతోన్న విషయం తెలిసిందే. ఈక్రమంలో షేక్ హసీనా కీలక విషయాలు వెల్లడించారు. అధికారంలో ఉన్నప్పుడు తనపై జరిగిన హత్యాయత్నాల గురించి ఆమె తెలిపారు.



గతేడాది ఆగస్టులో అవామీ లీగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో దాదాపు 600 మందికి పైగా మరణించారు. దాంతో ప్రధానిగా ఉన్న షేక్హసీనా తన పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలోనే తనపై హత్యాయత్నం జరిగిందని హసీనా పేర్కొన్నారు. ఆ సమయంలో తాను, తన సోదరి రెహానా 20-25 నిమిషాల వ్యవధిలో చావు నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత భారత్కు చేరుకున్నామన్నారు. అవామీ లీగ్ పార్టీ ఫేస్బుక్ ఖాతాలో ఆడియో సందేశంలో ఆమె ఈమేరకు వ్యాఖ్యానించారు.

గతంలోనూ పలుమార్లు తనపై జరిగిన హత్యాయత్నాల గురించి హసీనా వెల్లడించారు. '2000 ఏడాదిలో కోటలీపర బాంబు దాడి నుంచి బయటపడ్డాను. 2004 ఆగస్టులోనూ ప్రాణాపాయస్థితిలోంచి బయటపడ్డా. మరోసారి 2024 ఆగస్టు 5న చావు నుంచి తప్పించుకోగలిగాను. లేకపోతే ఈపాటికే ప్రాణాలు కోల్పోయి ఉండేదాన్ని' అని హసీనా పేర్కొన్నారు. 'నేను ప్రాణాలతో ఉన్నప్పటికీ.. నా దేశంలో, నా ఇంట్లో ఉండే అవకాశం లేకుండా పోయింది' అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు.

2000 ఏడాదిలో గోపాల్ గంజ్ జిల్లాలోని కోటలీపరలో ఎన్నికల ర్యాలీకి వెళ్లిన హసీనాపై ఉగ్రవాదులు దాడికి యత్నించారు. 'హర్కతుల్ జీహాద్ బంగ్లాదేశ్'కు చెందిన ఉగ్రవాదులు బాంబులు పెట్టి ఆమెను హతమార్చాలని చూశారు. పక్కా సమాచారంతో బాంబు నిర్వీర్య బృందాలు వాటిని తొలగించడంతో దాడి నుంచి హసీనా బయటపడ్డారు. 2004 ఆగస్టులో ఉగ్రవాద వ్యతిరేక ర్యాలీలో దాడి జరిగింది. ఇందులో 24 మంది మృతి చెందగా.. 500 మంది గాయపడ్డారు. ఈ దాడిలో హసీనాకు సైతం గాయాలయ్యాయి.

పదహారేళ్లుగా కొనసాగుతున్న షేక్ హసీనా ప్రభుత్వం గతేడాది ఆగస్టులో జరిగిన ఉద్యమం కారణంగా పడిపోయింది. దీంతో పదవీచ్యుతురాలైన ఆమె.. స్వదేశాన్ని వీడి భారత్‌కు వచ్చి ఓ రహస్య ప్రాంతంలో నివసిస్తున్నారు. ఆ తర్వాత స్వదేశంలో ఆమెపై అనేక కేసులు నమోదయ్యాయి. అరెస్టు వారెంట్లు కూడా జారీ అయ్యాయి. ఈక్రమంలోనే హసీనాను తమకు అప్పగించాలంటూ గత డిసెంబరులో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం భారత ప్రభుత్వానికి ఒక దౌత్య సందేశం పంపింది. అయితే, 'ఈ వ్యవహారంపై తాము వ్యాఖ్యానించాల్సిందేమీ లేదు' అని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అప్పట్లో ప్రకటించారు. ఈ క్రమంలోనే ఆమె పాస్‌పోర్టును బంగ్లా ప్రభుత్వం రద్దు చేసింది.

# మీరు ఫ్యాషన్ డిజైనర్ కాదు


- **బిహార్ సీఎం నీతీశ్ కుమార్‌పై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తీవ్ర విమర్శలు**

పట్నా, జనవరి 18: మహిళల వస్త్రధారణను ఉద్దేశిస్తూ బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ చేసిన వ్యాఖ్యలపై ఆర్జేడీ నేత, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యలు బిహార్‌లోని సగం జనాభాకు అవమానకరమని తీవ్ర విమర్శలు చేశారు.

''ప్రస్తుతం యువతుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. అదే విధంగా వస్త్రాధారణ కూడా బాగుంది. అయితే.. గతంలోనూ అమ్మాయిలు మంచి దుస్తులు ధరించడం మనమంతా చూశాం కదా. కానీ, సీఎం నీతీశ్ చేసిన వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయి. మీరు ఒక సీఎం.. మహిళలకు ఫ్యాషన్ డిజైనర్ కాదు. మీ ఆలోచనలు తారుమారువుతున్నాయి. మీరు ఫ్యాషన్ డిజైనర్‌గా ఉండేందుకు ప్రయత్నించకండి. నీతీశ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలోని సగం జనాభాకు అవమానకరం'' అని తేజస్వీ యాదవ్ విమర్శించారు.

కాగా.. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం నీతీశ్ కుమార్ మహిళల వస్త్రాధారణ గురించి మాట్లాడారు. ''నేను అధికారంలోకి వచ్చి ఎన్నో ఏళ్లు అవుతోంది. నాటితో పోలిస్తే ఇప్పుడు అమ్మాయిల ఆత్మవిశ్వాసం ఎంతో మెరుగుపడింది. అన్ని అంశాలపై వారు చక్కగా ప్రసంగించగలుగుతున్నారు. వస్త్రధారణలోనూ మంచి మార్పు వచ్చింది. గత పాలకుల హయాంలో ఈ పరిస్థితి లేదు'' అని వ్యాఖ్యానించారు. సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టిన తేజస్వీ యాదవ్ ఆయనపై విమర్శలు గుప్పించారు.

# బీజాపూర్ ఎన్‌కౌంటర్..
## బడే చొక్కారావు మృతి



నారాయణపూర్, జనవరి 18: రెండ్రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్- మారేడుబాక అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో తెలంగాణకు చెందిన మావోయిస్టు కీలక నేత మృతిచెందారు. మావోయిస్టు తెలంగాణ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న బడే చొక్కారావు అలియాస్ దామోదర్ పోలీసు కాల్పుల్లో మృతి చెందినట్టు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. దామోదర్‌పై గతంలో రూ.50లక్షల రివార్డు ఉంది. బడే చొక్కారావు (దామోదర్) స్వస్థలం ములుగు జిల్లా కాల్వపల్లి. బీజాపూర్ ఎన్‌కౌంటర్లో మొత్తం 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. గురువారం జరిగిన ఎన్‌కౌంటర్ అనంతరం భద్రతా బలగాలు మావోయిస్టుల ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంతోపాటు భారీ బంకర్‌ను గుర్తించాయి. ఇందులో సొరంగల్ దేశవాళీ రాకెట్ లాంచర్లు, పెద్దఎత్తున యంత్రాలు, మందుగుండు సామగ్రి, విద్యుత్తు లైన్ నిర్మించే సిల్వర్ వైర్లు లభించాయి.

# ఒహైయో నుంచి గవర్నర్ రేసులో వివేక్ రామస్వామి!

వాషింగ్టన్, జనవరి 18: భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి తన సొంత రాష్ట్రం ఒహైయో నుంచి గవర్నర్ ఎన్నికల్లో పోటీ చేస్తారని అమెరికాకు చెందిన పలు వార్తా సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఈ పోటీ గురించి రామస్వామి త్వరలో ప్రకటన విడుదల చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం డొనాల్ ట్రంప్ రూపొందించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీకి వివేక్, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ సంయుక్త సారథులుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. వృథా ఖర్చులను తగ్గించడం, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగాడోజ్ పని చేస్తుంది. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొనే 2026 జులై 4వ తేదీలోపు డోజ్ లక్ష్యాన్ని పూర్తి చేసి, గవర్నర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి వివేక్ సమాయత్తమవుతున్నట్లు సమాచారం. ఒహైయో గవర్నర్ ఎన్నికలు నవంబర్ 2026లో జరగనున్నాయి. ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా అవకాశం కోసం రామస్వామి తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యారు. అనంతరం రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్ ట్రంప్ విజయం కోసం తీవ్రంగా శ్రమించారు. 38 ఏళ్ల ఈ బయోటెక్ పారిశ్రామికవేత్త నిస్సంకోచంగా మాట్లాడతారనే పేరుంది. ట్రంప్ తరఫున ఇంటర్వ్యూల్లో వాదనలు వినిపించారు. రామస్వామి పనితీరును గమనించిన డొనాల్డ్.. పెన్సిల్వేనియాలో జరిగిన సభలో ఆయన్ను తన కార్యవర్గంలోకి తీసుకొంటానని ప్రకటించారు. మొదట ఆయనకు విదేశాంగ శాఖ బాధ్యతలు అప్పగించనున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ట్రంప్ ప్రచార బృందంలో కీలక భూమిక వహించిన మార్కో రూబియోకు ఆ శాఖ దక్కే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వివేక్ రామస్వామి ఒహాయోలో ఆగస్టు 9, 1985లో జన్మించారు. ఆయన వయస్సు 37 సంవత్సరాలు. కేరళకు చెందిన ఆయన తల్లిదండ్రులు ఆమెరికాకు వలస వచ్చారు. ఆయన సోషల్ మీడియాలో తనను తాను క్యాపిటలిస్ట్, సిటిజెన్గా అభివర్ణించుకుంటారు. హార్వర్డ్ నుంచి బయోలజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. యేల్ లా స్కూల్లో ఉన్నతవిద్యను పూర్తి చేశారు.

# ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం: రాహుల్

పట్నా,జనవరి 18: దేశ స్వాతంత్ర్యం విషయంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఆయన రాజ్యాంగ విరుద్ధంగా వ్యాఖ్యానించారని మండిపడ్డారు. బిహార్ రాజధాని పట్నాలో జరిగిన 'సంవిధాన్ సురక్ష సమ్మేళన్' కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ''బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. అణగారిన వర్గాలను నిర్లక్ష్యం చేస్తున్నాయి. మైనారిటీ, దళితులు రాజకీయాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ, వారికి ఎలాంటి అధికారాలు ఉండడం లేదు. ఆర్‌ఎస్‌ఎస్ సహ



మరికొన్ని సంస్థలే దేశాన్ని నడుపుతున్నాయి. దేశ సంపద కొందరు పారిశ్రామిక వేత్తల చేతుల్లోనే ఉంది. భారత రాజ్యాంగం ఒక పుస్తకం మాత్రమే కాదని.. దళితులు ఎదుర్కొన్న అన్యాయాల గురించి అది మాట్లాడుతుంది'' అని రాహుల్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన కచ్చితంగా అవసరమని.. ఇది అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తుందని రాహుల్ అన్నారు. కాగా.. ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్వాతంత్ర్యం విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందన్నారు. శత్రువులతో భారత్ ఎన్నో శతాబ్దాల పాటు పోరాడిందని.. అయితే రామమందిర ఉద్యమం ఎవరినీ వ్యతిరేకించడానికి ప్రారంభించింది కాదన్నారు. దేశం తనను తాను మేలుకొల్పుకోవడానికి చేసింది మాత్రమేనని అన్నారు. భారత్ తన కాళ్లపై నిలిచి ప్రపంచానికి మార్గం చూపుతుందని.. రామమందిర ప్రతిష్ఠాపన సందర్భంగా దేశంలో ఎలాంటి అసమ్మతి చోటు చేసుకోలేదన్నారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. మోహన్ భాగవత్ రాజ్యాంగ విరుద్ధంగా మాట్లాడారని విమర్శించారు.

# కాల్పుల విరమణకు వేళాయే.. లెక్క తేలేనా?

గాజా, జనవరి 18:ప్రపంచమంతా ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న గాజా కాల్పుల విరమణ ఒప్పందానికి వేళైంది. అక్కడి కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 6:30 గంటలకు ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రానుంది. ఈ మేరకు ఖతార్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. ఈ రెండు వర్గాల కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం అధికారిక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. తొలివిడతగా ఆరు వారాల్లో బందీల మార్పిడి ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఒప్పందంతో గాజాలో మళ్లీ శాంతి వీచికలు వీస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ శాంతి ఒప్పందంతో బందీలుగా ఉన్న వందలాది మంది.. తమ కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

### విడుదలయ్యేది ఎవరెవరు?

ఇజ్రాయెల్ జైళ్లలో బందీలుగా ఉన్నవారిలో తొలి విడతగా 737 మందిని విడుదల చేయాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు న్యాయశాఖ ధ్రువీకరించింది. వీరిలో పురుషులు, మహిళలతో సహా పలువురు చిన్నారులు కూడా ఉన్నారు. అయితే, ఖతార్ మంత్రి చెప్పినట్లుగా ఉదయం 6.30 గంటలకు బందీల విడుదల ప్రారంభం కాకపోవచ్చు. సాయంత్రం 4 గంటల వరకు ఈ విషయంపై ముందుకు వెళ్లబోమని ఇజ్రాయెల్ న్యాయశాఖ చెబుతోంది. బందీల మార్పిడిపై కచ్చితమైన స్పష్టత వచ్చిన తర్వాతే



ముందడుగు వేస్తామని చెబుతోంది.

### జకారియాకు ఎదురుదెబ్బ

కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినా.. జకారియా జుబేదీకి ప్రయోజనం కనిపించడం లేదు. పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ ఆర్మీ విభాగానికి ఆయన నేతృత్వం వహిస్తున్నాడు. పాలస్తీనియన్ల దృష్టిలో అతడో రియల్ హీరో. అయితే, ఇజ్రాయెల్ విడుదల చేయబోతున్న జాబితాలో జకారియా పేరు లేదు. వామపక్ష నేత, లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా పార్టీ సభ్యుడు ఖలీఫా జరార్ మాత్రం విడుదలకానున్నారు. ఈ పార్టీని ఇజ్రాయెల్ సహా, అమెరికా, ఈయూ కూడా ఉగ్రవాద గ్రూపులో చేర్చాయి. అయినప్పటికీ, జరార్ విడుదలకు ఇజ్రాయెల్ సుముఖత చూపడం గమనార్హం.

జాబితా ప్రకారం..737 మందిని విడుదల చేయాలని ఇజ్రాయెల్ నిర్ణయించినప్పటికీ.. హమాస్ చెర నుంచి తమ దేశపౌరులు ఎంత మంది విడుదలవుతారన్న దానిపై తమ నిర్ణయం ఆధారపడి ఉంటుందని ఇజ్రాయెల్ అధికార ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు.

### హమాస్ చెరలో ఎంతమంది?

అక్టోబరు 7, 2023న సరిహద్దులు దాటి ఇజ్రాయెల్లోకి ప్రవేశించి 1200 మంది ఇజ్రాయెల్ పౌరులను హతమార్చి, దాదాపు 251 మందిని హమాస్ బందీలుగా తీసుకెళ్లిపోయింది. అందులో 34 మంది మరణించినట్లు ఇజ్రాయెల్ అంచనా వేస్తోంది. ప్రస్తుతం 94 మంది గాజాలో ఉన్నారు. వారిలో తొలి విడతగా 33 మందిని హమాస్ విడుదల చేసే అవకాశముంది. వారిలో ముగ్గురు మహిళా సైనికులు ఉన్నట్లు సమాచారం.

అక్టోబరు 7 దాడి తర్వాత పశ్చిమాసియాలో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కిపోయాయి. హమాస్‌కు మద్దతుగా హెజ్‌బుల్లా, హూతీ ఉగ్రవాదులు ఇజ్రాయెపై బాంబులతో విరుచుకుపడ్డాయి. ఇరాన్, ఇజ్రాయెల్ పరస్పర క్షిపణి దాడులకు పాల్పడ్డాయి. 46 వేల మంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందారు. ఈ యుద్ధాన్ని నివారించడానికి ప్రపంచ దేశాలు తీవ్ర ప్రయత్నాలు చేశాయి. కాల్పుల విరమణ కోసం ఈజిప్టు, ఖతార్ ఇరుపక్షాలతో చర్చలు జరిపాయి. ఈ ఒప్పందానికి అమెరికా మొదటినుంచి మద్దతుగా ఉంది. ప్రస్తుతం జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఖతార్ మధ్యవర్తిత్వం వహించింది. కాల్పుల విరమణకు ఇరువర్గాలు అంగీకరించడంతో ఆదివారం నుంచి అమల్లోకి రానుంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. పశ్చిమాసియాలో మళ్లీ శాంతి వీచికలు వీయనున్నాయి.

# సైఫ్‌పై దాడి కేసు.. ఛత్తీస్‌గఢ్‌లో నిందితుడి అరెస్ట్

- **నిందితుడిని అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు**



ముంబయి, జనవరి 18: ప్రముఖ బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై కత్తితో దాడి చేసిన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వే స్టేషన్లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌అధికారులు ఓ అనుమానిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ముంబై-హౌరా రైలులో ప్రయాణించిన ఆకాశ్ కనోజియా అనే అనుమానిత వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. రైల్వే అధికారుల ప్రకారం నిందితుడు మధ్యాహ్నం సమయంలో దుర్గ్ రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు అయ్యాడు. ఆ వ్యక్తి ముంబై-హౌరా రైలులో ప్రయాణిస్తున్నట్లు గుర్తించిన అధికారులు, వెంటనే పట్టుకున్నారు. నిందితుడిని పట్టుకున్న తరువాత, ముంబై పోలీసులకు ఈ విషయం గురించి సమాచారం అందించామని రైల్వేఅధికారులు తెలిపారు. ముంబై పోలీసుల బృందం సాయంత్రం నాటికి దుర్గ్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారని అధికారులు అన్నారు. వారు వచ్చి చూసి విచారించిన తర్వాత, దాడి చేసిన వ్యక్తి అతనేనా కాదా అనేది తేలనుంది.

# ఇజ్రాయెల్- హమాస్ ఒప్పందం.. హెజ్‌బుల్లా స్పందన ఏంటంటే..!

గాజా, జనవరి 18: ఇజ్రాయెల్- హమాస్ల మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై హెజ్‌బుల్లా అగ్రనేత నయీం ఖాసిం స్పందించారు. ఈ శాంతి ఒప్పందంపై హెజ్‌బుల్లా అగ్రనేత నయీం ఖాసిం స్పందిస్తూ హమాస్‌కు అభినందనలు తెలిపారు. పాలస్తీనా ప్రజల త్యాగాలు.. వారి లక్ష్యాన్ని తుడిచిపెట్టాలనుకున్న ఇజ్రాయెల్ ప్రయత్నాలకు అడ్డుకట్ట వేశాయని..అందుల్లే ఈ ఒప్పందం సాధ్యమయ్యిందని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ తాను అనుకున్నది సాధించలేకపోయిందని అన్నారు.

ఇజ్రాయెల్ - హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. గాజాలో శాంతి స్థాపన కోసం ఇరు పక్షాలు అంగీకరించాయి. కాల్పుల విరమణ ఒప్పందం, బందీల విడుదలకు సంబంధించి మధ్యవర్తులకు తమ ప్రతినిధి బృందం అంగీకారం తెలిపిందని హమాస్ పేర్కొంది. ఈ విషయాన్ని ప్రముఖ వార్త ఏజెన్సీ రాయిటర్స్ పేర్కొంది. దీంతో 15 నెలలుగా జరుగుతున్న భీకర పోరాటానికి ముగింపు పలికినట్లైంది. తొలుత 6 వారాల పాలు ఈ ఒప్పందం అమలులో ఉండనుంది. ఇందులో భాగంగా ఇజ్రాయెల్ బలగాలు గాజాను క్రమంగా వీడుతాయి.



మనం Manam



# మహిళా ఉద్యోగులు స్వేచ్ఛగా విధులు నిర్వహించుకోవాలి

- అందరికీ పోష్ యాక్ట్-23 గురించి అవగాహన కల్పించాలి
- అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్
- పని ప్రదేశంలో వారికి భద్రత కల్పించడం
- మహిళా చట్టాల పై అవగాహనక లిగి ఉండాలి
- న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీశ్రీవాణి




**సూర్యాపేట, జనవరి 18 (మనం ప్రతినిధి):** జిల్లాలో పనిచేసే మహిళలపై ఎలాంటి లైంగిక వేధింపులకు గురైన మహిళలు అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ నిషేధ పరిష్కార చట్టంపై జిల్లా సమైక్య మహిళలకు మండల సమైక్య మహిళలకు ఎన్జీవోలకు మహిళా ఉద్యోగులకు మహిళా శిశు సంక్షేమ శాఖ లోని మహిళా సాధికారత కేంద్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ మాట్లాడుతూ.... మహిళలు స్వేచ్ఛగా తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలన్నారు పదిమంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్న ప్రభుత్వ ప్రైవేటు సంఘటిత అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న ఉన్నచోట మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు నిరోధించడానికి మహిళలు ధైర్యంగా తమ పనులు చేసుకోవడానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ప్రతి శాఖ అధికారి హోటల్స్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ హాస్పిటల్స్ నందు కూడా కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 10 మంది కంటే తక్కువ ఉన్న ప్రభుత్వ , ప్రైవేట్ సంస్థలలో చెందినవారు ఎలాంటి వేధింపులు జరిగిన జిల్లా స్థాయిలో ఉన్న స్థానిక ఫిర్యాదుల కమిటీ లో ఫిర్యాదు చేసుకొనవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసే మహిళ విషయమై గోప్యంగా ఉంచుతాం: శ్రీవాణి మహిళలు వేధింపుల విషయమై ఫిర్యాదు చేస్తే గోప్యంగా ఉంచి విచారణ చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీవాణి అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ... మహిళ ఉద్యోగి నెల ఇష్టానికి వ్యతిరేకంగా ఉండే ఎటువంటి లైంగిక చర్య అయిన పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల కిందికి వస్తుందని తెలిపారు. మహిళలు తమ ఫిర్యాదులను అంతర్గత ఫిర్యాదుల కమిటీ కి అందజేయాలని తెలిపారు వేధింపులకు గురైన మహిళల దరఖాస్తులను 90 రోజులలో ఐసి కమిటీ మెంబర్లు పరిష్కరించడం జరుగుతుందని వెల్లడించారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఉండి (ప్రభుత ,ప్రైవేటు) అధికారి ద్వారా జరిగిన లైంగిక వేధింపులకు గురి అయిన ఎడల స్థానిక ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేసుకోవచ్చని తెలియజేశారు. సంఘటన జరిగిన వెంటనే ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు .అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఈ యొక్క సభ్యుల బాధ్యతలను వివరించడం జరిగింది వేధింపులకు గురి అయిన మహిళ మూడు నెలల కాలం లోపు ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు జిల్లాలో ఉన్న ఎన్జీవోలు అందరూ జిల్లా మహిళా సమైక్యలు కూడా మహిళా చట్టాలపై మహిళలందరికీ అవగాహన పరచాలని ఆమె తెలిపారు మహిళలకు వికలాంగులకు పిల్లలకు ఉచిత న్యాయ సేవలు అందించబడతాయని దానికి టోల్ ఫ్రీ నెంబర్ 15100 ఫోన్ చేయవచ్చని చెప్పారు .విద్యార్థులు అమ్మాయిలు తెలియని వ్యక్తులతో అస్సలు మాట్లాడవద్దని సోషల్ మీడియా ఇది వాడు రావట్లే సోషల్ మీడియా ఇన్స్టాగ్రాము లలో వచ్చే ఫేక్ సమాచారాలకు సమాధానం ఇవ్వవద్దని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమ ంలో డిడబ్ల్యుఓ నరసింహారావు, ఏసీడీపీఓ రూప, స్థానిక ఫిర్యాదుల కమిటీ చైర్మన్ శిరీష, సభ్యులు లత ,అనసూయ, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య నాయుడు ,జండర్ స్పెషలిస్టులు రేవతి, వినోద్, తేజస్విని, క్రాంతి, సఖి సిబ్బంది ,ఎన్జీవోలు, డిఎల్ఎస్ఎ సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమ తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవు

- ఇంచార్జి తహసీల్దార్ శ్రీనివాస్





**అడవిదేవులపల్లి, జనవరి 18,(మనం న్యూస్ ):** అక్రమ తవ్వకాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అడవిదేవులపల్లి మండల ఇంచార్జి తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం నాడు మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామ శివారులో ని సర్వే నెంబర్ 1 లో కొందరు అక్రమార్కులు జేసీబీలు పెట్టి ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న ట్లు తహసీల్దార్ కార్యాలయం లో ఫిర్యాదు అందినది. దీనితో తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాలమేరకు తక్షణమే ఆర్. ఐ శ్యామ్ సుందర్ అక్రమంగా తరలిస్తున్న ప్రదేశానికి వెళ్లి ప్రభుత్వభూమిలో యంత్రాలు పెట్టిన జేసీబీ, ట్రాక్టర్ లను ఆ ప్రాంతం నుఁడి పంపించి వేసి జేసీబీ డ్రైవర్, ట్రాక్టర్ డ్రైవర్ల ను మరల త్రావ్వకాలు చేబడితే యంత్రాలను సీజ్ చేసి చట్ట పరమైన చర్యలు తీసుకొంటామని హేచ్చారించిన్నారు...ఈ సందర్భంగా ఇంచార్జి తహసీల్దార్ మాట్లాడు తూ మండలంలో సుద్ద, మొరం, మట్టి, కొందరు అక్రమంగా తవ్వి అమ్ముకుంటున్నట్టు తెలసిందన్నారు. ఎంతటివారైనా సరే అక్రమ తవ్వకాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పీడీ, పీఈటీల సంఘం ఏర్పాటు

**నల్లగొండ, జనవరి 18(మనంన్యూస్):** గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా ఫిజికల్ డైరెక్టర్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ ఏర్పాటు శుక్రవారం నల్గొండ పట్టణంలో పిఆర్టియు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా ఫిజికల్ డైరెక్టర్స్ మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ ను ఏర్పాటు చేయడం జరిగింది. అసోసియేషన్ చైర్మన్ గా బొమ్మపాల గిరిబాబు, అధ్యక్షులుగా ఇమామ్ కరీం, ప్రధాన కార్యదర్శిగా నారాయణ కవిత, కోశాధికారిగా ఽబాలరాజు యాదవ్, ఉపాధ్యక్షులుగా కేతావత్ శ్రీనివాస్, ఎండీ .అజీజ్, జాయింట్ సెక్రెటరీలుగా అ.రవీందర్ రెడ్డి ఎండీ . ఇర్ఫాన్, కార్యవర్గ సభ్యులుగా ఈద సరిత లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.ఈ సందర్భంగా గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తూ పిఆర్టియు తెలంగాణ పక్షాన ఎన్నో పోరాటాలు చేస్తున్నామని దానికి అనుగుణంగా త్వరలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, గురుకుల, ఆదర్శ పాఠశాలలు, మోడల్ హైస్కూల్స్, ఓఎఆగ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, మరియు సాంకేతిక, జూనియర్ డిగ్రీ కళాశాలలోని అధ్యాపకులు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు ద్వారా తనను గెలిపిస్తే మీ కుటుంబ సభ్యుడినై నిరంతరం మీ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని తెలియ చేశారు. అనంతరం నల్గొండ జిల్లా ఫిజికల్ డైరెక్టర్ల మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తూ కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి పాఠశాలలో ప్రత్యేకమైన క్రీడా బడ్జెట్ ఏర్పాటు చేసేందుకై కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమాకర్ రెడ్డి, చిలుముల బాల్ రెడ్డి, కొడిదల శంకర్, మనిరాజు, గాదె లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర నుండి తెలంగాణ కు అక్రమ ఇసుక రవాణా

**చింతలపాలెం, జనవరి 18 (మనం న్యూస్):** శనివారం తెల్లవారుజామున ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట వైపు నుండి తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, చింతలపాలెం వైపు అక్రమంగా ఇసుకను రెండు లారీల ద్వారా అక్రమంగా తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు చింతలపాలెం పోలీస్ వారు, దొండపాడు గ్రామ శివారు వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న లారీలను నీ పట్టుబడి చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చి చింతలపాలెం ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడమైనది.ఈ ఇసుక లారీలలో ఒక లారీ హైదరాబాద్ కు, ఇసుకను తీసుకొని వెళుతున్నది. రెండవ లారీ మేళ్లచెరువు కు ఇసుకను అక్రమంగా తీసుకొని వెళుతున్నది. ఈ లారీ డ్రైవర్ పేరు జడ సురేష్, ఎస్.కె నాగ సైదా ల ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టుగా చింతలపాలెం ఎస్సై అంతిరెడ్డి చెప్పారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత





**మునుగోడు, జనవరి 18(మనం న్యూస్):** మండలంలోని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం రోజున ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సీఎం సహాయనిది పేదలకు వరం లాంటిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో.పట్టణ అధ్యక్షుడు సాగర్ల లింగస్వామి,మిర్యాల వెంకన్న, పాల్వాయి జితేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, పందుల భాస్కర్, ఎండీ అన్వర్, పందుల శ్రీను, సాయి, జిట్ట గోని సైదులు, ముచ్చపోతుల నరసింహ, పందు ల అశోక్, దుబ్బ ప్రభాకర్, తదితరులు, పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్ధారణకు పరీక్షలు




- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి

**పెన్ పహాడ్, జనవరి 18 (మనం న్యూస్):** క్షయ వ్యాధిని గుర్తిస్తే నివారణ సులభతరం అవుతుందని పెన్ పహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి అన్నారు శుక్రవారం మండలంలోని ఛీదెళ్ళ గ్రామంలో తన అధ్వర్యంలో ప్రత్యేక నిక్షయ శివర్ క్యాంప్ నిర్వహించగా పాల్గొని మాట్లాడారు 60 సంవత్సరాల పై బడిన మధుమేహం (షుగర్) వ్యాధి లక్షణాలు, టీబీ వ్యాధి లక్షణాలు ఉన్నటువంటి గత ఐదు సంవత్సరాల క్రితం వున్న క్షయ వ్యాధి రోగులను గుర్తించి గత రెండు సంవత్సరాలుగా వున్న టీవీ రోగులతో నివసిస్తున్న వారి కుటుంబ సభ్యులకు, మధ్య పానం,ధూమపానం, 18.5 బిఎంఐ పోషకాహారలోపంతో బరువు తక్కువగా వున్న 30 మందిని గుర్తించి వారినుండి కళ్లె (తేమడ) నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం సి బి నాట్ ల్యాబ్ కు పంపడం జరిగిందని, 80మందికి ఎక్స్రే తీయడం జరిగిందని ఈ ఎక్స్రే, మరియు తేమడ పరీక్ష లో క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలు ఉచితంగా మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇవ్వడం జరుగుతుందని వైద్యాధికారి తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నాజియా,శ్రీశైలం, ఎం పి హెచ్ ఓ బూతరాజు శ్రీనివాసులు,టి. చంద్రశేఖర్ రాజు, ఎం ఎల్ హెచ్ పి ప్రియాంక, ఎం పి హెచ్ ఎ ప్రేమ్ కుమార్, ఎం పి హెచ్ ఎ రేణుక, మాధవి ,ఎల్ టి లింగాల రాజు, డి ఆర్ టి బి ప్రసాద్, డీఈవో మాధవరెడ్డి, ఆశా కార్యకర్తలు నీలావతి, నాగమణి, వనజ, లలిత, రాణి, పంచాయతీ కార్యదర్శి దారావత్ రమేష్,గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.

# 26 న తుంగతుర్తి సభను విజయవంతం చేయండి



**తిరుమలగిరి, జనవరి 18(మనం న్యూస్):** జనవరి 26న తుంగతుర్తిలో జరిగే మాదిగల ఏబిసిడి వర్గీకరణ సభను విజయవంతం చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రేమ కార్యాలయంలో విలేకరుల సమావేశ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభ మాలలకు వ్యతిరేకం కాదని మాలలు మాదిగలు కలిసి అన్నదమ్ముల వలె ఎవరికి దక్కవలసిన రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధంగా వర్గీకరణ చేసుకుందామని అన్నారు. ఏబిసిడి వర్గీకరణ అమలు చేసే బాధ్యత రాష్ట్రాలకి సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఏబిసిడి వర్గీకరణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయడానికి సబ్ కమిటీని వేశారని చెప్పారు. మాదిగలో ఉన్న ఉప కులాలకు అన్యాయం జరుగుతున్నందున ఏబిసిడి వర్గీకరణ చేయాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మాదిగలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశ ంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు వై. నరేష్, పట్టణ శాఖ అధ్యక్షులు పేరాల వీరేష్, జిల్లా నాయకులు సుంకరి జనార్ధన్,పి. ఏ సి ఎస్ చైర్మన్ పాలేపు చంద్రశేఖర్, కందుకూరి లక్ష్మయ్య, దానయ్య, సుధాకర్, వంశీ, కడియం పరమేష్, గుడిపాటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# టాలెంట్ టెస్ట్ లో రాష్ట్రస్థాయి సత్తా చాటిన విద్యార్థులు

**సూర్యాపేట, జనవరి 18 (మనం ప్రతినిధి):** ఐఐటి ఫౌండేషన్ కొలమానంగా పరిగణించబడుతున్న డాక్టర్ ఏఎస్ రావు అవార్డు కౌన్సిల్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల్లో నిర్వహించిన 34వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ రెండు వ లెవెల్ పరీక్ష లో శనివారం ప్రకటించిన ఫలితాలలో సిటి టాలెంట్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మరోసారి సత్తా చాటారు. ఇందులో భాగంగా పదో తరగతిలో వై .ప్రజ్ఞా రెడ్డి 3వ ర్యాంకు, ఎస్. సాయి గోకుల్ 5వ ర్యాంకు, బి. ప్రణవి 19 ర్యాంకు సాధించగా 9వ తరగతి నుండి ఆర్. వెంకట సాయి ప్రణవ్ 3వ ర్యాంకు, డి. దినేష్ మల్లిక్ 4వ ర్యాంకు సాధించారు. రెండు రాష్ట్రాల్లో ఎంపికైన మొత్తం 43 మంది విద్యార్థుల్లో 5 మంది సిటీ టాలెంట్ స్కూల్ విద్యార్థులు నిలబడటం ఎంతో ఆనందంగా ఉందని కరస్పాండెంట్ ఆర్ ప్రకాష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మురళీధర్ ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచిన విద్యార్థులను అభినందించారు.



# గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పూర్తి చేయాలి



- శఖటాలు స్టాల్స్ ప్రదర్శన ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, జనవరి 18 (మనం ప్రతినిధి):** 76వ గణతంత్ర వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అని ఏర్పాట్లు త్వరగా తిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం ఐడిఓసి ప్రదాన సమావేశ మందిరం నందు జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... 76వ గణతంత్ర వేడుకలను స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు నిర్వహించుటకు అధికారులు ముందు ప్రణాళికలు రూపొందించుకొని సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల పై స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులతో సంస్క ృతిక కార్యక్రమాల నిర్వహణ అదేవిధంగా అధికారులకు, సిబ్బందికి ఉత్తమ ప్రశంసా పత్రాలు ఇచ్చుటకు గాను సంబంధిత శాఖాధిపతులు తమ సిబ్బంది పేర్లను 21తేది కల్లా పంపించాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయుచున్న 6 గ్యారంటీ పథకాల ప్రచారంపై శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సంస్పృతికకార్యక్రమాలు నిర్వహించాలని, మున్సిపల్ శాఖ త్రాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లను చేయాలని అన్నారు ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ జనార్దన్ రెడ్డి , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ పహాడ్, శూన్య పహాడ్ డెవలప్ మెంట్‌కు భారీగా సీఎస్ఆర్ ఫండ్స్ ను కేటాయించాలి

- హామీలను విస్మరిస్తే గేట్లకు తాళం వేస్తాం
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, జనవరి 18 (మనం న్యూస్):** నల్గొండ జిల్లా దామరచర్ల మండల పరిధి గణేష్ పహాడ్ వద్ద అదానీ పెన్నా సిమెంట్ పరిశ్రమలో సున్నపురాయి అదనపు ఉత్పత్తుల పై శనివారం చేపట్టిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా ముగిసింది. స్థానికుల నుంచి అధికారులు, కంపెనీ ప్రతినిధులు సదుపాయాల కల్పన, ఉద్యోగ అవకాశాలపై వినతి పత్రాలను స్వీకరించారు. ఆదానీ పెన్నా సిమెంట్ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు విచ్చేసిన మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడారు. దామరచర్ల మండల పరిధి గణేష్ పహాడ్, సూర్యాపేట జిల్లా పాలకీడు మండల పరిధి శూన్య పహాడ్ ప్రాంతంలో సుమారు రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైన పెన్నా సిమెంట్ ఈ ప్రాంత అభివృద్ధికి అనేక హామీలిచ్చి విస్మరించినట్లు ఇక్కడ ప్రజల ద్వారా తెలిసిందన్నారు. రోడ్లు, కరెంటు, స్కూల్స్, ఇతర డెవలప్ మెంట్ పనులకు ప్రస్తుత ఆదానీ పెన్నా సిమెంట్ యాజమాన్యం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్ ను పెద్ద మొత్తంలో కేటాయించాలని కోరారు. ఈ ప్రాంత ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వాలన్నారు. దామరచర్ల మండల పరిధిలో రెండు సిమెంట్ ఫ్యాక్టరీలు, పవర్ ప్లాంట్ ద్వారా వచ్చే నిధులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మించాలన్నారు. సిమెంట్ పరిశ్రమ ఇచ్చిన హామీలను, సమస్యలను పరిష్కరించకపోతే గేట్లకు తాళాలు వేయడం తప్పదన్నారు. స్థానికులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఇతర చోట్లకు బదిలీ చేయకూడదని కోరారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సిమెంట్ అందించాలన్నారు. అనంతరం పలువురు ఎన్జీవో సంఘాలు, నాయకులు కంపెనీ అదనపు ఉత్పత్తుల కోసం సహకరిస్తున్నట్లు చెప్పారు. నల్గొండ, సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్లు శ్రీనివాసరావు, రాంబాబు మాట్లాడారు. ప్రజల అభిప్రాయం మేరకే అనుమతులు వస్తాయని చెప్పారు. సున్నపురాయి అదనపు ఉత్పత్తుల కోసం ఆదానీ పెన్నా సిమెంట్ ప్రస్తుతం 354. 236 హెక్టార్లలో సున్నపురాయిని సేకరిస్తుండగా అదనంగా ఉత్పత్తులు పెంచుకోవడానికి 1.864 ఎంటీపీఏ ను 2.263 ఎంటీపీఏ వరకు పెంచుకునే ప్రతిపాదన తో పాటు 33 వినతులను కోరినట్లు తెలిపారు. దీంతోపాటు ప్రజాభిప్రాయ సేకరణలో ఎన్జీవో సంఘాల నుంచి, గ్రామస్తుల నుండి 40 విజ్ఞప్తులు వచ్చినట్లు చెప్పారు. అన్ని రకాల అభిప్రాయాలను కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు పంపనున్నట్లు తెలిపారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కంపెనీ జీఎం లక్ష్మణ్ హామీ ఇచ్చారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, పర్యావరణ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయలక్ష్మీ, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు ఉన్నారు.

# నిరుపేద కుటుంబాలకు చేయూతనిచ్చిన డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

**భువనగిరి, జనవరి 18(మనం న్యూస్):** భువనగిరి మండలం తాజ్పూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబాలకు తన వంతు సహాయంగా సామాజికవేత్త, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ శనివారం బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఓరుగంటి నరసింహ గౌడ్ కుటుంబానికి 5000 వేల రూపాయలు, కోట ఎల్లయ్య కుటుంబానికి 5000 వేల రూపాయలు, మరియు షేక్ మున్నాబి కుటుంబానికి 5000వేల రూపాయలు మొత్తం 15000 రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరిగంటి రమేష్ గౌడ్, గంజి సందీప్, పండుగ కిరణ్, బొమ్మారపు బాలరాజ్, షేక్ యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలను ఖండించిన మంత్రి సీతక్క



**ఏటూరు నాగారం,జనవరి 18(మనం న్యూస్):** పంచాయతీ కార్మికుల వేతనాలపై మాట్లాడే నైతిక హక్కు హరీష్ రావు కి లేదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆయన ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడే నెలల తరబడి జీతాలు రాక ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మార్చి 13, 2023 న పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ల ముందు వంటా వార్పు చేపట్టి నిరసన తెలిపిన వార్త కథనాలను మరిచారా? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు జీతాలియ్యకుండా అవస్థలకు గురి చేసి ఇప్పుడు మోసలి కన్నీరు కార్చడం వల్ల ప్రయోజనం శూన్యమన్నారు. పంచాయతీ కార్మికులు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఫీల్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల వంటి వేల మంది చిరు ఉద్యోగులను కనీసం మీ ప్రభుత్వం గుర్తించ లేదని, మీ తప్పులను మేము సరిదిద్దుతున్నాం, మీ హయాంలో అన్యాయానికి గురైన వర్గాలను ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా చేస్తున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగులకు సైతం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జీతాలు చెల్లించే విధానాన్నిరూపొందించి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామని వెల్లడించారు. ఇకపై 92 వేల మంది పంచాయతీ స్థాయి సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులకు తరహాలోనే జీతాలు, అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు.

## అవకతవకలు పాల్పడినట్టు రుజువు చేస్తే దేనికైనా సిద్ధం

- **నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి వివరణ**



**యాదగిరిగుట్ట, జనవరి 18 (మనం న్యూస్):** రెండేళ్ల ఏలాంటి అవకతవకలకు చోటు లేకుండా నార్మూల్ సంస్థను లాభాలు చేకూర్చే విధంగా కృషి చేశామని, తమ పాలకవర్గం అవకతవకలు పాల్పడిన్నట్లు రుజువు చేస్తే దేనికైనా సిద్ధమేనని నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుత నార్మూల్ చైర్మన్ గూడిపాటి మధుసూదన్ రెడ్డి అవగాహన లేక విమర్శిస్తున్నారని అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేవలం నార్మూల్ సంస్థ స్తిరాస్తులకు విక్రయించేందుకే చైర్మన్ పదవి చేజిక్కించుకున్నాడన్న అనుమానం వస్తోందన్నారు. సంస్థలో 25 ఏళ్లు కాంట్రాక్ట్ పద్దతిన పనిచేస్తున్న ఉద్యోగులను కాపాడుకునేందుకు వారిలో 180 మంది ఉద్యోగులను ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిబంధనల ప్రకారమే పర్మినెంట్ చేశామన్నారు. తమ హాయాంలో రూ.12 కోట్లలో రూ.6 కోట్లతో పెరుగు ఫ్లాంట్, నూతన బ్రాయిలర్తో పాటు నార్మూల్ భవనాన్ని సుందరీకరించామన్నారు. మిగతా రూ.6 కోట్లతో రోజుకు ఆదనంగా 60 వేల లీటర్ల పాలకు కట్టివ్వడంతోపాటు స్కిన్ మిల్క్ విక్రయాలకు వాడామన్నారు. రైతులకు లీటరుకు రూ. 5 బోనస్ ను కల్పించేందుకు వాడామని అన్నారు. మీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం పాల క్రయ, విక్రయాలు తగ్గిందన్నారు. రైతులకు లీటరుకు రూ. 1.50 తగ్గించారని అన్నారు. గతంలో రోజుకు 35 వేల పాలను విక్రయించినా సంస్థ నష్టాలో ఉంటే ప్రస్తుతం కేవలం 35 వేల లీటర్ల విక్రయిస్తే సంస్థ ఎలా నడిపిస్తారో చెప్పాలన్నారు. ఆడిట్ రిపోస్టు చూపించి ప్రభుత్వానికి రూ.45 లక్షల టాక్స్ కట్టకపోతే యాక్సిక్ బ్యాంకు లో రూ. 25 కోట్ల ఓడి ఉండదన్నారు. ఓడీని కాపాడుకునేందుకు మాత్రమే టాక్స్ కట్టాల్సి వచ్చిందని చెప్పారు. కనీస జ్ఞానం లేకుండా నార్మూల్ సంస్థను ఎలా నడిపించాలని భావిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు సంస్థ ఎండీని అడిగితే చెబుతారని గుర్తు చేశారు. రూ.50 కోట్ల లోటు బడ్జెట్తో సంస్థ కొనసాగుతుందని నూతన ఎన్నికైన జనరల్ బాడీ తొలి సమావేశంలో చెప్పానన్నారు. నష్టాల్లో ఉన్న సమయంలో సంస్థను ఎలా కొనసాగిస్తున్నారో చెప్పాలన్నారు. పదేళ్ల కాలంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం నార్మూల్ చైర్మన్ గా వ్యవహరించారని అన్నారు. కేవలం టీఆర్ఎస్ పార్టీ శ్రేణులను మాత్రమే విమర్శించడం తగదన్నారు. విమర్శించాలని భావిస్తే అందరి పేర్లను బహిర్గతం చేయాలన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వం నుంచి రూ.30. కోట్ల గ్రాంట్ ను తీసుకువస్తామని హామీనిచ్చి, అధికారంలోకి రాగానే ప్రభుత్వం నుంచి గ్రాంట్ రావని మాట మార్చడం పాడి రైతులను మోసం చేసిన్నట్టేనని అన్నారు. పాత బిల్లులను ఇస్తామని చెప్పి ఇప్పటికి నాలుగు నెలలు గడుస్తున్నా బిల్లులను పెండింగ్ లో పెట్టడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రాంట్స్ తీసుకురాని, నీకు సంస్థ భూములను విక్రయించే అర్హత లేదన్నారు. దమ్ముంటే ఒక ఏడాది పాటు నష్టాలు లేకుండా సంస్థను కొనసాగించి, చూపాలన్నారు. అలా కొనసాగిస్తే భూములను విక్రయించేందుకు సహకరిస్తామని చెప్పారు. మా పాలనలో చేపట్టిన అభివృద్ధి. ఖర్చు ఆదారాలతో సహా వివరణ ఇచ్చేందుకు సిద్ధమేనని అన్నారు.

## ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్



**వరంగల్, జనవరి 18(మనంన్యూస్):** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జిల్లా గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి,ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, మార్కెట్ కార్యదర్శి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు ... మీ ఓటును వృధా కానివ్వొద్దు!

- **ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి**



**నాగార్జునసాగర్, జనవరి 18(మనం న్యూస్):** రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి శనివారం నందికొండ మునిసిపాలిటీ పరిధిలోని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు సంబంధించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మళ్లీ తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు.అందుకు అన్నీ నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయులు ఎన్నికలకు సన్నద్ధం కావాలని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి సమస్యలు ఏవైతే ఉన్నవో అవి టైం స్కేలుకు సంబంధించి , పాత పెన్షన్ విధానాన్ని మళ్లీ కొనసాగించే విధంగా, అదేవిధంగా డిగ్రీ కాలేజీ అధ్యాపకులకు యూజీసీ స్కేల్ తో పాటు పాఠశాల నుంచి డిగ్రీ కాలేజీకి ప్రమోషన్ పై వచ్చిన అధ్యాపకులకు పాత సర్వీసు కలిసే విధంగా చూడాలని ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తప్పక పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే ఉపాధ్యాయులందరూ తమ ఓటును వృధా కానివ్వకుండా తమకు ఎవరైతే మేలు చేస్తారని అనుకుంటారో వారిని ఎన్నుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ మాధవి లత,పాఠశాల ఉపాధ్యాయులు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు గడువులోగా పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, జనవరి18(మనంన్యూస్):** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మితో పాటు సంబంధిత శాఖ అధికారి, డి ఈ ఓ మరియు ఎంఈఓ లతో సమీక్ష నిర్వహించి జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు పూర్తి అయి ఎంబిల తో పాటు పనులలో పూర్తయిన పనులకు ముందు తర్వాత ఫోటోలు తీసి జియో టాకింగ్ చేసి ఫోటోతో పాటు ఎం బి లు అడ్మినిస్ట్రేషన్ మంజూరుకి ఇవ్వాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం మంజూరైన పనులు 1208 కు గాను 199 పనులు పెండింగ్ లో ఉన్నాయని, మిగతా పనులు పూర్తి అయ్యాయని, పెండింగ్ పనులను రెండు రోజుల్లో పూర్తిచేసి ఎంబీలతో పాటు పనులకు ముందు తర్వాత ఫోటోలు తీసి జియో టాకింగ్ చేసిన ఫోటోలతో పాటు ఎం బి లు అడ్మినిస్ట్రేషన్ మంజూరుకి ఇవ్వాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి డిఆర్ఓ విజయలక్ష్మి డిఇఓ జగదీశ్వర్, ఇ ఇ పి ఆర్ ఇజ్జగిరి, అమ్మ ఆదర్శ పాఠశాలల ప్లానింగ్ కో-ఆర్డినేటర్ విజయ్ కుమార్,సంబంధిత మండలాల ఎంఈఓ లు ఏఈలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బీసీ రాజ్యాధికారమే లక్ష్యం



- **ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ లింగంపల్లి చిరంజీవి**

**మిర్యాలగూడ, జనవరి 18 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజ్యాంగపరంగా బీసీలకు 42 శాతం పోటీ చేసే అవకాశం కల్పించే విధంగా బీసీలంతా ఏకమై పోరాడాలని బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ లింగంపల్లి చిరంజీవి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మిర్యాలగూడ పట్టణం బీసీ భవన్ లో రాష్ట్ర కార్యదర్శి దాసరాజు జయరాజుతో కలిసి నల్లగొండ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలుగా కొమ్మరాజు నాగమణి, జిల్లా కార్యదర్శి చెవుల వెంకటేశ్వర్లు, మిర్యాలగూడ పట్టణ కార్యదర్శిగా నక్క వెంకన్న లను అధికారికంగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలంతా కష్టపడాలన్నారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే బీసీ అభ్యర్థులకు బీసీ రాజ్యాధికార సమితి సంపూర్ణ మద్దతుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బంటు దుర్గయ్య తదితరులు ఉన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



**కోదాడ,జనవరి 18 (మనం న్యూస్):** నూతనంగా ఎన్నిక కాబడిన కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్ లను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేయడం జరిగింది. కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండెపంగు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు మొదటి సారిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించటం అభినంది ంచదగ్గ విషయమని, నడిగూడెం మండల కేంద్రాని కి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తిరుపతమ్మ సుధీర్లకు చైర్మన్ అవకాశం రావడం సంతోషించదగ్గ విషయమని వారి నియామకానికి సహకరించిన మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డికి,స్థానిక శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతికి అభినంద నలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో, దైవస్వరూపి చర్చి సేవకురాలు కలపాల లావణ్య, గుండెపం గు రవి, సమత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి రద్దు

- **జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**భువనగిరి, జనవరి 18(మనం న్యూస్):** రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ( 20.01.2025) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. జిల్లాలో నాలుగు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం సర్వే నిర్వహిస్తున్న సందర్భంగా ప్రజావాణి ని రద్దు చేయడం జరిగిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించగలని, సర్వే కోసం వస్తున్న అధికారులకు అందుబాటులో ఉండడం కోసం ప్రజావాణి రద్దు చేయడం జరిగింది.

## పట్టణ అభివృద్దే ధ్యేయంగా ముందడుగు



- **మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్**

**జగిత్యాల ప్రతినిధి, జనవరి 18( మనం న్యూస్):** అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలో 13,43,వ వార్డులలో 20 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆయా వార్డులలో జగిత్యాల చైర్పర్సన్ అడువల జ్యోతి లక్ష్మణ్ భూమిపూజ చేశారు.పట్టణంలో యేండ్ల క్రితం వేసిన రహదారులన్ని గుంతలమయంగా మారాయని అభివృద్ధిలో భాగంగా ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే రహదారుల డ్రైనేజీ లు సిసి రోడ్లు పనులు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.పట్టణంలో ఒక్కో వార్డులో ఇప్ప టికే రూ.కోటికి పైగా నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ప్రజలు ఇళ్ల నిర్మాణం చేపట్టే ముందు లే అవుట్ ప్రకారం చేయాలన్నారు. అమృత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ మంచినీరు అందజేయడం కోసం పనులు జరుగుతున్నాయని వివరించారు.ఈ కార్యక్రమంలో ,కమిషనర్ చిరంజీవి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్లు ఆసియా సుల్తానా-కమల్, ఫిర్దూస్ బేగం-నదీమ్,అడ శరన్,కౌన్సిలర్ లు,కో ఆప్షన్ సభ్యులు,వార్డు నాయకులు కార్యకర్తలు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట గ్రామాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**వరంగల్, జనవరి 18(మనంన్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే రైతు భరోసా కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి శనివారం వరంగల్ జిల్లా కొత్త పేట, గ్రామాన్ని తనిఖీ చేశారు. వరంగల్ జిల్లా కొత్తపేటలో రైతు భరోసా పథకం టీం ను ఆకస్మికంగా తనిఖీ చేసి తనిఖీ చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ తనిఖీలో భాగంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతు భరోసా కార్యక్రమంలో భాగంగా గతంలో పట్టాదారు పాస్ బుక్ కలిగిన ప్రతి ఒక్కరికి రైతు భరోసాను వర్తింపజేశారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం రైతులు పండించే పంట పొలాలకు మాత్రమే రైతు భరోసా వర్తించేలా నిబంధనలు రూపొందించడమైనదని, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తగా సర్వ నిర్వహించాలని సర్వే టీం ను ఆదేశించారు. ఈ తనిఖీల్లో వరంగల్ తాసిల్దార్ ఇక్బాల్, సంబంధిత మండల అగ్రికల్చర్ ఆఫీసర్ , ఆర్ ఐ లు, సర్వేయర్ , తదితరులు ఉన్నారు.

## ఎన్టీఆర్ కు భారతరత్నం ఇవ్వాలి




- **తెలుగుదేశం పార్టీ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి రేగు బాల నరసయ్య**

**యాదగిరిగుట్ట, జనవరి 18 (మనం న్యూస్):** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక స్వర్గీయ నందమూరి తారక రామారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించాలని తెలుగుదేశం పార్టీ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి, భువనగిరి పార్లమెంట్ ఆడ్ హక్ కమిటీ సభ్యులు రేగు బాల నర్సయ్య డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణాలో మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఎన్టీఆర్ చిత్రపాతానికి పూలమాల చేసి ఘనంగా నివాళులర్పించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే రెండు రూపాయల కిలో బియ్యం పథకం తీసుకొచ్చి సంక్షేమ పథకాలకు నాంది పలికినటువంటి వ్యక్తి ఎన్టీ రామారావుఅని, మాండలిక వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చిన మహోన్నత నాయకులు, తెలంగాణలో పటేల్ పట్వారి వ్యవస్థను రద్దుచేసి తెలంగాణ రైతాంగాన్ని విముక్తి పరిచినటువంటి మహానాయకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని, ఆయనకు భారతరత్న ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నా.ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంటు పార్టీ కార్యదర్శి ఆడ్ హక్ కమిటీ సభ్యులు గుండా భాస్కర్, యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షులు మచ్చ నరసింహ గౌడ్, ప్రధాన కార్యదర్శి కల్లెం బాబురావు గౌడ్, పట్టణ శాఖ అధ్యక్షులు చిత్తర్ల శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మొక్కల శ్రీశైలం యాదవ్, మహిళా నాయకురాలు ఆకుల పద్మ, గుజ్జ నిర్మల ,అండమ్మ, సుశీల నాయకులు ఎడపల్లి సత్తయ్య , కోల వెంకటేష్ ,బండ కింద కృష్ణ గౌడ్,రాజా సింగ్, సుంచు పెద్ద పోచయ్య, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని పవర్ ప్లాంట్ ముందు నిరసన




**జైపూర్, జనవరి 18 (మనం న్యూస్):** జైపూర్ మండలంలోని సింగరేణి విద్యుత్ థర్మల్ పవర్ ప్లాంట్ ఎదుట హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులతో కలిసి కాంట్రాక్టు కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. పవర్ ప్లాంట్ ముందు సమ్మె పిలుపు మేరకు శనివారం ఎస్ టి పి పి కాంటాక్ట్ కార్మికులందరూ పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఇటీవల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్ పిలుపునివ్వడంతో అధిక సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొని కార్మికులందరికీ న్యాయం జరగాలని అన్ని సౌకర్యాలు ఇవ్వాలని నినాదాలు చేస్తూ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ యూనియన్ అధ్యక్షులు మాట్లాడుతూ మనదేశంలో పవర్ ప్లాంట్ ఎక్కడ ఉన్నా కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని ఇక్కడ మాత్రం కార్మికులకు నిరాశే చూపుతున్నారని సింగరేణి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. కార్మికులకు డస్ట్ అలవెన్స్తోపాటు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని ఈఎస్ఐ ఆసుపత్రి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దాంతోపాటు దత్తత గ్రామాలను అభివృద్ధి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, ఎస్ టి పి పి నాయకులు విక్రం, సాయి కృష్ణారెడ్డి, వంటకాల అనిల్ రెడ్డి, రిక్కుల నరసింహారెడ్డి, సంపత్, నోముల బాలయ్య కళాబృందం నాయకులు రమేష్, హెచ్ ఎం ఎస్ కార్యకర్తలు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# భారత జట్టు ప్రకటన

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025కి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తమ జట్టును ప్రకటించింది. ఈ మెగా టోర్నీలో భాగమయ్యే ఆటగాళ్ల పేర్లను శనివారం వెల్లడించింది. సిరాజ్, సంజూకు మొండిచేయి.



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ జట్టు వివరాలను మీడియాకు తెలిపాడు. ఈ టోర్నీలో రోహిత్ శర్మకు డిప్యూటీగా శుబ్ మన్ గిల్ వ్యవహరించనున్నాడు. అదే విధంగా.. యశస్వి జైస్వాల్ తొలిసారిగా వన్డే జట్టులో చోటు దక్కించుకోగా.. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ కు మాత్రం సెలక్టర్లు మొండిచేయి చూపారు.

అయితే, తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డికి మాత్రం ట్రావెలింగ్ రిజర్వ్స్లో చోటు దక్కింది. పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు బ్యాకప్ గా అతడిని ఎంపిక చేశారు.

**ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025లో పాల్గొనబోయే భారత జట్టు**

రోహిత్ శర్మ(కెప్టెన్), శుబ్ మన్ గిల్(వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రిషభ్ పంత్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, జస్ ప్రీత్ బుమ్రా(ఫిట్నెస్ ఆధారంగా) మహ్మద్ షమీ, అర్ష్‌దీప్ సింగ్.

**ట్రావెలింగ్ రిజర్వ్స్:** వరుణ్ చక్రవర్తి, ఆవేశ్ ఖాన్, నితీశ్ కుమార్ రెడ్డి

**చాంపియన్స్ ట్రోఫీలో భారత్ షెడ్యూల్ ఇదే**

ఫిబ్రవరి 20, 2025 (దుబాయ్)- బంగ్లాదేశ్ vs భారత్
ఫిబ్రవరి 23, 2025 (దుబాయ్)- పాకిస్తాన్ vs భారత్
మార్చి 2, 2025 (దుబాయ్) న్యూజిలాండ్ vs భారత్.

## ఖో-ఖోకు పెరుగుతున్న స్పాన్సర్షిప్

భారతీయ క్రీడగా పేరొందిన ఖో-ఖోకు స్పాన్సర్షిప్ పెరుగుతోంది. ఈ ఆటను మరింత మందికి చేరువ చేసేందుకు కార్పొరేట్ కంపెనీలు తమ సహకారం అందిస్తున్నాయి. అంతర్జాతీయ గుర్తింపు లభించే దిశగా ఖో-ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (కేకేఎఫ్ఐ) పని చేస్తోంది. 2000 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఖో-ఖోను చాలాకాలంగా దక్షిణ ఆసియాలో ఎక్కువగా ఆడుతున్నారు. అయితే క్రికెట్ అంతటి ప్రజాదరణ పొందడంలో మాత్రం వెనకబడింది. ఈ పరిస్థితిని మార్చి ఖోఖోను ప్రపంచ వేదికలపై నిలబెట్టే ప్రయత్నాన్ని కేకేఎఫ్ఐ చేస్తోంది. ఇందులో భాగంగా ఈ సంస్థ మరిన్ని స్పాన్సర్షిప్లకు కోసం చూస్తోంది.



## ఎంపీ ప్రియతో రింకు పెళ్లి?





పార్లమెంట్ సభ్యురాలు ప్రియ సరోజ్ (సమాజ్ వాదీ పార్టీ)ను భారత యువ క్రికెటర్ రింకు సింగ్ పెళ్లి చేసుకోబోతున్నాడనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మొదట ఈ ఇద్దరికీ నిశ్చితార్థం జరిగిందనే ప్రచారం జోరుగా సాగింది. కానీ ప్రియ తండ్రి తుఫాని సరోజ్ దీన్ని ఖండించారు. రింకు కుటుంబ సభ్యులు పెళ్లి ప్రతిపాదన తెచ్చారని, ఇంకా చర్చలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఉత్తర్ ప్రదేశ్ లోని మచ్చలి షహర్ నుంచి ఎంపీగా ప్రియ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# జకోవిచ్ జోరు



ఆస్ట్రేలియన్ ఓపెన్ లో 11వ టైటిల్ పై కన్నేసిన జకోవిచ్ (సెర్బియా) దూకుడు ప్రదర్శిస్తున్నాడు. రెండో సెట్ ఆరంభంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురైనప్పటికీ, కోర్టులోనే చికిత్స తీసుకున్న తర్వాత గొప్పగా ఆడిన అతను.. ప్రిక్వార్టర్స్ లో అడుగుపెట్టాడు. శుక్రవారం పురుషుల సింగిల్స్ మూడో రౌండ్లో ఏడో సీడ్ జకోవిచ్ 6-1, 6-4, 6-4తో మచాక్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు. తొలి రెండు మ్యాచ్ ల్లో ఒక్కో సెట్ కోల్పోయిన నొవాక్.. ఈ మ్యాచ్ లో మాత్రం పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. 28 విన్నర్లు కొట్టిన అతను, 20 అనవసర తప్పిదాలు మాత్రమే చేశాడు. 9 ఏస్లు సంధించాడు. తొలి సెట్లో జకో జోరు ముందు ప్రత్యర్థి తేలిపోయాడు. నాలుగో గేమ్ లో మచాక్ సర్వీస్ ను బ్రేక్ చేసి 3-1తో ఆధిక్యంలో దూసుకెళ్లిన జకో.. అదే ఊపులో వరుసగా మూడు గేమ్ లు గెలిచాడు. ఆ తర్వాతి రెండు సెట్లలో ప్రత్యర్థి నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదురైనా.. అనుభవాన్ని ఉపయోగించి జకో విజేతగా నిలిచాడు. మరోవైపు రెండో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6-3, 6-4, 6-4తో జేకబ్ (బ్రిటన్)పై, మూడో సీడ్ అల్కరాస్ (స్పెయిన్) 6-2, 6-4, 6-7 (3-7), 6-2తో బోర్గెస్ (పోర్చుగల్)పై నెగ్గారు. మెన్సిక్ పై 3-6, 4-6, 7-6 (9-7), 6-4, 6-2తో పైచేయి సాధించిన డేవిడోవిచ్ (స్పెయిన్) 2005 తర్వాత ఈ టోర్నీలో వరుసగా రెండు మ్యాచ్ ల్లోనూ తొలి రెండు సెట్లు కోల్పోయి గెలిచిన తొలి ఆటగాడిగా నిలిచాడు. ఇక టామీ పాల్ (అమెరికా), హంబర్ట్ (ఫ్రాన్స్), జిరి (చెక్ రిపబ్లిక్) కూడా ముందంజ వేశారు.

**సబలెంక సత్తా:** మహిళల సింగిల్స్లో వరుసగా మూడో సారి విజేతగా నిలవాలనే పట్టుదలతో సబలెంక సత్తాచాటుతోంది. ఈ బెలారస్ భామ మూడో రౌండ్లో 7-6 (7-5), 6-4తో టాసన్ (డెన్మార్క్)పై విజయం సాధించింది. తొలి సెట్లో ప్రత్యర్థి నుంచి ఈ ప్రపంచ నంబర్ వన్ క్రీడాకారిణిగా గట్టి పోటీ ఎదురైంది. ఆ సెట్ హోరాహోరీగా సాగి టైబ్రేకర్ కు మళ్లింది. ఇందులో పైచేయి సాధించిన సబలెంక.. రెండో సెట్లోనూ దూకుడు కొనసాగించి మ్యాచ్ కైవసం చేసుకుంది. మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6-4, 6-2తో ఫెర్నాండెజ్ (కెనడా)పై గెలిచింది. మరోవైపు ఏడో సీడ్ పెగులా (అమెరికా)కు షాక్ తగిలింది. అన్సీడెడ్ డానిలోవిచ్ (సెర్బియా) 7-6 (7-3), 6-1తో పెగులాను ఓడించింది. మాజీ ఛాంపియన్ ఒసాక (జపాన్) ఉదర కండరం నొప్పితో బెన్సిచ్ (స్విట్జర్లాండ్)తో మ్యాచ్ మధ్యలోనే నిష్క్రమించింది. మరోవైపు బడోసా (స్పెయిన్), ఆండ్రీవా (రష్యా), వెకిచ్ (క్రొయేషియా), పవ్లీచెంకోవా (రష్యా) కూడా ప్రిక్వార్టర్స్ చేరారు.

**బోపన్న జోడీ శుభారంభం:** పురుషుల డబుల్స్ లో తొలి రౌండ్లోనే నిష్క్రమించిన రోహన్ బోపన్న.. మిక్స్డ్ డబుల్స్ లో మాత్రం శుభారంభం చేశాడు. చైనా అమ్మాయి షుయి జంగ్ తో జతకట్టిన బోపన్న రెండో రౌండ్లో అడుగుపెట్టాడు. తొలి రౌండ్లో బోపన్న- జంగ్ జోడీ 6-4, 6-4తో డోడిగ్ (క్రొయేషియా)- క్రిస్టీనా (ఫ్రాన్స్)పై నెగ్గింది. మరోవైపు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిస్తే కంగారూ చిత్రాన్ని పచ్చబొట్టుగా వేయించుకుంటానని స్పెయిన్ యువ సంచలనం అల్కరాస్ వెల్లడించాడు. ఇప్పటికే ఇతర మూడు గ్రాండ్ స్లామ్ లు గెలిచిన అతను.. ఈ టైటిల్ గెలిస్తే అతి పిన్న వయసులోనే కెరీర్ గ్రాండ్ స్లామ్ పూర్తిచేసిన ఆటగాడిగా నిలుస్తాడు.

## సెమీస్‌లో సాత్విక్ జోడీ

సాత్విక్- చిరాగ్ జోడీ దూసుకెళ్తోంది. ఈ భారత స్టార్ డబుల్స్ జంట ఇండియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీస్ లో అడుగుపెట్టింది. శుక్రవారం పురుషుల డబుల్స్ క్వార్టర్స్ లో భారత ద్వయం 21-10, 21-17



తేడాతో జిన్- మిన్ (కొరియా)పై విజయం సాధించింది. తొలి గేమ్ లో విరామానికి 11-3తో నిలిచిన ఈ జోడీ అదే ఊపులో గెలిచింది. రెండో గేమ్ లో 16-16తో సమంగా ఉన్న దశలో సాత్విక్ జోడీ ఒత్తిడిని దాటి విజయతీరాలకు చేరింది. మరోవైపు పీవీ సింధు పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్ క్వార్టర్స్ లో ఆమె 9-21, 21-19, 17-21 తేడాతో పారిస్ కాంస్య విజేత మరిస్కా తుంజుంగ్ (ఇండోనేసియా) చేతిలో ఓటమి పాలైంది. హోరాహోరీగా సాగిన పోరులో సింధు తలవంచక తప్పలేదు. పురుషుల క్వార్టర్స్ లో కిరణ్ జార్జ్ 13-21, 19-21తో యాంగ్ వెంగ్ (చైనా) చేతిలో పరాజయం చెందాడు.

## దేశవాళీలో ఆడకపోతే వేటు

భారత క్రికెట్ వ్యవస్థను గాడినపెట్టేందుకు బీసీసీఐ నడుంబిగించింది. స్టార్ సంస్కృతికి తెరదించేందుకు నూతన నియమావళిని తీసుకొచ్చింది. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. ఈమేరకు 10 పాయింట్లతో కూడిన నియమావళిని సెంట్రల్ కాంట్రాక్టు ఆటగాళ్లకు బీసీసీఐ పంపించింది. ప్రతి ఒక్క ఆటగాడు దేశవాళీ క్రికెట్లో తప్పనిసరిగా ఆడటం ఈ నియమావళిలో ప్రధానమైనది. బీసీసీఐ మార్గదర్శకాల ప్రకారం.. ''జాతీయ జట్టులో ఎంపికకు, సెంట్రల్ కాంట్రాక్టుకు అర్హులుగా ఉండాలంటే ఆటగాళ్లు దేశవాళీ మ్యాచ్ లలో పాల్గొనడం తప్పనిసరి. దేశవాళీలో ఆడకుండా మినహాయింపులు ఉండవు. అసాధారణ పరిస్థితుల్లో సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ అనుమతితో మినహాయింపు పొందొచ్చు'' అని పేర్కొంది. మార్గదర్శకాలను పాటించకపోతే ఆంక్షలతో సహా క్రమశిక్షణ చర్యలు ఉంటాయని బీసీసీఐ స్పష్టంచేసింది. భారత జట్టులో చోటుతో పాటు సెంట్రల్ కాంట్రాక్టు కోల్పోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించింది. ''ఐపీఎల్ తో సహా బీసీసీఐ టోర్నీల్లో పాల్గొనడం.. సెంట్రల్ కాంట్రాక్టు మొత్తం, మ్యాచ్ ఫీజులో కోతతో సహా ఆటగాడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే హక్కు బీసీసీఐకి ఉంది'' అని బోర్డు తెలిపింది. విదేశాల్లో పర్యటనల సమయంలో క్రికెటర్ల వెంట కుటుంబ సభ్యుల బసపైనా బోర్డు పరిమితులు విధించింది. 45 రోజులకు మించి ఉండే పర్యటనలో భాగస్వామి, పిల్లలు రెండు వారాలు మాత్రమే ఉండొచ్చు. తక్కువ వ్యవధి సిరీస్ లో కేవలం వారం రోజులు మాత్రమే అనుమతి ఉంటుంది. సిరీస్ మధ్యలో ఎలాంటి వ్యక్తిగత షూటింగ్ లు, వాణిజ్య ఒప్పంద కార్యక్రమాలకు బీసీసీఐ అనుమతి లేదు. సాధన, మ్యాచ్ లకు ఆటగాళ్లు వ్యక్తిగతంగా కాకుండా జట్టు బస్సులోనే ప్రయాణించాలి. కుటుంబంతో కలిసి ప్రయాణించాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. ప్రాక్టీస్ చేసేందుకు జట్టులోని ప్రతి ఆటగాడు రావాలి. మేనేజర్, చెఫ్, సహాయకులు వంటి వ్యక్తిగత సిబ్బందిని బోర్డు అనుమతి లేకుండా వెంట తీసుకురావడం కుదరదు.

---

మనం మూవీ+

ప్రస్తుతం తెలుగు సినిమాలు వరల్ వైడ్ గా ఎలాంటి వండర్స్ సెట్ చేస్తున్నాయో అందరికీ తెలిసిందే. అయితే ఇదే మన తెలుగు సినిమాని మన తెలుగు

మారింది. ఇది లేటెస్ట్ గా అయితే గేమ్ ఛేంజర్ విషయంలో జరిగింది. దీనితో సంగీత దర్శకుడు థమన్ చేసిన పలు కామెంట్స్ ఇపుడు సినీ వర్గాల్లో చర్చకి కూడా దారి తీశాయి. మరి తన కామెంట్స్ పై మెగాస్టార్ చిరంజీవి కూడా స్పందించడం అనేది ఇపుడు మరింత ఆసక్తిగా మారింది.

డియర్ థమన్ నిన్న నువ్వు మాట్లాడిన మాటలు హృదయాల్ని తాకేలా ఉన్నాయి. ఎప్పుడూ సరదాగా మాట్లాడుతూ వుండే నీలో ఇంత ఆవేదన వుండడం

## థమన్ ఆవేదనపై మెగాస్టార్ సపోర్ట్





ఆడియెన్సే కొంతమంది దారుణంగా చంపేస్తున్నారనే మాట కూడా వాస్తవం. ఇటీవల కొన్నాళ్ల వ్యవధిలోనే మన స్టార్స్ తాలూకా పలు సినిమాలు ఊహించని నెగిటివిటీ సోషల్ మీడియాలో చూస్తున్నాయి.

సినిమాలు చూసి మాట్లాడుతున్నారో తెలీదు చూడకుండా మాట్లాడుతున్నారో తెలీదు కానీ చాలా వరకు పలు స్టార్స్ సినిమాల విషయంలో ఇదే జరుగుతుంది. పాజిటివ్ కంటే నెగిటివ్ టాక్ ని సినిమాలు చూడకుండానే దారుణంగా స్ప్రెడ్ చేస్తూ సామాన్య ఆడియెన్స్ ని థియేటర్స్ కి దూరం చేసేస్తున్నారు. దీని ఫలితం ఆ సినిమాలు తీసిన వారి కష్టం వృథా కావడం అని చెప్పాలి.

నిజంగా సినిమాలో విషయం లేకపోతే పర్వాలేదు కానీ బాగానే ఉన్న సినిమాలకి కూడా ఎందుకు అంత నెగిటివిటీ అనేది అంతు చిక్కని ప్రశ్నగా

నాకు ఒకింత ఆశ్చర్యంగా కూడా అనిపించింది. కానీ మనసు ఎంత కలత చెందితే నువ్వింతగా స్పందించావో అని అనిపించింది. విషయం సినిమా అయినా క్రికెట్ అయినా మరో సామజిక సమస్య అయినా సోషల్ మీడియా వాడుతున్న ప్రతి ఒక్కరు తమ మాటల తాలూకు ప్రభావం ఆ వ్యక్తుల మీద ఎలా వుంటుందని ఆలోచించాలి. ఎవరో అన్నట్టు మాటలు ఫ్రీ నే, మాటలు ప్రేరణ కలిగిస్తాయి అలాగే అదే మాటలు నాశనం కూడా చేస్తాయి. అందుకే ఆచి తూచి మాట్లాడాలి అంటారు. మనం పాజిటివ్ గా వుంటే ఆ ఎనర్జీ మన జీవితాలని కూడా అంతే పాజిటివ్ గా ముందుకు నడిపిస్తుంది. అంటూ చిరు తన మద్దతు థమన్ వ్యాఖ్యలపై అందించారు.

## ఇండియన్-3 సినిమాపై శంకర్ ప్రకటన




నటుడు కమలహాసన్, శంకర్ కాంబినేషన్లో రూపొందిన తొలి చిత్రం ఇండియన్.. ఏఎం. రత్నం నిర్మించిన ఈ చిత్రం 1996లో విడుదలై సంచలన విజయాన్ని సాధించింది. 26 ఏళ్ల తర్వాత దానికి సీక్వెల్ గా ఇండియన్-2 రూపొందింది. అదే దర్శకుడు, నటుడు నటించిన ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. కాగా గత ఏడాది విడుదలైన ఈ చిత్రం పూర్తిగా నిరాశపరిచింది. ఇకపోతే దర్శకుడు శంకర్ తొలిసారిగా తెలుగులో రామ్ చరణ్ కథానాయకుడుగా తెరకెక్కించిన చిత్రం గేమ్ చేంజర్. బడ్జెట్లో బ్రహ్మాండంగా రూపొందిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదలై సక్సెస్ ఫుల్ గా ప్రదర్శించబడుతోంది. దీంతో దర్శకుడు శంకర్ మరో చిత్రం ఏంటన్న విషయంపై జరుగుతున్న చర్చకు ఆయన ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొంటూ ఇండియన్-3 చిత్రంపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఈ చిత్రానికి సంబంధించి కొన్ని సన్నివేశాలను చిత్రీకరించాల్సి ఉందని చెప్పారు. ఇవన్నీ పూర్తికావడానికి మరో ఆరు నెలల సమయం పడుతుందని అన్నారు. అన్ని కార్యక్రమాలను త్వరగా పూర్తిచేసి ఆరు నెలల్లో తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా తన దర్శకత్వంలో వేల్పారి అనే చారిత్రక కథా చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు చెప్పారు. మదురై ఎంపీ ఎస్ వెంకటేశన్ రాసిన రచించిన నవల ఆధారంగా కథను సిద్ధం చేసినట్లు తెలిపారు.

## మహేష్, రాజమౌళి ప్రాజెక్ట్.. ఆ రూమర్‌లో నిజం లేదా!?

ప్రస్తుతం ఇండియన్ సినిమా దగ్గర మోస్ట్ అవైటెడ్ భారీ ప్రాజెక్ట్ లలో దర్శకుడు రాజమౌళి అలాగే సూపర్ స్టార్ మహేష్ బాబు కలయికలో చేయనున్న సినిమా కూడా ఒకటి. వీరి కలయికలో సినిమా ఎన్నో ఏళ్ళు కితం నుంచి అలా కలగానే ఉన్న నేపథ్యంలో ఎట్టకేలకు ఈ రెండు మెగా ఫోర్సెస్ కలిసాయి. ఇలా తెరకెక్కనున్న ఈ సినిమాపై ప్రపంచ వ్యాప్త అంచనాలు నెలకొనగా ఈ సినిమాపై పలు ఇంట్రెస్టింగ్ రూమర్స్ కూడా లేకపోలేవు.

వాటిలో ఒకటి ఇపుడు నిజం కాదని తెలుస్తుంది. ఈ చిత్రంలో మహేష్ బాబు సరసన ప్రముఖ బాలీవుడ్ నటి ఇపుడు హాలీవుడ్ లో సెటిల్ అయ్యిన ప్రియాంక చోప్రా ఉన్నట్టుగా ఆ మధ్య రూమర్స్ వినిపించాయి.

కానీ ఇపుడు దీనిపై క్లారిటీ వినిపిస్తుంది. దీనితో ఆమె ఈ సినిమాలో లేనట్టే అని తెలుస్తుంది. సో ప్రియాంక చోప్రా ఈ చిత్రంలో దాదాపు లేనట్టే అని అనుకోవాలి. ఇక ఈ సినిమాపై మరిన్ని డీటెయిల్స్ ఇంకా రావాల్సి ఉంది.





## పవన్‌కి పోటీగా నితిన్ సినిమా రాబిన్ హుడ్ కొత్త డేట్ వచ్చేసింది

ఈ ఏడాదిలో మన తెలుగు సినిమా నుంచి రిలీజ్ కి రానున్న అవైటెడ్ చిత్రాల్లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న పాన్ ఇండియా సినిమా హరిహర వీరమల్లు కూడా ఒకటి. ఆల్రెడీ మార్చ్ 28కి ఈ సినిమాని మేకర్స్ లాక్ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాతో పాటుగా మళయాళం నుంచి ఎంపురాన్ అలాగే విజయ్ దేవరకొండ భారీ సినిమా కూడా ఆ సమయానికి లైన్ లో ఉన్నాయి.

మరి లేటెస్ట్ గా ఈ రేస్ లో యూత్ స్టార్ నితిన్ జాయిన్ అయ్యాడని చెప్పాలి. నితిన్ అలాగే దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్ లో చేస్తున్న అవైటెడ్ సినిమానే రాబిన్ హుడ్. గత డిసెంబర్ లోనే రిలీజ్ కావాల్సి ఉన్న ఈ సినిమాని మేకర్స్ వాయిదా వేసి ఇపుడు కొత్త డేట్ అనౌన్స్ చేశారు.

దీనితో ఈ సినిమా కూడా మార్చ్ 28న రిలీజ్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. మరి అదే రోజున నితిన్ అభిమాన హీరో పవన్ కళ్యాణ్ చేస్తున్న పాన్ ఇండియా సినిమా హరిహర వీరమల్లు కూడా ఉంది. మరి తన సినిమాకి పోటీగా ఈ సినిమాని అనౌన్స్ చేయడం ఇపుడు గమనార్హం. మరి ఈ రెండు వస్తాయా లేక ఒకటి ఆగుతుందా అనేది చూడాలి.

## మ్యాడ్ స్క్వేర్ రిలీజ్ డేట్ వచ్చేసింది!

మన టాలీవుడ్ యూత్ దగ్గర మంచి హిట్ అయ్యిన పలు యూత్ ఫుల్ ఎంటర్టైనర్ చిత్రాల్లో యంగ్ హీరోస్ నార్నె నితిన్, సంగీత్ శోభన్ అలాగే రామ్ నితిన్ లు హీరోలుగా చేసిన మ్యాడ్ కూడా ఒకటి. మరి భారీ హిట్ అయ్యిన ఈ సినిమాకి సీక్వెల్ గా మ్యాడ్ స్క్వేర్ ని మేకర్స్ అనౌన్స్ చేయడంతో దానిపైన కూడా మంచి బజ్ నెలకొంది. అలాగే దీనిపై వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ కూడా మంచి హిట్ కాగా ఇపుడు ఫైనల్ గా ఈ సినిమా రిలీజ్ డేట్ ని ఫిక్స్ చేసేసారు.



దీనితో ఈ అవైటెడ్ క్రేజీ సీక్వెల్ ని మార్చ్ 29న గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నట్టుగా అనౌన్స్ చేసేసారు. సో మ్యాడ్ రైడ్ ఆరోజు నుంచి మొదలు కానుంది అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి కూడా భీమ్స్ సంగీతం అందిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్ ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు కలయికలో సంయుక్తంగా నిర్మాణం వహిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.